ఆంధ్ర సచిత్ర వారపత్రిక



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

25 నయాపైసలు
4-3-'59.



ముఖలింగం (శ్రీకాకుళంజిల్లా), సోమేశ్వరాలయం

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సంవత్సర చందా రు. 13—0—0 విడిప్రతిక 25 న.పై	Founder: K. NAGESWARA RAO విలంబ మాఘం బహుళ దశమి బుధవారం	సంపుటము 53 సంచిక 23 4-3-59

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
వెంకటేశ్వర ప్రొడక్షన్సువారి 'సతీసుకన్య'లో
కృష్ణకుమారి



ఆంధ్రప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు

"యాత్రిక్"

ప్రఖ్యాత పాశ్చాత్యశాస్త్రజ్ఞుడూ, కీర్తిశేషుడూ అయిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్—"థియొరీ ఆఫ్ రిలేటివిటీ" అన్న ఒక గొప్ప ప్రాథమిక వైజ్ఞానికసూత్రాన్ని ప్రతిపాదించాడు.

"అలా అంటే ఏమిటండీ?" అని ఎవరో శఠగోపాచార్యులు ఆయన్ను అడిగాడట.

"అబ్బాయ్, ఆచార్లూ! నీవు గనుక నాబోటి ముసలివాడి దగ్గర అయిదు నిమిషాలు కూచుంటే, అయిదు యుగాలు గడచినట్లనిపిస్తుంది. అదే—ఇరవైఒక్క ఏళ్ళ చక్కని చుక్క ప్రక్కన అయిదురోజులు కూచుంటే అయిదు సెకండ్లనిపిస్తుంది. ఈ వ్యత్యాసాల బాంధవ్య రహస్యమే నా సూత్రం"—అని అంత పెద్ద థియొరీని ఐన్‌స్టీన్ మూడు వాక్యాలలో ముచ్చటగా విశదపరిచి ఆచార్లు చెవిలో పెట్టి పంపేశాడుట!


* * *

ఆమధ్య ఒక మహానగరంలో ఒకానొక అమాత్యుని 'కిడ్నీ'లోని బఠాణీగింజంత 'గాల్ స్టోన్' అనబడే 'కాంక్రీటు' పదార్థాన్ని బయటకు లాగేయడానికి, హేమాహేమీలయిన శస్త్రచికిత్సా నిపుణులు 'ఏమేమో!' అనుకుంటూ పోగయి, ఆ కాస్తకార్యాన్నీ ఘన విజయంతో సాధించారు. ఆరోజు రోజల్లా 'సర్చిలైటు' పెట్టి వెతికినా ఆ మహానగరంలో 'ఆపరేషన్' చేయగల డాక్టరే ఒకపట్లాన దొరకలేదని వదంతి.

రాష్ట్ర ఆర్థిక స్థితి

ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి రాష్ట్ర శాసనసభలో ఫిబ్రవరి 20 న 1959 60 సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక మంత్రిహోదాలో వీరు రాష్ట్ర ఆయవ్యయాలను ప్రతిపాదించడం ఇదే మొదటిసారి. బడ్జెట్‌లో వీరు ఇచ్చిన వివరాలను బట్టి చూస్తే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిలో ఏవిధమైన ఒడుదుడుకులు లేవనే వ్యక్తమవుతున్నది. కొత్త సంవత్సరానికి అన్ని పద్దులక్రిందా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం 71 కోట్ల 29 లక్షల రూపాయలు వుంటుందనీ, మొత్తం ఖర్చు 71 కోట్ల 67 లక్షలు వుంటుందనీ అంచనా వేశారు. అంటే కనబరిచిన లోటు అంచనా 38 లక్షల రూపాయలు మాత్రమే. దీన్ని భర్తీచేయడానికి ఏ విధమైన కొత్తపన్నులను రాష్ట్ర ప్రభుత్వం విధించదలచలేదు. ఈ చిన్న లోటు వేరేవిధంగా భర్తీ చేసుకోవచ్చునని ఆర్థికమంత్రి విశ్వాసం.

ఆంధ్రరాష్ట్రం 1953 అక్టోబరు 1 న ఏర్పడినప్పుడు దానికివున్న నిలవధనం ఒక లక్షరూపాయలు మాత్రమే. 1954 మార్చి 31 లో అంతమైన అర్థసంవత్సరానికి అప్పటిలో రాబడి 11 కోట్ల 80 లక్షలు రూపాయలు. 1954-55 లో రాబడి 19 కోట్ల 82 లక్షలు; వ్యయం 25 కోట్లు. 1956 లో ఆంధ్ర రాష్ట్రం విశాలాంధ్రగా మారింది. 1958-59 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాబడి 63 కోట్ల 66 లక్షలు; వ్యయం 62 కోట్ల 87 లక్షలు. 19 9-60 వచ్చేసరికి రాబడి 71 కోట్ల 29 లక్షలకు పెరుగుతున్నదంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆయేటి మెనుఎంత ఆశావహంగా పరిణమిస్తున్నదో అర్థం చేసుకోవచ్చు. ★



ఉత్తమ నటుడు కాశ్యప్

ఇటీవల ఖర్గపూర్‌లో జరిగిన 'ప్రవాసాంధ్ర నాటక కళాపరిషత్' పోటీ నాటికలు "ఏమి జీవితాలు" "పుణ్యస్థలి" అనే వాటిలో ఉత్తమనటుడుగా ప్రథమ బహుమతి, శ్రీ అక్కినేని నాగేశ్వరరావుగారి రజితపాత్ర బహుమతిపొందిన కాశ్యప్

★ ఆంధ్రప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు ★

—ప్రస్తుతం ఒక వైద్యకళాశాలకు పుట్టినిల్లూ, ఆంధ్ర రాజధానీ నగరముకు ఒకప్పటి మెట్టినిల్లూ అయి, నేను ప్రస్తుతం వుంటున్న ఊర్లో సర్కారువారి పెద్ద ఆస్పత్రిలో ఒకానొకరోజు పట్టపగలు, ఒక పెద్దసైజు శునకరాజం తిన్నగా ఒక వార్డులోకివచ్చి నిద్రపోతున్న బాలింతరాలి ప్రక్కనున్న పసికందును నోటకరుచుకుని, తీరిగా బయటకు వెళ్ళిపోయింది! (అలా వెళ్ళిపోలేదనీ, కుక్క నోటినుండి పాపను రక్షించారనీ మరొక కథనం.)

ఏది ఏమయినా కుక్క ఇంత నిరాఘాటంగా వార్డులోకి రావడం, దాని నోటికి పాపాయి అందడం ఆ కారణంచేత బయలుదేరిన అలజడి ఫలితంగా ఒక పెద్ద పదవిలోని వైద్యాధికారికి స్థానచలనం కలగడం ఆశ్చర్యం.

'అమాత్యుల ఆపరేషను'తో ఈ 'శునకమూ—శిశువూ' కథను పోలిస్తే ఐన్‌స్టీన్-శివగోపాలాచార్ల సంభాషణ సెనురుకు రావడం కూడా సహజం.

గౌరవనీయులైన మంత్రిసత్తముల ఘనతవహించిన శాలీల తాలూకు 'మైనర్ పేపర్'లకని ఒక అఖిలభారత వైద్య సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకోమనండి; అందుకు మన అభ్యంతరమేమీ లేదు; ఆ శ్రద్ధలో వెయ్యోవంతు, ఆ ప్రేమలో ఒక చిన్న భిన్నం సామాన్యులమీదకూడా ప్రసరింపచేస్తే మనలాంటివాళ్ళం ఎంతైనా బాగుపడతామని, పునాదులు ఆరోగ్యంగా వుంటేనే పెద్దలూ పిన్నలూ కలకాలం కలికాల మహాత్మ్యం మరచిపోయి కలలతో సుఖంగా కాలం గడుపుతూ వుండవచ్చని మనవి.

* * * *

నామట్టుకు నేను చూచినంతలో ఈ ఒక్క వూరిలోనే కాదు, మరొక వైద్యకళాశాలా ఆంధ్ర న్యాయస్థానానికి అరక్కోణం జంక్షనూ అయిన మరొక పట్టణంలోని పెద్ద ఆస్పత్రులలో పరిస్థితి ఇలాగే వుంది. అక్కడ తాముకూడా వైద్య సిబ్బందిలో ఒక భాగమయినట్లు నానారకాల శునకాలూ, డాక్టర్లూ నర్సులూ ఆయాలతోబాటు వార్డుల వెంబడి తిరుగుతూ, ఆపరేషన్ గదులలోకి, స్పెషల్ గదులలోకి చిత్తం వచ్చిన రీతిలో దూరుతూ, మధ్య మధ్య లేవలేని పేషంట్ల రేషన తాలూకు రొట్టెలు మొదలైనవాటని తీసుకుని పోతూ పోతూ, వెన్న పాకెట్లు మరిచిపోయినట్లు మళ్ళీ వెనక్కి వస్తుండడమూ సామాన్య విషయమే. పాపం జీతం బత్తెం లేక ఇలా ఆస్పత్రులలో సేవచేస్తున్నాయిగదా ఈ గ్రామసింహాలకు కూడా ఏదయినా యూనిఫారాలు పారేయమని ఎవరయినా నిరాహారదీక్ష పూనకూడదా అనిపిస్తుంది.

అంటే, తమ తమ విధులను భక్తి శ్రద్ధలతో ప్రజాక్షేమం దృష్ట్యా నిర్వహిస్తున్న డాక్టర్లూ, సేవచేస్తున్న నర్సులూ లేరని కాదు; ప్రాణ, ఆరోగ్యదానాలను చేస్తూ తమ ఉనికిని సార్థక పరచుకుంటున్న హాస్పిటళ్ళు లేవని కాదు. రాష్ట్రంలో మారుమూలల్లో వున్న ప్రతీ చిన్న ఆస్పత్రీ ఆదర్శప్రాయంగా వుండాలి. వాటికి సంబంధించిన సిబ్బంది అంతా అప్రమత్తులై మానవ ప్రాణరక్షణకు, ఆరోగ్య రక్షణకు తాము కంకణధారులమనే ధోరణిన పనిచేయాలి. వైద్య చికిత్సను కేవలం 'హాబీ'గా, 'వ్యాపారం'గా పరిగణించక ప్రభుత్వం లక్షలకొద్ది కుమ్మరిస్తున్న ప్రజాధనంలోని ప్రతి ఒక్క రూపాయి విలువా పరిపూర్ణంగా ప్రజలకు అందేటట్లు చేయాలనే ఆకాంక్ష వుండాలి వీరికి.

* * * *

"వందమంది నేరస్థులు న్యాయాన్ని తప్పించుకు తిరిగినా ఫరవాలేదు; కాని ఒక అమాయకుడినైనా శిక్షించడం మాత్రం క్షమించరాని నేరం"—అన్నది న్యాయశాస్త్రంలో వ్రాయని సూత్రం; అది సర్వత్రా శిరోధార్యం. ఆ సూత్రమే వైద్యశాస్త్రానికీ వర్తించాలి. ఆస్పత్రులు దేవాలయాలవంటివి. వైద్యులు నవీన ధన్వంతరులు; నారాయణాంశులు! ఒక్క రోగి పరీక్షలో కొంచెం అజాగ్రత్త, అత్యవసరమయిన కేసులో ఒక్క నిమిషం ఆలస్యం, శస్త్రచికిత్సలో ఒక తప్పు కదలిక, ఏ స్థాయిలో జరిగినా ఒక నిండు ప్రాణం మరి లేకపోవచ్చు; శాశ్వతమయిన బాధ కలగవచ్చు. అవిశ్రాంతంగా జాగినవాడూ అహోరాత్రులూ నిద్రాహారాలుమాని నిస్వార్థంగా కృషిచేసిన ఎడ్వర్డ్ జెన్నర్ మొదలు ఎల్లాప్రగడ సుబ్బారావువంటూ గల త్యాగధనుల జీవితాలకు తీరని కళంకం తెచ్చిపెట్టినవాళ్ళమే అవుతాము. అలాంటి మహావ్యక్తులు అజ్ఞాతంగా ఎక్కడో మారుమూలల్లో కూచుని చేసిన చేస్తున్న పరిశోధనలకు ఫలించిపెడుతున్న వైజ్ఞానిక ఫలితాలకు. సర్వతోముఖంగా అభివృద్ధి అవుతున్న వైద్యశాస్త్రానికి మానవప్రగతికీవున్న సహజమైన విలువలను నిర్మూలించడమేనన్నమాట. పది వేల ఆరోగ్యదానాలతో, పది వేల ప్రాణప్రదానాలతో పోల్చిచూసినప్పటికీ చికిత్సాచరణలో ఒక్క చిన్న తప్పుకూడా మరచిపోదగిన విషయం అనిపించుకోదు.

కాని వాంఛనీయమయిన దానికి, నేటి వాస్తవపరిస్థితులకూ మధ్య వైవిధ్యం అత్యంత ఖేదకారకం.

* * * *


దినదిన ప్రవర్ధమాన మవుతున్న వైద్యకళాశాలలు కలిగి అయిదారంకెల మొత్తాలఖర్చులకు కారణాలై, వేలకొలది రోగపీడితుల పాలిట కల్పతరువులుగావున్న రెండు జిల్లా కేంద్రాలలోని హాస్పిటళ్ళలో—కన్న, విన్న, కొన్ని సంఘటనలను ఊహించుకుంటే రాష్ట్రంలోని ఆస్పత్రులలో, చిన్న చిన్న వూళ్ళలోని డిస్పెన్సరీలలో, పరిస్థితి ఇంకా ఎంత అధ్వాన్నంగావున్నదో నన్న భయం వేయక మానదు. ఎన్నివందలు వేలమంది—ఆరోగ్య విషయంలో ఈ ఆస్పత్రులనుండి సరిఅయిన శ్రద్ధ పొందకుండా పోతున్నారోనన్న బాధాకరమైన ఊహ కలగక మానదు. మచ్చుకు కొన్ని వివరాలు పరిశీలించండి:

గుంటూరు ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేయబడిన చేయబడవలసిన, మగవారి వార్డుప్రక్కనే గొలుసులతో లాగబడే 'లిఫ్ట్' ఒకటి వుంది. దానిని ఉపయోగించినప్పుడల్లా వెయ్యి జగన్నాథరథ చక్రాలు కదలినట్లవుతుందిట! రోగులికి ముఖ్యంగా, శస్త్రచికిత్స అవసరమయినవారికి ప్రశాంత, నిశ్శబ్ద వాతావరణం వుండాలని అందరమూ అనుకుంటుంటాము. అది తప్పని ఇప్పుడు ఉన్నత వైద్యవిద్యలో చెపుతున్నారల్లే వుంది!! క్రొత్త క్రొత్తగా రెండుమూడంతస్థుల బ్లాకుల్ని కేంద్రప్రభుత్వ మంత్రులచే తెరిపించి సగర్వంగా, ఛాతులు తడుముకుంటున్న మన పెద్దలకు అక్కడ ఒక ఎలక్ట్రిక్ లిఫ్ట్ పెట్టించాలని తట్టకపోవడం వింతే!

ఆ ఆస్పత్రిలోనే నా మిత్రుడొకడు శస్త్రచికిత్సానంతరం రోజుకు రెండు రూపాయలు చెల్లించి ఓ 'స్పెషల్' గదిలో వుండవలసి వచ్చింది. 10' × 10' వైశాల్యం కల ఆ గది మధ్యలో ఒక మాసిపోయిన తెర, తెరకిరుప్రక్కలా ఇద్దరు పేషెంట్లూ! ప్లాస్టర్ వూడిన గోడలు, ఎత్తుపల్లాల నేలా, జుగుప్సాకరమైన మరకల బెడ్ షీట్లూ, ఒక్క టేబుల్ ఫేన్ కూడా లేకపోవడం—ఇవి ఆ గదిలో "స్పెషల్ ఫీచర్లు"! ఇవిగాక ఈ గదికి ఎదుటే కుంభకర్ణుడికి సైతం మేలుకొలుపులు పాడే ఆ గొలుసుల రొద!

* * *

(54-వ పేజీ చూడండి)



ప్రాచీన ప్రేక్షాగృహం

భారతవర్షంలో భారతీయులు ఉత్సవ వేళలలో నాట్యసంగీతాలతో వినోదపడేవారు. ప్రతిరాజ్యంలోను సమీపప్రాంతాన పర్వతగుహాలలో ఈ నాట్యసంగీత వినోదాలను అనుభవించేందుకు తగిన ఏర్పాటులుండేవి. బౌద్ధుల హయాంలో ఇవి చాలా ముమ్మరంగా సాగుతుండేవి. ప్రజలంతా పర్వతగుహాలలో ఉత్సవ వేళలలో గుమికూడేవారు. అందే పాటకచ్చేరి, బృంద నాట్యం అన్నీ ఏర్పాటు చేయబడేవి. ఇదంతా ఒక నిర్ణీతతిథులలోనే జరిపేవారు. నాటకాలుకూడా ప్రదర్శింపబడేవి. ఛోటా నాగపూరులోని రామగఢ్ కొండపై ఒక ప్రేక్షాగృహంయొక్క భగ్నావశేషం నేటికీ నిలిచివుంది. వైదిక సంప్రదాయానుగుణంగాకూడా బ్రహ్మోత్సవ సమయాలలో ప్రధాన దేవాలయాలలో స్వామికి అంగరంగభోగాలమరించేటప్పుడు నాట్యం, గానం ప్రదర్శింపబడేవి. వివాహ వేళలలోను, జన్మదినోత్సవ సందర్భాలలోను. ఇంకా ఇతరానందజనక సమయాలలోనూ ఈ కచ్చేరీలను జరిపేందుకు రంగశాలలను ఏర్పాటు చేసుకొనేవారు. వీటికే 'అభినయగృహ'మని కూడా పేరు.

నాట్యశాస్త్రంలో శాశ్వత రంగశాలల విషయమై ఒక చర్చ చేయబడివుంది. సాధారణంగా రాజభవనాలలోనైతేనేమి, సంపన్నుల భవంతుల్లోనైతేనేమి ఇలాంటి శాశ్వత రంగశాలలు నిర్మింపబడేవి. సంస్కృత నాటకాలలో పేర్కొనబడ్డ 'రంగశాల' లిలాంటివే. రాజభవనాలలో అంతఃపురస్త్రీల వినోదానికి నృత్యగానాభినయాల్ని ప్రదర్శించేందుకు శాశ్వతరంగశాలల అవసరమెంతైనా వుంది. నాట్యశాస్త్రంలో ఇట్టి ప్రేక్షాగృహాల నిర్మాణానికై కొలతలు ఇవ్వబడినవి.

ప్రేక్షాగృహాలు మూడు విధాలు: మొదటిది అన్నింటిలో పెద్దది అయిన ప్రేక్షాగృహానికి 'దేవప్రేక్షాగృహ'మని పేరు. దీని పొడవు 108 హస్తములు; రెండవది 64 హస్తముల పొడవు వెడల్పుగలిగి చచ్చవరంగా ఉండేది; మూడవరకం మాత్రం త్రిభుజాకారంగలిగి, ఒక్కొక్క భుజం 32 హస్తముల పొడవై ఉండేది. రెండవరకం ప్రేక్షాగృహమే రాజుల భవంతులలో ఎక్కువగా ఉపయోగపడేది. ఇట్టివే సాధారణంగా బహుళ ప్రచారాన్ని పొందిన ప్రేక్షాగృహాలు.

రాజుల అంతఃపురాలలోను, సంపన్నుల భవంతులలోను ఇట్టి రంగశాలలు స్థిరమై నెలకొనివుండేవి. ప్రతిమా నాటక ప్రారంభంలో 'నేపథ్యశాల'ను గూర్చి చర్చ వచ్చింది. అక్కడ రంగభూమికిగాను ప్రత్యేకించి వల్కలాదుల నుంచేవారట.

[వాదారి శ్రీనివాసశర్మ]

సామాన్యప్రజలందరు మూడోరకం నేపథ్యశాలలను ఉపయోగించుకొనేవారు. అవి ఎక్కడబడితే అక్కడ నిర్మించుకోవచ్చును. అవసరం తీరినవెంటనే పెరికి వేయవచ్చును. ఇలాంటివాటిని తాత్కాలిక రంగశాల లంటాము.

ఇటి 'రంగశాల'లను నిర్మించేటప్పుడు భారతీయులు కొన్ని విషయాలలో జాగరూకత వహించేవారు. రంగశాలలు నిర్మించేందుకు ఉపయోగపడే నేల శుభ్రమైందిగా ఉండాలి. సమతలం, కఠినమై స్థిరమైందిగాని, తెలమట్టిగాని, ఎఱ్ఱటిగాని ఉండే నేలను శుభతలంగా భావించేవారు. అట్టి చోటనే రంగశాలలను నెలకొల్పేవారు. నాగలితో మొదట భూమిని దున్నేవారు. ఎముకలు, చీలలు. కపాలములు, తృణగుల్మములు లేకుండా ఏరివేసి ప్రేక్షాగృహనిర్మాణానికి భూమిని కొలిచేవారు. కొలత పెట్టేటప్పుడుకూడ పలురకాల నియమాలు పాటింపబడేవి. నన్నయభట్టారకుడు రచించిన భారతంలో మయశాస్త్ర విద్యాభ్యాసక్రమాన్ని సూచించేందుకొక ప్రేక్షాగృహాన్ని ధృతరాష్ట్రుడేర్పఱచాడు: దాని వర్ణన:

"ధృతరాష్ట్రుడు కుమారుల విద్యాప్రదర్శన రంగంబు రమ్యంబుగా జేయింపుమని విదురుం బంచిన నతండు వల్లెయని శాస్త్రవిహిత ప్రమాణోపేత నృత్తాయతనంబును సపాకృత వృక్షగుల్మ వల్లీవల్మీకంబును సంగీకృత పూర్వోత్తర ప్లవనంబును, సమీకృత విషమోన్నత ప్రదేశంబును, దూరీకృత కంటక పాషాణ శల్యశకలంబును, విరజీకృత రజోధూసర స్థలంబును. విరచిత బహువిధ ప్రేక్షాగారాంచిత మంచమణిమయ ప్రపంచంబును నానాధ్వజ నవపల్లవతోరణ చంపక మాల్యాలంకృత ద్వారదేశంబును, బ్రతిదిశానిర్వర్తిత శాంతిక బలివిధానంబునుంగా జేయించిన బంచాంగశుద్ధిన శుభ ముహూర్తంబున ధృతరాష్ట్రుండు గాంధారీ పురస్కృత కవిజన పరివృతుండై వివిధభూషణభూషితానేక విలాసినీ నివహంబుతో జనుదెంచి విలంబిత కదంబక స్థూలముక్తాఫల దామ రామణీయకంబై యాబద్ధ మరకత వ్రి

★ ప్రేక్షగృహం ★

"వైడూర్య పద్మరాగ ప్రవాళ ప్రభాప్రకర వస్త్రికర విరచితాపూర్వసురచాప చారు గౌరవంబై యతిమనోహరంబైన శాతకుంభ మయ ప్రేక్షాగారంబు నున్న":

ప్రేక్షాగృహనిర్మాణంలో భారతీయులందె వేసినవారు. ప్రేక్షాగృహానికి స్థలం కొలిచేందుకు 'సూత్రమానం' ఉపయోగపడేది. మానకాలంలో సూత్రాలు తెగితే అది చాల అమంగళం. మానసూత్రం

ప్రతిస్తో, గల్లలందో, ముంజదర్భదో అయి ఉండాలి. నడిమిభాగంలో సూత్రం తెగితే యజమానుడు మృత్యువుపాలౌతాడు; మూడవ భాగం దగ్గర తెగితే, రాజ్యాగ్రహానికి గురి అవుతాడు. నాలుగో భాగందగ్గర తెగితే ప్రయోక్త మరణిస్తాడు. మూరెడుభాగంలో తెగితే పని సక్రమంగా నెరవేరదు. పలురకాల ఇబ్బందులేర్పడవచ్చు. కాబట్టి రజ్జుగ్రహణం, సూత్రమానం చాల హెచ్చరికతో పరికించేవారు. తిథివార నక్షత్రాల శుద్ధులను విచారించి శుభముహూర్త మేర్పఱచుకొనే వారు.

మంటపస్థాపన చేసేటప్పుడు కాషాయాంబర ధారులుగాని, హీన శరీరులుగాని, వికలాంగులుగాని కనిపించకూడదు. అట్టి వారు కంటబడితే అశుభం కలుగుతుంది. స్తంభాలు నాటేటప్పుడు కూడ కడు జాగరూకులై ఉండవలెను. స్తంభం కదిలినా, జారిపోయినా, అదిరినా అనేకరకాల ఉపద్రవాలు కలుగుతై. ఇటి విశ్వాసాలు ప్రజలలో కూడా మెండుగా ఉండేవి.

వాసవానికి రంగగృహ నిర్మాణం ఒక ప్రత్యేకక్రియ. అడుగడుగునా పూజలు పురస్కారములు, బలి, మంత్రపఠన సమారాధనలు అవశ్యక కృత్యములుగా విధించారు. భిత్తికర్మలోనైతేనేం, సున్నం పూచేటప్పుడైతేనేం, చిత్రములు గీయుటమైతేనేం, స్తంభాలు నాటుటమైతేనేం, భూమిని చదునుచేయుటమైతేనేం-అన్ని వేళలలోను విఘ్నభయ ముండేది. కాబట్టి ప్రేక్షా గృహనిర్మాణాన్ని ఒక మహనీయ కృత్యంగా భావించే వారా రోజుల్లో.

రాజులు దండయాత్రలకు వెళ్ళేటప్పుడు తమ శిబిరాలవద్ద తాత్కాలికరంగశాలను నిర్మించుకునేవారు. ఈ శాలలలో కూడ రెండు భాగాలున్నవి: ఒకటి, అభినయం జరిగే ప్రదేశం. రెండు, ప్రేక్షకులు కూర్చుండే చోటు. ప్రేక్షకస్థలంలో భిన్న భిన్న శ్రేణులు వారివారి హోదా ప్రకారంగా ఏర్పాటు చేశేవారు. అభినయంజరిగే చోటుకి 'రంగభూమి' అని పేరు. రంగభూమికి వెనుకటిభాగంలో తిరస్కరిణి వేలాడ కట్టబడియుండేది. పరదా వెనుకటి భాగానికి 'నేపథ్య'మని పేరు నేపథ్యంలో చక్కగా అలంకారాలు చేసుకొని అభినేతలు రంగభూమిలోకి అవతరిస్తారు. కాబట్టే దీనిని 'రంగావతార' మనే పేరతో వ్యవహరిస్తారు.

ఈ ప్రేక్షాగృహాలలో-అవి శాశ్వతమైనవి కానీయండి, లేదా తాత్కాలికమైనవి కానీయండి-అభినయం చూచేందుకు వెళ్ళే వారిలో పిన్నలు, పెద్దలు, విద్యావంతులు, విద్యాహీనులు-అందరూ ఉండేవారు కాని అధిక సంఖ్యాకులు రసికులేఅంటే రసశాస్త్రంలో పారంగతులైన సాహిత్యరసపిపాసువులే. కాళిదాసుని నాటకాలలోను, శ్రీహర్షుని నాటకాలలోను అభిరూపభూయిష్ఠమై రసగ్రాహిణియైన పరిషత్తులు పేర్కొనబడ్డాయి. 'అభిహితోస్మి విద్వత్పరిషదా' అన్నాడు కాళిదాసు. మాలవికాగ్నిమిత్ర నాటకంలో 'శ్రీహర్షో నిపుణః కవిః పరిషదప్యేషా గుణగ్రాహిణీ' అన్నాడు హర్షుడు. తన రత్నావళి నాటకంలో. భారతీయుల జీవితంలో ఒక విశేషముండేది. మిక్కిలి దూరదృష్టి దూరాలోచన సిద్ధాంతరూపంలో సాధారణుల జీవితాలలో దొర్లేవి. శాస్త్రీయ దృక్పథం, తర్కశైలి ఏ కొద్దిమంది విద్యావంతులలో పరిచితమై వున్నా సిద్ధాంతమాత్రం అందరిలో వాడుకపడి వుండేది.

కళలన్నింటితో పాటు అభినయగోష్ఠులు, కావ్యగోష్ఠులు ప్రజలలో ప్రబలిపోయాయి. సంగీతాభినయ కావ్యగోష్ఠులకు శాశ్వతంగా సభలను వ్యవస్థీకరించారు. 'సంగీత రత్నాకరం' ఒక గొప్ప గ్రంథం, ఇది సంగీత శాస్త్ర వివరణకై ప్రత్యేకంగా పుట్టింది. శార్ఙ్గదేవుడు దీనిని రచియించి యిందులో అప్పటివరకు వాడుకలో ఉండి రూపరిపోతూవున్న పురాతన సంప్రదాయాల్ని గ్రంథస్థం చేశాడు. సంగీతాన్ని వెలువరించేందుకు ప్రత్యేకసభ ఒకటి వర్ణింపబడివుంది. గ్రంథకారుడీసభకు 'రంగశాల' అని పేరుపెట్టాడు.

ఈ సంగీత రత్నాకరంలో 'రత్న స్తంభ విభూషితమై పుష్పప్రకార శోభితమై నానావితానసంపన్నమై అత్యంత సమృద్ధి శాలియైన 'రంగశాల' చక్కగా వివరింపబడింది. రంగశాల మధ్యలో వుండే సింహాసనంపై 'సభాపతి' కూర్చుంటాడు. ఈ సభాపతి నానావిధ కళామర్మజ్ఞుడు, వివేకశీలుడు అయివుండాలి. సభాపతికి ఎడమవైపు అంతఃపుర స్త్రీలకు, కుడివైపు ప్రధానామాత్యునికి చోటు ప్రత్యేకించబడివుండేది. వీరు చాల ముఖ్యపాత్రలు. వీరి వెనుకటి భాగంలో కోశాధ్యక్షులు, కరణాధిపులు కూర్చునేవారు. వీరికి దగ్గరనే లోకవేత్తలైన విద్వాంసులు, కవులు, రసికులు కూర్చునేవారు. గొప్పగొప్ప జ్యోతిష్కులకు, వైద్యులకు, విద్వాంసుల నడుమ ఆసనములుండేవి. అటువైపునే మంత్రిమండలి కూర్చునేది. వారికి ఎడమవైపు అంతఃపుర పరిచారక మండలి కూర్చునేది. సభాపతికి వెనుకటి భాగంలో 'రూపయౌవన సంభావశాలినులు, చారుచామరధారిణులు వింజామరలు వీచేవారు. వారు మిగుల అందకత్తెలు. వీచేటప్పుడు వారు తమ కంకణాలగల గలలతో ప్రేక్షకుల మనస్సుల నాకర్షిస్తుండవలెను. ఎదుటినుండి ఎడమవైపు కథకులు, వందులు, కళావంతులు మొదలగువారుండేవారు. సభలో శాంతిని పరిరక్షించేందుకు సమర్థులైన వేత్రధరులుండేవారు.

రాజశేఖరుడనే మహాకవి తన 'కావ్యమీమాంస'లో మరో విధమైన సభను నిర్ణయించాడు. అదియు చాల మనోరంజకమయింది. దీని ప్రకారం రాజు కావ్య సాహిత్య చర్చలకు ఒక ప్రత్యేక 'సభామంటప' మేర్పరచేవాడు. దానిలో 16 స్తంభాలు, ద్వారాలు 8 మిద్దెలు ఉండేవి. రాజుయొక్క క్రీడాగృహం అందులోనే చేరివుండేది. దాని మధ్యలోని నాలుగు స్తంభాల మధ్య ఒక హస్తము ఎత్తుగల అరుగు - మణివేదిక - ఉండేది. అది మణిమయమై చాల జటిలమై వుండేది. దానిపై రాజాసనం. దానికి ఉత్తరంవైపు సంస్కృతకవులు కూర్చుండేవారు. ఒకడే అనేక భాషలలో కవిత్వం చెప్పవచ్చు. కాని అతడే భాషలో ఎక్కువ ప్రవీణుడో ఆ భాషలోని కవిగా పరిగణింపబడేవాడు. అన్ని భాషలలోను సమానకవితాప్రాభవం కలవాడు ఎక్కడ నచ్చితే అక్కడ లేచిపోయి కూర్చోవచ్చును. సంస్కృతకవులకు వెనుకటి భాగంలో వైదికులు, దార్శనికులు, పౌరాణికులు, స్మృతి నిపుణులు, వైద్యులు, జ్యోతిష్కులు మొదలైన వారికి స్థానముండేది.

తూర్పువైపు ప్రాకృతభాషాకవులు, వారి వెనుక భాగంలో నటులు, నర్తకులు, వాదకులు, వాగ్జీవనులు, కుశీలవులు, తాళావచరులు మొదలగు వారు ఉండేవారు.

పడమటివైపు అపభ్రంశభాషను చెందిన కవులు, వారి వెనకాల చిత్రకారులు, లేపకారులు, మణికారులు, వజ్రాల వ్యాపారులు, కంసాలులు, వడ్రంగులు, కమ్మరులు మొదలైన వారికి స్థానముండేది.

దక్షిణంవైపు పైశాచీభాషకు చెందినకవులుండేవారు. వారికి వెనుక వేశ్యాజనం, వేశ్యాలంపటులు, త్రాడులపై నాట్యంచేసే నర్తకులు, జూదగులు, మల్లులు, సిపాయీలు దాంభికులు మొదలైన వారికి స్థానం నిర్దేశింపబడివుండేది.

ఈ వివరణవల్ల మనకొక విషయం తెలుస్తుంది. రాజశేఖరుడు పేర్కొన్న ఈ సభ ముఖ్యంగా కవిసభ. నాట్యాకతెలు, వాద్యములు ఉండకుండవల్ల అవసరం వచ్చినప్పుడెల్లా నృత్యగానాలుకూడా ఇందులోనే ఏర్పాటు చేయబడేవి.

సంగీతభవనం నిరమై వెలకొ వేళాట మృదంగ సాధనకు ప్రత్యేకమైన ఏర్పాటు చేయబడేది. కాదంబరి గ్రంథం దీనికి ప్రత్యక్షసాక్ష్యమిస్తుంది. అందులో 'సంగీతభవన" మిక అనేక స్థానసాపిత మృదంగం' అని ఉంది. ఈ మృదంగం ఆ కాలంలోను, ఈ కాలంలోను సంగీతానికి మిక్కిలి ప్రధానమైన అంగం. కాళిదాసు సంగీత ప్రస్తావన వచ్చినప్పుడంతా 'ప్రసక్త సంగీత మృదంగఘోషం' అని సూచించేవాడు. 'నృత్యం. గీతం చ వాద్యం చ త్రయం సంగీత ముచ్యతే'—అని అభియుక్తుల వచనం. ★





అరకులోయ స్త్రీల ఆటపాటలు: గోపీలీలానృత్యం.

అరకులోయ గిరిజనాభ్యుదయం



విలువిద్యలో గిరిజన బాలుని నైపుణ్యం

అందచందాల అరకులోయలో 1956 మార్చి నెలలో జాతీయ వికాస కేంద్రం ఒకటి ప్రారంభించి అక్టోబరులో దీన్ని బహుళార్థ సాధక ప్రణాళికగా ప్రభుత్వం మార్చివేసింది. ఏప్రిల్ 1956నుంచే ఈ బహుళార్థ సాధక ప్రణాళిక అమలులోకి వచ్చినటు పరిగణించవలసిందనికూడా ప్రభుత్వం ఆదేశించింది.

ప్రప్రథమంగా అధికాహారోత్పత్తి పథకం క్రింద రెండవ ప్రపంచయుద్ధం ఆఖరు సంవత్సరాలలో ఈ లోయలో కొంత

కపిల గోపాలరావు

చైతన్య మేర్పడింది. ఇప్పుడు అమలు జరుగుతున్న బహుళార్థ పథకం క్రింద 27 లక్షల రూపాయలు ఖర్చుపెట దలిచారు.

అరకులోయ సముద్రపు మట్టానికి 3000 అడుగుల ఎత్తున పీఠభూమిమీద వుంది. వైశాల్యము 248 చదరపుమైళ్లు; ఇందులో 64 గ్రామాలు, 899 కుగ్రామములు వున్నవి. వీటిలో 34,569 గిరిజనులు నివసిస్తున్నారు. అరకులోయ అభివృద్ధికి ప్రభుత్వం మొదట్లో అంత శ్రద్ధ తీసుకోనిమాట వాస్తవం.

అధికాహారోత్పత్తి ప్రణాళిక అమలుజరిపిన రోజులలోనే కొంతవరకు ఈ గిరిజనులలో చైతన్యం ఏర్పడి బహుముఖ పురోగమ

వానికి ప్రాతిపదిక ఏర్పడింది. అరకులోయ సరిహద్దున వున్న హుకుంపేటలో కూడా బహుళార్థ సాధక ప్రణాళిక మరొకటి అమలు జరుగుతోంది.

దండకారణ్య పథకం

ఇంతలో దండకారణ్య అభివృద్ధి పథకం ప్రారంభమయింది. దండకారణ్య ప్రాంతంలోని అడవిజాతులకంటే అరకులోయలో గిరిజనులు ఎన్నో విధాల విజ్ఞానవంతులు.

మరో సంవత్సరంలో ఈ ప్రాంతాలలో రైలుమార్గం ఏర్పడుతుందని శ్రీ కొండి రామమూర్తి చెబుతున్నారు. ఆంధ్రప్రభుత్వం శ్రద్ధతీసుకుని - దండకారణ్య అభివృద్ధిపథకంలో నాలుగోవంతు భాగస్వామిగా చేరితే - ఆంధ్రదేశంలోని ఈ మారుమూల వున్న మన్యప్రాంతాలన్నీ నందనవనాలుగా మారిపోతాయి; అధికోత్పత్తికి తోడ్పడుతాయి. మద్రాసు రాష్ట్రంలో నీలగిరిప్రాంతం ఎంత ప్రాముఖ్యం వహిస్తున్నదో అంతప్రాముఖ్యమూ ఇక్కడి గాలికొండ, దేముడికొండ ప్రాంతాలకు కూడా వచ్చే అవకాశమున్నది. అయితే రాజకీయాలూ, సంకుచిత బుద్ధీ అడ్డురాకుండా వుండాలి కదా!

కొన్ని వందల సంవత్సరాలపాటు బందిపోటు దొంగలు ఈ ప్రాంతాలు పరిపాలించారు. ఆ దొంగలే కొంతకాలానికి రాజులైనారు. నిన్న మొన్నటివరకూ గిరిజనులు పీడిత ప్రజలు. జమీందారుల తాబేదారులు ముఠాదారులు ఈ అమాయిక అడవి జనులనూ, గిరిజనులనూ పీడించేవారు.

అరకులోయకు నలభై మైళ్ళ దూరంలో మాచ్‌ఖండ్ విద్యుదుత్పాదన కేంద్రమూ, ఆ కేంద్రానికి కొన్ని మైళ్ళదూరంలో ఇప్పుడు అమలు జరుగుతున్న దండకారణ్య పథక ప్రాంతమూ వున్నాయి. ఈ పథకాలకు రూపకల్పన చేసిన కొండి రామమూర్తి గారికి ఆంధ్రప్రజలు కృతజ్ఞులై వుండాలి.

గ్రామాలలో పండే పంటలను అమ్మి డబ్బుగా మార్చుకోడానికి అక్కడి ప్రజలు సమీపంలోని పల్లెటూళ్ళను ఆశ్రయిస్తారు. ఈ పల్లెటూళ్లు పట్టణవాసాలను ఆశ్రయిస్తాయి. విజ్ఞానం ఈ పట్టణవాసాలనుంచే ప్రసారమవుతుంది.

అరకులోయలో ఒక చిన్న పట్టణం రూపొందింది. అక్కడ ప్రభుత్వ భవనాలు, శ్రీమంతుల భవనాలు లేస్తున్నాయి.

రాజధానికి దగ్గర దారి

ఆంధ్రప్రభుత్వ కేంద్రమైన హైదరాబాదు వరకూ ఈ ప్రాంతాలలోంచి దారులున్నాయి. ఈ చిన్న దారులను అందరికీ ఉపయోగపడేటు రహదారులుగా మారిస్తే



చంకతాడితో గిరిజన స్త్రీ



సీతారావణ నృత్యనాటిక.

అరకులోయ

ఈ ప్రాంతాలు ఆంధ్రరాజధానికి సన్నిహిత మవుతాయి. ప్రజలు సుఖపడతారు.

ఎంతో వెనుకబడివున్న ఈ ప్రాంతాల అభివృద్ధి చాలావరకు ప్రభుత్వ కృషిమీద ఆధారపడివుంది.

1948 వరకూ-ఈ ప్రాంతాలలో భూములు కొనుక్కోటానికీ, ఆస్తులు సంపాదించుకోటానికి కాని వీలుండేది కాదు.

ఈ గంటెపిల్లలలాంటి ఈ అమాయిక గిరిజనులను మోసగించివేద్దామనే ఉద్దేశం లేకపోతే, (అలాంటి ఉద్దేశం లేదని జిల్లా కలెక్టరుకు నమ్మకం కలిగితే) పట్టణవాసాల నుంచి ప్రజలు వెళ్ళి అక్కడ నివాసాలు ఏర్పాటుచేసుకుని జీవించే అవకాశాలు కల్పిస్తారు.


ఈ ప్రాంత శీతోష్ణస్థితి, కాఫీతోటలు, ఏలకులూ పండించేందుకు చాలా అనువైనది. ప్రస్తుతము "ఒలిసెలు" పంటలు విరివిగా పండిస్తున్నారు. ఈ "ఒలిసెల" పంటను అభివృద్ధిచేస్తే విదేశీ మారకద్రవ్యం కూడా సంపాదించడానికి వీలున్నది.

అయితే, ప్రభుత్వ వ్యవసాయశాఖ ఈ పదిపధ్నాలుగు సంవత్సరాలనుంచీ విశిష్టమైన సహాయమూ చేయకుండా నిర్లిప్తంగా వుండిపోయింది.


పది పదిహేను సంవత్సరాలనుంచీ-ప్రభుత్వం గిరిజనులకు వివిధ జీవితరంగాలలో అవసరమైన తరిఫీదు ఇప్పించ లేదు. ఉద్యోగులు కేవలం జీతభత్యాలను ప్రధానంగా పరిగణించకుండా ఈ గిరిజనులలో కలసిపోయి సేవచేసినేగాని ఈ ప్రాంతం ముందంజ వేయలేదు. ప్రభుత్వ పాలనా విధానంలో కూడా కొన్నికొన్ని అడ్డంకులు వున్నాయని అంగీకరించక తప్పదు. ఈ ఆటంకాలను ప్రభుత్వం తొలగించాలి. దండకారణ్య అభివృద్ధి పథకంద్వారా అడ్డంకులు కొంతవరకు తొలగిపోతున్నాయి. ఆ పథకంలోని ముఖ్యోద్దేశాలను, పరిపాలనా విధానాలను అరకులోయ పరిపాలనలో కూడా త్వరగా ప్రవేశపెట్టాలి. సర్వాధికారాలతో ఒక అధికారిని నియమించటం అత్యవసరం.

అరకులోయ ప్రాంతంలో చదరపు మైలుకు 189 మంది గిరిజనులు నివసిస్తున్నారు. వీరిలో హిందువులు, జైనులు, క్రైస్తవులు కూడా వున్నారు. 600 మంది క్రిష్టియనులున్నారు. ఇప్పుడు జైనభిక్షువులూ, మతగురువులూ, క్రైస్తవ ఫాదరీలు ప్రతిసంవత్సరం ఈ ప్రాంతానికి వస్తూంటారు.

"గంగుడి" అనే పల్లెటిదిక్కులోవున్న ప్రజలందరూ క్రైస్తవులే కొండగొడ్డలోనూ అంతే.



కోళ్ళపెంపకంలో గిరిజన బాలుడికి తరిఫీదు



గిరిజనులు సీమపందుల పెంపకం కృషి. యార్క్‌షైర్ పందుల సంపర్కంతో ఈ జాతిని అభివృద్ధి చేయడానికి కృషి సాగిస్తున్నారు.

పెళ్ళిళ్లలో కల్లు విందు

హిందూ గిరిజనులలో కులవిచక్షణ వున్నాయి. "డొంబులు" వీరిలో హరిజనులు; ఓ కులంతో ఇంకో కులంవారి వివాహం నిషేధము. వరకట్నాచారం లేదు.

ఓ కుర్రాడూ, ఓ కుర్రదీ ప్రేమించుకుని 24 గంటలసేపు కనపడకుండాపోతే, వారికి పెళ్లి అయిపోయినట్టే. వారు భార్యాభర్తలైపోతారు.

(63-వ పేజీ చూడండి)

నవీన ఆర్థిక శాస్త్రం

[మున్నవ గిరిధరరావు]

కాలంతో పాటు ముందుకు సాగలేనివాణ్ణి వెనుకబడ్డవారిగా పరిగణించి లెక్కకట్టుతున్నారు. కాలేజీల్లో చెప్పే అర్థశాస్త్రం మరీ తడి తగిలిన అప్పడాల్లాగా బూజుపట్టిపోయింది మట్టిగోడలాగ చెదలుపట్టిపోయింది. ఆడమ్ స్మిత్తూ మాల్తూసూ, రికార్డోలు తప్పిస్తే మరొకపేరు మనకు తెలీదుకదా! ప్రపంచం ఒకపక్క నుంచి తల్లకిందులవుతుంటే ఆసంగతేమిటో శాస్త్ర ఆలోచించక ఎంతసేపని జాన్‌రండ్ బెర్రీ పిక్క వేస్తూ ఉంటూ కూచుంటాం? స్వతంత్రంగా ఆలోచించాలి. స్టడీ చెయ్యాలి. బుర్ర బద్దలుకొట్టుకోవాలి. పరిశోధించాలి. తత్ఫలమే ఈ నవీన అర్థశాస్త్రం.

మానవుడు అర్థికజీవి!


ధనమూలమిదం జగత్ అన్న ఋషివాక్యమే దీనికి పునాదిరాయి. ఈ లోకంలో పిపీలికాది బ్రహ్మపర్యంతమూ యావన్మందీ డబ్బు అనే సుందరరంగని మధ్యలో నిలబెట్టి చుట్టూ గానుగెద్దు తిరిగినట్టు తిరుగుతున్నారు. నీతి అనేది వేరే ఎక్కడా మొలుచుకు రాలేదు. డబ్బుంటే నీతివంతుడు; డబ్బు లేకపోతే అవినీతిపరుడు. మార్క్సు ఈ మాటే అన్నాడు డబ్బులు మనవి కావనుకుంటే అడుగుతున్న సంఘశాస్త్రం వెక్కిరిస్తుంది; అంతేకాదు. మానవుడు అర్థజీవి. అంటే ఏమిటో తెలుసా? అనాదికాలంలో మానవుడు పచ్చిమాంసమూ, కాయలూ, పండూ తిని బతికేవాడు; మధ్యకాలంలో ఎండు మాంసమూ, ఉలవలూ జొన్నలూ తిని బతికేవాడు; మొన్న మొన్నటివరకూ ఇడ్లీ పెసరట్టూ. జిలేబీలతో కడుపునింపుకొనేవాడు; ఇప్పుడు కేవలం వట్టి 'డబ్బు' తిని బతుకుతున్నాడు! అందుకే అర్థశాస్త్రంలో మానవుణ్ణి అర్థజీవి అన్నారు!

కోరికలు!

కోరికలు ముందుపుట్టి తర్వాత మనిషి పుట్టాడు. పుట్టీపుట్టంగానే పాలు కావాలంటాడు. ఇవ్వకపోతే కొట్టుకుని ఏడుస్తాడు. ఇహ అప్పటినుంచి కోరికల దాహం పుట్టుకొస్తుంది. ఇసుకలో నీళ్ళు ఇంకిపోయినట్లుగా కోరికలు ఎన్ని తీరినా దాహం దాహంగానే వుంటుంది. నాగజెముడైనా చస్తుందేమోగాని కోరికలు చావవు. ఆఖరుకు చస్తే కోరికలు తీరుతాయనుకుంటాం. అదీ తీరవు. మనిషి చచ్చింతర్వాతకూడా కోరికలుంటూనే వుంటాయి. మరణానంతరం తన ఫోటో పత్రికల్లో పడాలనీ, తన పేర ఒక సిమెంటు విగ్రహం స్థాపించాలనీ, మనవడికి తన పేరు పెట్టాలనీ యిలా కోరికలు పుడుతుంటాయి. ఆమధ్య ఒక రాజకీయనాయకుడు కాస్తా హరీఅన్నాడు. కొడుకు దినవారాలు చేస్తుంటే పిండాన్ని కాకులు ముట్టుకోలేదట. ఎంతమంది ఎన్ని దణ్ణాలు పెడుతున్నా ఒక్క కాకి అన్నా పురుగెట్టలేదు. ఆఖరుకు ఒక పత్రికాసంపాదకుడు వచ్చి, "నీవు నీజీవితగాథనంతా ఒక ప్రత్యేకసంచికగా వేస్తాను మహాప్రభో" అని సాష్టాంగనమస్కారం చేస్తే, అప్పుడు ఈగలు ముసిరినట్టు ముసిరాయట కాకులు!

బుద్ధదేవుడన్నాడంటే జీవితం దుఃఖమయం; కోరికలే దుఃఖానికి కారణం; కనుక యావన్మందీ కోరికలను ఊరిబయట వదిలేసిరండి; అదే ఆనందానికి దగ్గరమార్గం అని చెప్పాడు... నాకు తెలియక అడుగుతాను... కోరికలు దుఃఖానికి కారణం అన్నమాట నిజమే కావచ్చు. అయితే ఆకోరికల్ని తృప్తిపరుచుకుంటే దుఃఖంపోయి ఆనందం వస్తుందిగాని అసలు కోరికలే లేవనుకుంటే దుఃఖం పోతుందా? ముక్కు లేదనుకుంటే పడిశం తప్పుతుందా?

(62-వ పేజీ చూడండి)



కళ్యాణి నైపుణ్యం

మా మామగారి దేశాటనానికి దాఖలాగానూ, స్వయం సంపూర్ణత్వానికి సాక్షిగానూ ఉండే పెద్ద సైజు హోల్డాలు ఒక శీతాకాలం సాయంత్రం మా ఇంటికి దొర్లుకొచ్చింది. ఆ సర్వజ్ఞుడి రాకంటే నాకెప్పుడూ అదో రకం హడలుగానే ఉంటుంది. ఆయన మా సంసారాన్ని బహుముఖంగా పరిశీలించి నా మీద చలిగాలిలాంటి సలహాలనీ, వడగళ్లలాంటి విమర్శలనీ కురిపిస్తుంటారు.

అనాడూ అనుమాయతకి లోపం లేకుండా ఆయన ఓం ప్రథమంగా అన్నాడు: ఏమోయ్! నీ వాటం చూస్తే ఇల్లూ, ఆఫీసూ అనే ఎనిమిది గోడల మధ్యా గుడుగుడుగుంచాలాడడం తప్ప నీ జీవిత సరణిలో మార్పేమీ ఉన్నట్లు తోచదు!"

ఆ మాట మా ఆవిడ కళ్యాణి గుండెల్లో మెదిలే పాత ఫిర్యాదుని పైకి తెచ్చింది: ఎన్నాళ్లనుంచో అడుగుతున్నా సర్కసుకి తీసుకెళ్ల లేదని! "ఆ ఏనుగులా వృద్ధాప్యం వచ్చి హరీ అనే లోపుళో మనకి సర్కసు చూడడం పడుతుందంటారా?" అందామె.

నిజానికి బ్రతుకే ఒక సర్కసు లేవే! అందామనిపించింది నాకు ప్రొద్దున్నే బస్సుకోసం పరుగెత్తి దాంట్లో ఏ కడ్డీయో పట్టుకొని వేళ్లాడి బాలెన్సింగు ఫీట్లు చెయ్యడం, రోజంతా అఫీసరుగారి అగ్రహానుగ్రహాల ప్రకారం నడుచుకోవడమనే కత్తిమీద సాము

DL. 467A-X52 TL

వెయ్యడం, సాయంత్రం ఇంటికి వచ్చి వన్యమృగాలవంటి... అబ్బే, ఆ మాటంటే ఇంకేమైనా ఉందా?

కనక పైకన్నాను: "మన పాత రాతియుగపు పెట్టిలోమంచి నా స్వెట్టరు పైకి తియ్యి. ఈ రాత్రి వెదదాం."

"సరే కాని. ముందు మీ కాఫీతోపాటు ఫలహారం కావాలంటే అటకమీదనుంచి లడ్డూల పళ్లెం దింపి పెట్టండి." అందామె.

మా రామిగాడు పదేపదే దండయాత్రలు చేసి గంటకి రెండు చొప్పున లడ్డూలు కొట్టేస్తూంటే, ఆ పళ్లెం అటకని శరణు జొచ్చిందట. నేను ముక్కాలిపీట వేసుకుని పళ్లెం తీయ బోయాను. అంతలోనే షాక్ తగిలినట్లు చెయ్యి లాక్కోవలసి వచ్చింది. చీమలు! సూదంటురాయిని చుట్టుముట్టే ఇనప రజను లాగ కోట్లకొద్దీ చీమలు నా చేతిమీదకి పాకేశాయి!

"భయపడకండి! అవి ఋషి చీమలు. ఏమీ చెయ్యవు!" అంటూ కళ్యాణి నవ్వింది.

"మరే! నల్ల చిమలు కదూ!" అంటూ సర్వజ్ఞుడు అందుకున్నాడు. "చీమల్ని గురించి మనం నేర్చుకోవలసిన విషయాలు బోలెడున్నాయి. విను..."

కాఫీతోబాటు పెద్ద మోతాదున మామగారి లెక్చరు కూడా పుచ్చుకున్నాను. చీమలు ఆహార సేకరణ, అవి వర్షాకాలం కోసం వేసవిలోనే ఎల్లా ఆహారం నిలవేసుకుంటాయో, శీతల దేశాలలో జంతువులు చలికాలాని కెల్లా సిద్ధపడతాయో, కొన్ని జంతువులు దొరికినప్పుడు ఆహారాన్ని భక్షించేసి శరీరంలో క్రొవ్వుగా మార్చుకుని చలికాలమంతా హఠయోగిలాగ బొరియలలో ఎల్లాగ సమాధిలో ప్రవేశిస్తాయో...వగైరా. వగైరా.

"అల్లాగ భారీ ఎత్తున శరీరంలో క్రొవ్వు నిలవచేసుకునే ఏర్పాటు మానవుడిలో లేదు—నీవంటి కొద్దిమంది విషయంలో తప్ప!" అంటూ నా సైజుకేసి వేలు చూపించేడు. మళ్లీ లెక్చరందుకుని అన్నాడు: "కనక మానవుడు తనకు కావాలసిన క్రొవ్వు పదార్థాన్ని దైనందిన భోజనంతో తీసుకుంటూ ఉండాలి. క్రొవ్వు మనకు శక్తినిస్తుంది కనక మనకు కావలసిన క్రొవ్వు పదార్థాలని జాగ్రత్తగా ఎన్నుకోవాలి."

మళ్లీ బళ్లో సైన్సు క్లాసులో కూర్చున్నట్లనిపించింది నాకు! కాని ఒక విషయం ఆందోళనను కలిగించింది. మేము వంటలన్నిటికీ జాగ్రత్తగా ఎన్నుకున్న పదార్థం డాల్డా వనస్పతి. ఆయన సర్వజ్ఞుడే కాని 'డాల్డా' యొక్క గుణగణాలు ఆయన సర్వజ్ఞత్వం పద్ధతిలో ప్రవేశించాయా? లేక ఆయన చాదస్తంగా అది 'నవనాగరిక' పదార్థమని కుశంకలు తీస్తాడా? ఆ విషయమై మా ఆవిడతో మాట్లాడడానికి వంటింట్లోకి వెళ్లేను.

"మన వంటంతా మామూలులాగే 'డాల్డా'తో చేసేవముకుంటాను, మీ నాన్నగారేమేనా చాదస్తపు గొడవ పెడతారేమో!" అన్నాను.

నాకు తెలియకుండా నా వెనక్కాలే వచ్చిన మామగారు నే నులిక్కిపడేటట్లు పలికేడు: "నాకేం చాదస్తం లేదోయ్! కావలిస్తే 'డాల్డా'ని గురించి నీకు కొన్ని విషయాలు చెప్ప గలను. ప్రశస్తమయిన కాయగూరల నూనెలతో చేసిన 'డాల్డా'లో శరీరారోగ్యానికి ముఖ్యమయిన ఎ., డి విటమినులు కలుపుతారు. ఖర్జూరపు చెట్టు బొమ్మవేసిన డబ్బాలలో కల్తీలకి వీలు లేకుండా సీలువేసి అమ్ముతారు. 'డాల్డా'ని మా ఇంట్లో పిండివంటలకి వాడుకుంటూనే ఉంటాము."

ఆయన సర్వజ్ఞత్వం మీద విజయం సాధించడానికి నా కవకాశం దొరికింది. "అంత తెలిసిన వారు మరి ప్రశస్తమూ, పోషకమూ అయిన 'డాల్డా'ని రోజూ వంటలన్నిటికీ వాడుకోక ఒక్క పిండి వంటలకే వాడుకుంటారేం? మమ్మల్ని చూడండి! ప్రొద్దున్న ఉప్మా వగైరా ఫలహారాలకి. భోజనాలలో కూరల వేపడాలకి, పోపులకి...అన్ని వంటలకీ 'డాల్డా'యే వాడుకుంటాం!"

"మరేనోయ్! నీ మాట సబబుగానే ఉంది." అని ఒప్పుకున్నాడాయన. భోజన మయ్యాక 'డాల్డా'తో చేసిన వంటకాలు స్వాదిష్టంగా ఉన్నాయని కూతు ర్నభినందించేడు.

తరువాత సర్కసుకి వెళ్లడానికి నా పాత స్వెట్టరు తొడుక్కోబోతే అది బిగువయి, దాంట్లో దూరడం సర్కసు ఫీటంత పనయింది.

"చచ్చాను, పదిహేను రూపాయలిచ్చి కొత్త స్వెట్టరు కొనుక్కోవాలి!" అన్నాను నేను.

"'డాల్డా'తో చేసిన రుచికరమూ, పుష్టికరమూ అయిన ఆహారం తింటూంటే పాత స్వెట్టరు బిగువవడంలో ఆశ్చర్యమేముంది?" అని మామగారు చమత్కరించేడు.

"ఫరవా లేదులెండి. ఆ డబ్బు నా 'డాల్డా' సేవింగ్సు బ్యాంకి నుంచి తీసి ఇస్తాను," అంది మా ఆవిడ.

నా కళ్యాణి వంటలో ఎంత నిపుణురాలో పొదుపు చెయ్యడంలో కూడా అంత నేర్పరి అని వేరే చెప్పాలా?

ఉదార స్వభావులు

పి. నరసింగరావు

సుమారు ఉదయం పదిగంటలై ఉంటుంది.

వార్డులోకి రాగానే ముందు నా బెడ్ దగ్గరకు వచ్చి, ఛీఫ్ మెడికల్ ఆఫీసరుగారు "ఏమయ్యా ఎలా ఉంది"? అన్నారు.

"నొప్పి బాగా తగ్గింది. కులాసాగానే ఉన్నా. మరి ఎప్పుడు డిస్చార్జి చేస్తారు?" అన్నా.

"ఏం? నీకు ఇక్కడ ఉండడానికి కష్టంగా ఉందా?" అన్నారు.

"మీ దయవల్ల అటువంటి దేమీ లేదనుకోండి. అయినా ఎంత ప్రేమగా చూసినా పంజరంలోని చిలుక ఎగిరిపోవడానికి ప్రయత్నించడం సహజమేగా" అన్నా. ఆయన నవ్వుతూ, నాభుజంమీద ఓసారి తట్టి "నువ్విలా మంచంమీద ఉంటే నాకూ ఎంతో ఇబ్బందిగానే ఉంది. కాని ఏం చెయ్యడం? మరో నాలుగు రోజులు ఓపికపట్టు. డిస్చార్జి చేస్తా. ఆ తరువాత కట్టు కట్టుకోవలసిన అవసరంకూడా ఉండదు." అన్నారు.

వార్డులోని ఒక్కొక్కరోగి దగ్గరకూ స్వయంగా వెళ్ళి వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకుంటూ, అవసరమైనచోట్ల ఆ వార్డు సర్జనుకు ట్రీట్‌మెంట్ విషయాలలో తగిన సలహాలిస్తూ విజిటింగు పూర్తి చేసే సరికి ఇంచుమించు పన్నెండుగంట లయింది. ఆయన వెళ్ళిపోయారు. ఆయన వెనకాలే మిగిలిన డాక్టర్లూ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

దూరాన్న ఉన్న కొండలను, ఆ కొండలపై మేతకై స్వేచ్ఛగా తిరుగుతున్న పశువులను, పశువుల కాపరులను, చూస్తూ ఏదో ఆలోచిస్తున్నా. ఇంతలో గోపాలరావుగారు చెమటలు కక్కుకుంటూ వచ్చి "ఏమండీ ఆలస్యమయిందా?" అంటూ కేరియరు అందించారు. నేను భోజనంచేసేవరకూ ఉండి ఆ తరువాత ఆ కేరియరు తీసుకుని సాయంత్రం మళ్లీ వస్తానని చెప్పి వెళ్ళిపోయారు. స్నేహితులలోకూడా, ప్రతిఫలం వాంఛించకుండా అవసర సమయాలలో శత్రువంచనలు లేకుండా శ్రమ అనుకోకుండా సహాయపడే వాళ్లుంటారు. లేకపోతే పుట్టి, పెరిగిన తెలుగుదేశానికి వెయ్యిమైళ్ళ దూరంలో, బంధువులకు, పరిచితులకు అందుబాటులో లేని పరిస్థితిలో గోపాలరావుగారు, మూర్తిగారిలాంటి మంచి స్నేహితులే లేకపోయి ఉంటే, కదలలేని పరిస్థితిలో ఆస్పత్రి మంచంమీద ఎన్ని ఇబ్బందులు పడవలసివచ్చేదో?

రెండు రోజులనుండి ఆస్పత్రి మంచంమీద ఇన్‌పేషెంటుగా ఉంటున్నా ఆ వార్డులోని మిగిలిన రోగులు ఎవరితోనూ ఏ సందర్భంలోనూ మాట్లాడలేదు. అంతగా కలుగజేసుకుని మాట్లాడుదామన్నా అంతా బెంగాలీలు, హిందీ మాట్లాడేవాళ్లు. నాకు ఎదురుగా ఉన్న పద్దెనిమిదో నెంబరు బెడ్ మీద ఉన్న పదహారేళ్ళ కుర్రాడు మాత్రం నన్ను ఎంతగానో ఆకర్షించేవాడు. వయస్సు అంత పెద్దది కాకపోయినా, ఒడ్డు పొడుగుతో మంచి శరీరదారుఢ్యంతో ఉన్నాడు. కాని కుడికాలు ముణుకుపైగా తీసివేయబడింది. అతనిస్థితి చూస్తే చెప్పలేని జాలివేసేది. తాత్కాలికంగానైతే రెండు రోజులు కుంటిగా నడవవలసివస్తేనే, మానసికంగాను, శారీరకంగానూ ఎంతగానో బాధపడుతున్నా. అలాంటిది, అంగవైకల్యంతో శాశ్వతంగా, యావజ్జీవితం కుంటుతూ నడవాలంటే, ఆ అబ్బాయి ఎంతగా క్రుంగిపోయేడో? ఎంత బాధపడ్డాడో? అతనికథ తెలుసుకుందా మనిపించింది. సంజ్ఞచేసి రమ్మని పిలిచా. రెండు చంకలక్రింద రెండు కర్రలను ఆనుకునివచ్చి నా మంచందగ్గర స్టూలుమీద కూర్చున్నాడు.

"ఎంచేత కాలు తీసేశారు?" అన్నా హిందీలో.

"మీకు తెలియదా? పేపర్లో కూడా పడిందే. గత మాఘ పౌర్ణమినాడు..." అంటూ చెప్పబోయాడు.

అంతలోనే అతని మాటకు అడ్డుపడి "ఆ...ఆ...జ్ఞాపకం వచ్చింది" అన్నా. అప్పటికి సుమారు పదినెలల క్రితం జరిగిన విషయం. ఆనాడు మాఘ పౌర్ణమి. గంగానదిలో స్నానం చెయ్యడానికి చుట్టుప్రక్కల గ్రామాలనుంచి మొంగేరు లక్షలకొద్దీ జనం వచ్చేరు. మొంగేరు బీహార్‌లోని ఒక జిల్లాకు ప్రధానపట్నం. గంగానది ఒడ్డున ఉన్నది. నది ఒడ్డున స్నానఘట్టాలు, వాటపక్కనే ఒక శివాలయం ఉన్నాయి. నాతోనే కలిసి ఉంటున్న మిగిలిన తెలుగు స్నేహితులు స్నానానికి నన్నుకూడా రమ్మన్నారు. కాని సాధారణంగా జనసమ్మర్దంగా ఉన్న ప్రదేశాలకు, అందులో అలాంటి తీర్థాలకు వెళ్లడం నాకు నచ్చనిపని. పైగా, 'రాత్రి వెన్నెలలో గంగానది ఒడ్డున కూర్చుని కాలక్షేపం చేస్తే హాయిగా ఉంటుంది. అంతేగాని దొమ్మిలో వెళ్ళడం ఎందుకు?' అన్నా. నా మాటలు ఎవరికీ రుచించలేదు. నేను తప్ప మిగిలినవాళ్లు వెళ్ళిపోయారు. ఆనాడు ఈ కుర్రాడూ మిగిలిన స్నేహితులతో కలిసి, ఆడుతూ పాడుతూ స్నానంచేసిన తరువాత ఇంటికి తిరిగివెళ్ళడానికి, కదులుతూన్న రైలు ఎక్కబోయాడు. అప్పటికే తలుపులలో కిక్కిరిసి ఉన్న ప్రయాణీకులతో పెట్టెలోకి వెళ్ళడానికి వీలుపడక ఫుట్‌బోర్డుమీద నిలబడ్డాడు. బాగా తడిగా ఉండడంవల్ల, కాలు జారి క్రిందపడ్డాడు. కాలు తెగిపోయింది. ఇదీ కథ.

"అయితే ఈ పదినెలలబట్టీ ఆస్పత్రిలో ఉన్నావన్నమాట," అన్నా.

"ఔనండీ. ఇంతకన్నా కంఠం తెగి ఉంటే ఎంతో బాగుండేది," అన్నాడు కళ్ళనీళ్ళతో.

"దుఃఖపడితే మాత్రం ఏంలాభం? ధైర్యం తెచ్చుకుని జీవితాన్ని వెళ్ళబుచ్చవలసిందే" అన్నాను.

అతను కంటినీరు తుడుచుకుంటూ, "మీది ఏదేశం? ఇక్కడ ఏం చేస్తున్నారు?" అన్నాడు.

"నేను తెలుగుదేశంనుంచి వచ్చా. పెద్ద

డాక్టరుగారివద్దే పనిచేస్తున్నా" అన్నా.

"అందుకే మీరంటే అందరూ శ్రద్ధ చూపిస్తున్నారు," అన్నాడు.

నవ్వి ఊరుకున్నా.

"మీరు విశ్రాంతి తీసుకుంటారేమో తీసుకోండి" అన్నాడు అతను వెళ్ళిపోవడానికి ఉపక్రమిస్తూ.

నాకూ నిద్రవస్తూ ఉండడంనుంచి, "ఆ ఒక్క గంట కన్ను మూస్తా" అని పడుకున్నా.

* * *

సాయంత్రం సుమారు ఐదున్నర గంటల ప్రాంతంలో టికెట్ కలెక్టర్ గా పనిచేస్తున్న శర్మ అనే స్నేహితుడు వచ్చాడు.

"ఏం బ్రదర్, సైకిలుమీదనుంచి పడి కాలు దెబ్బ తగిలిందట. గోపాలరావు గారు చెప్పేరు. ఇప్పుడు ఎలాఉంది?" అన్నాడు.

"కొంచెం బాగానే ఉంది. దాని ఖర్మమూ అని కాలు విరగలేదు. బహుశా మరో మూడు నాలుగు రోజులలో డిశ్చార్జి చేస్తారు" అన్నాను.

ఇంతలో ఒక బెంగాలీ నర్సువచ్చి నా టెంపరేచర్, పల్సు తీసుకుంటుంది. నిజానికి ఆమె చాలా చక్కనిదనే చెప్పాలి.

శర్మ తదేకదీక్షగా ఆమెను చూస్తున్నాడు. శర్మకూడా బాగానే ఉంటాడు. దానికితోడు వేషం పటాటోపంగా ఉంటుంది.

"ఏమండీ కాలు సమంగా పెట్టుకుని పడుకోమని డాక్టరుగారు ఎన్నిసార్లు చెప్పేరు?" అని నవ్వుతూ తనచేతులతో నా కాలు ఎలాగ పెట్టాలో అలాసద్ది ప్రక్క రోగివద్దకు వెళిపోయింది. ఆమె శర్మవైపు చూడనే లేదు. శర్మ ప్రయత్నం వ్యర్థమయింది.

"నీపనే బాగుంది. దెబ్బ తగిలితేనేం, చక్కగా సేవలు చేయించుకోవచ్చు. అంగులో నువ్వు రాజాగారి బావమరిదివి. నీకేం లోటు?" అన్నాడు అసూయగా.

"అదే భ్రమ. నర్సులు చూపించే ఆదరణ, వాళ్ళుచేసే సేవా ఆస్పత్రి మంచంలో ఉన్నంత సేపే. ఆ తరువాత కావాలనుకున్నా లభ్యంకావు" అన్నా.

"ఆ, ఇప్పుడు అనుభవిస్తున్నది చాలదా?" అన్నాడు.

కాసేపు అదీ ఇదీ మాట్లాడి మళ్ళీ వస్తానని చెప్పి శర్మ వెళ్ళిపోయాడు.

ఆ మర్నాడు ఉదయం తొమ్మిదిగంటలకు మళ్ళీ పెద్దడాక్టరుగారు వచ్చారు. కాలు తీసేసిన అబ్బాయి వద్దకు వెళ్ళేరు. ఆ సమయానికి ఆ అబ్బాయి తండ్రికూడా ఉన్నాడు.

ఆ అబ్బాయిని చూసి "నీ గాయం పూర్తిగా మానింది. ఈదినం ఇంటికి వెళ్ళవచ్చు. ఇంటికి వెళ్ళి ఏం చెయ్యదలుచుకున్నావు?" అన్నారు.

"ఫిఫ్తుఫారంలో మళ్ళీ చేరుతా," అన్నాడు, ఆ అబ్బాయి.

"చూడు. నీకోసం, గత పదినెలలనుంచి నీతండ్రి ఎంతో సొమ్ము ఖర్చుచేస్తున్నాడు. రెండుపూటలా నీకోసం, నాలుగు మైళ్ళ దూరంనుంచి వస్తూపోతున్నాడు. నువ్వు ఒకరికి సహాయపడలేకపోయినా, జీవితాంతం ఇంకొకరికి భారంకాకుండా స్వతంత్రంగా జీవించడానికి ప్రయత్నించు. బాగా చదువుకుని వృద్ధిలోకిరా" అన్నారు.

"లేవండి. ఇదివరకులా కాకుండా కష్టపడి చదువుతా" అని డాక్టరు గారికి నమస్కరించాడు.

డాక్టరుగారు కుర్రవాని తండ్రితో "ఈదినం ఇంటికి తీసుకుపోవచ్చు. ఎప్పుడైనా అవసరమైతే నావద్దకు తీసుకురావచ్చు," అన్నారు.

"మీరు మామీద చూపించినదయ, అభిమానం ఈ జన్మలో మరచిపోలేం. మీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేం. భగవంతుడు ఎల్లప్పుడూ తమలాంటి వారికి సహాయపడతాడు," అని పెద్ద డాక్టరుగారికి హృదయ పూర్వకంగా నమస్కరించి అబ్బాయిని తీసుకుని ఆయన వెళ్ళిపోయాడు.

వెళ్ళేముందు ఆ అబ్బాయి నా వద్దకు వచ్చి "వస్తానండీ" అని చెప్పి వెళ్ళిపోయాడు.—

రాత్రి ఎనిమిది గంటలవరకూ ఆ అబ్బాయి ఖాళీచేసిన పద్దెనిమిదో నెంబరు బెడ్ ఖాళీగానే ఉంది. గోపాలరావుగారి ధర్మమా అని ఆయన తెచ్చిన భోజనంచేసి, కొంత సేపు ఆయనతో మాట్లాడి, ఆయన వెళ్ళిపోయిన తరువాత ఆ దినమే వచ్చిన ఆంధ్ర పత్రిక చదువుతున్నా.

ఇంతలో అంబులెన్సు వచ్చి పోర్టికోలో ఆగింది. ఇద్దరు ముగ్గురు వార్డు నౌకర్ల సహాయంతో, సుమారు ముప్ఫైఏళ్ళ ఆసామీ ఒంటెనిండా రగ్గుకప్పుకుని, బలహీనంగా మూలుగుతూ, వచ్చి పద్దెనిమిదో నెంబరు బెడ్ మీద పడుకున్నాడు. ఆయనతోనే, సుమారు ఇరవైనాలుగు సంవత్సరాల ప్రాయంగల ఒక స్త్రీ, ఐదేళ్ళ అమ్మాయి, మూడు సంవత్సరాల ఒక అబ్బాయి కూడా వచ్చారు. మిగిలిన రోగులందరి దృష్టులూ ఒక్కసారి కొత్తరోగిపై ప్రసరించాయి. కొద్దిసేపట్లోనే, కొత్త రోగితో వచ్చినవాళ్ళు అతనిభార్య, పిల్లలు అని తెలిసింది.

అప్పటికప్పుడే డాక్టర్లు అందరూ ఇళ్ళకు వెళ్ళిపోవడంనుంచి నర్సు వచ్చి టెంపరేచరు, పల్సు తీసుకుని, మందు తాగించి, తలపై ఐస్ బేగ్ ఉంచి, అతనిభార్యకు ధైర్యంచెప్పి అతగావాని రోగి స్థితిగతులు ఆ వార్డు సర్జనుకు టెలిఫోన్ద్వారా తెలియజేసింది.

రాత్రి తొమ్మిదిన్నరగంటల ప్రాంతంలో ఆవార్డు సర్జనుగారువచ్చారు. అప్పటికప్పుడే రోగి ఊపిరితీసుకోవడానికి చాలాబాధ పడుతున్నాడు. డాక్టరుగారు తనిఖీచేసి, ఇంజక్షనుఇచ్చి కొంతసేపు రోగిమంచంవద్ద కూర్చున్నారు. రోగికి నెమ్మదించింది.

రోగి భార్యనుచూస్తే ఎవరో భాగ్యవంతులు, పరిస్థితులవల్ల దారిద్ర్యానికి లోబడ్డవాళ్ళని తెలుస్తూంది. తీర్చిదిద్దిన, కన్నూ, ముక్కూ, ముఖంలో ఎంతోఇంపుగాఉంది. ఆత్రుతతో, భయంతో కళ్ళంటనీరుకారుస్తూ పదేపదే భర్త యోగక్షేమాలు తెలుసుకుంటూంది.

డాక్టరుగారు ఆమెతో మరేం భయం లేదనీ, కావాలంటే ఆరాత్రి ఆస్పత్రిలో ఉండవచ్చనీ చెప్పేరు. అవసరమైతే వెంటనే ఫోన్ చెయ్యమని, జాగ్రత్తగా రోగిని కనిపెట్టుకుని ఉండమని నర్సుతో చెప్పి ఇంటికి వెళ్ళిపోయారు.

పదకొండు గంటల ప్రాంతంలో వాతావరణం చల్లబడడంనుంచి నాకు తెలియకుండా నే నిద్రపట్టింది.

బహుశా తెల్లవారుఝామున మూడు గంటల ప్రాంతంలో, "సిస్టర్! ఆక్సిజెన్, కోరమిన్" అన్నమాటలువిని ఉలిక్కిపడి లేచా. పద్దెనిమిదో నెంబర్ బెడ్వద్ద ఆ వార్డు సర్జను, పెద్దడాక్టరుగారూ ఉన్నారు. వాళ్ళ తాపత్రయంచూసి పరిస్థితి విషమించిందని తెలుసుకున్నా. ఇంచుమించు మిగిలిన రోగులుకూడా అందరూ మేల్కొని ఆసక్తితో ఆత్రుతగా చూస్తున్నారు.

పెద్దడాక్టరుగారు సిగరెట్టు కాలుస్తూ తీక్షణంగా ఆలోచిస్తూ వరండాలోకి వెళ్ళేరు. ఆ వార్డు సర్జనుగారు, రోగికి, ఆక్సిజన్ ఇంజక్షన్ ఇవ్వడంలో నిమగ్నులయారు.

పెద్దడాక్టరుగారు వరండాలోకి వెళ్ళగానే, రోగిభార్య ఆయన కాళ్ళమీదపడి, ఎలాగైనా తనభర్త ప్రాణాలు కాపాడమని వెక్కివెక్కి ఏడుస్తూంది.

"మరేం భయం లేదమ్మా, నువ్వు అనవసరంగా భయపడకు" అన్నారు.

కాని ఎంచేతో ఆమెకు ఆయన మాటల మీద నమ్మకం కలుగలేదు. ఆమె ఆయన కాళ్ళను వదలకుండానే చెప్పుకుపోతూంది.

"పాకిస్తాన్ మతకల్లోలాలలో మా కుటుంబాలన్నీ ఆహుతి ఐపోయాయి. ఆస్తులన్నీ

ఉదారస్వభావాలు

పోగొట్టుకున్నాం. మేం ఇద్దరం, పిల్లలం పడరాని పాట్లు పడ్డ తరువాత ఎలాగో ప్రాణాలతో బయట పడ్డాం. గతసంవత్సరమే ఆయనకు రైల్వేలో గుమాస్తా నౌఖరి లభించింది. నాకూ పిల్లలకు ఈ ప్రపంచంలో ఆయన తప్ప మరెవ్వరూ దిక్కు లేరు, మరో ఆధారం లేదు. ఆయనను కాపాడే భారం మీదే" అని దీనాతిదీనంగా ప్రార్థిస్తూంది.

పెద్ద డాక్టరుగారికి సుమారు ఏభైసంవత్సరాల వయస్సు ఉంటుంది. దయాస్వరూపులు, "ఆయన ప్రాణాలకు మరేం భయం లేదమ్మా మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం" అని ఆమెను ఆదరంతో ఓదార్చి, రోగివద్దకు వచ్చారు.

సుమారు ఐదున్నరగంటలు కావొచ్చింది. తెల తెల వారుతూంది. వెలుగు తెరలు చీకట్లను వెంటాడుతున్నాయి. నూతనోత్సాహంతో పక్షుల కిలకిలారవం వినసొంపుగా ఉంది. దూరానవున్న కొండలు చెట్లు ఒకటి ఒకటే స్పష్టంగా కనపడుతున్నాయి. అంతవరకూ ఒంటిమీద స్పృహ లేకుండా బాధపడుతున్న రోగిని బ్రతికించడానికి ఎన్నివిధాల ప్రయత్నించాలో అన్నివిధాలా ప్రయత్నించారు. కాని కష్టానికి ఫలితం లేకపోయింది. రోగి ప్రశాంత వాతావరణంలో శాశ్వతంగా కన్నుమూశాడు. ఆ ఇల్లాలి జీవితం, గాఢాంధకారం బంధురమైంది.

ఆ ఇల్లాలు తల నేలకు వేసి మొత్తుకుంటూ విపరీతంగా ఏడుస్తూంది. తల్లిని చూచి పిల్లలిద్దరు కూడా గుండెలు బదలయేటట్టు ఏడుస్తున్నారు.

చిన్నబోయిన ముఖంతో "ఏం చేస్తామమ్మా! విషజ్వరం, ఎన్నివిధాల ప్రయత్నించినా ప్రయోజనం లేకపోయింది." అన్నారు డాక్టరుగారు.

ఆక్సిజన్ మొదలైన పరికరాలు తీసివేశారు. రోగిని పూర్తిగా కప్పివేశారు.

అలాంటి సంఘటనలు ఆస్పత్రిలో క్రొత్త కాకపోయినా, ఎందుచేతో ఆ ఇల్లాలిని పిల్లలిని చూసి అందరూ విపరీతంగా జాలిపడుతున్నారు.

పెద్ద డాక్టరుగారి సలహా ప్రకారం, ఆ ఇల్లాల్నిద్దరు బలవంతంగా రెక్కలు విరిచి పట్టుకున్నారు. మరొకరు పిల్లలిని దూరంగా తీసుకు వెళ్ళేరు.

పెద్ద డాక్టరుగారు "చూడమ్మా మీవాళ్లు ఎవరు లేరా?" అన్నారు.

ఆమె మాట్లాడలేక మాట్లాడలేక, దుంఖాన్ని దిగమింగుతూ "నాకూ, పిల్లలకు ఈ ప్రపంచంలో మరెవ్వరూ దిక్కు లేరు. మరే ఆధారం లేదు. ఆ చావు కనీసం నాకు వచ్చినా, పిల్లలైనా బాగుపడేవాళ్లు" అని మళ్లీ విపరీతంగా ఏడుస్తూంది.

ఇంతలో, చనిపోయిన ఆసామీతో పని చేస్తున్న ఇద్దరు ముగ్గురు తోటి గుమాస్తాలు వచ్చారు. వాళ్ళలో ఇద్దరు ముగ్గురు స్త్రీలు కూడా ఉన్నారు.

పెద్ద డాక్టరుగారితో, దహన క్రియలకు వగైరాలకు తగిన ఏర్పాట్లు తామంతా కలిసి చేస్తామని చెప్పేరు. డాక్టరుగారు కొద్దిసేపు తీక్షణంగా ఆలోచించి "చూడండి. ఆ అమ్మాయిని, పిల్లలిని, నాలుగైదు రోజులలో నన్ను ఆఫీసులో కలియమని చెప్పండి," అని చెప్పి కారులో వెళ్ళిపోయారు.

మరి కొద్ది సేపట్లోనే రోగి భార్యను, పిల్లలను బలవంతంగా ఇంటికి తీసుకు వెళ్ళిపోయారు. మృత దేహాన్ని కూడా దహన క్రియలకు తీసుకు వెళ్ళిపోయారు...

* * *

నాలుగైదు రోజులయాయి నా గాయం పూర్తిగా మానింది. మామూలుగా ఆఫీసులో పని చేస్తున్నా. ఆ దినం సాయంత్రం, నాలుగు గంటలకు ఆమె, పిల్లలు వచ్చారు. అప్పటికి డాక్టరుగారు ఇంకా ఆస్పత్రినుంచి ఆఫీసుకు రాలేదు. నన్ను చూచి ఆమె గుర్తు పట్టింది. "కొద్ది సేపట్లోనే డాక్టరుగారు వస్తారు. అంతదాకా బెంచిమీద కూర్చోండి" అని ఆమెతో చెప్పి మామూలుగా నా పని చేసుకుందామని కూర్చున్నా. కాని మిషన్‌మీద చేతులు నడవడంలేదు. ఈ నాలుగు రోజులలో ఆమె ఎంతగా చిక్కి శల్యమయింది? వైధవ్యం, ఎంతగా క్రుంగదీస్తుంది? అందులో చేరదీసి ఓదార్చగల దగ్గర బంధువులు లేకపోతే, ఇతరత్రా ఆస్తిపాస్తులు లేకపోతే పరిస్థితి ఎంత హీనంగా ఉంటుందో! ఇంతకు డాక్టరుగారు ఎందుకు పిలిపించారో? ఇలా రకరకాలుగా ఆలోచిస్తున్నా. ఇంతలో కారాగింది. డాక్టరుగారు వచ్చారు. ఆయనతో బాటు ఆయన భార్య కూడా ఉన్నారు.

కొద్ది సేపట్లోనే ఆమెను గదిలోనికి పిలిపించారు. ఆమె పిల్లలూ వచ్చారు.

"ఏమమ్మా బొత్తిగా చిక్కి శల్యమయావు? నువ్వే ఇలాగయితే మరి నీ పిల్లలగతేమిటి?" అన్నారు.

"ఏం చెయ్యమంటారండీ. ఆయన మమ్మల్ని అన్యాయంచేసి వెళ్లిపోయారు. ఈ పిల్లల్ని ఎలా పెంచడమో దారీ తెన్నూ తోచక రాత్రీ పగలూ ఏడుస్తున్నా" అని కళ్లనీరు తుడుచుకుంటూ "చూడమ్మా నువ్వు ఇలా ఏడుస్తూ కూర్చుంటే నీపిల్లలు నాశనమౌతారు. జరిగిందేదో జరిగిపోయింది. నీపిల్లల కోసమైనా నువ్వు కష్టపడాలి, తప్పదు" అన్నారు.

ఆమె మౌనంగా ఊరుకుంది.

మళ్లీ డాక్టరుగారే చెప్పేరు. "చూడమ్మా నువ్వు చిన్నతనమను కోకపోతే నే నో సహాయం చెయ్యదలిచాను ఆయాగా ప్రస్తుతం ఒక పని ఖాళీ ఉంది. అన్నీ కలుపుకుని నెలకు డెబ్భై రూపాయలు ఇస్తారు. చేస్తానంటే అపని ఇస్తాను" అన్నారు.

ఆమె కొద్ది సేపు ఆలోచించి, "పిల్లల కోసం, ఏపని చెయ్యడానికైనా సిద్ధమే" అంది.

డాక్టరుగారి భార్య "ఏమమ్మా! నువ్వు ఏమైనా చదువుకున్నావా" అన్నారు.

"ఫోర్తు ఫారం పాసయాను" అంది.


"నేను బి. ఏ. ప్యాసయాను. మా అమ్మాయి ఈమధ్యనే మెట్రిక్ ప్యాసై ఇంటరులో చేరింది. నీవు ఆమె పుస్తకాలు తీసుకుని, తీరిక సమయాలలో నావద్ద చదువుకుని రెండు మూడు సంవత్సరాలు కష్టపడావంటే ఆతరువాత మెట్రిక్ ప్యాసై ఇంతకన్నా గౌరవనీయమైన ఉద్యోగం సంపాదించుకోవచ్చు" అన్నారు డాక్టరుగారి భార్య.

"మీ ఇష్టప్రకారం నడుస్తా" అంది ఆమె.

డాక్టరుగారు నావైపు తిరిగి, ఆయాపనికై ఓ అప్లికేషన్ టైపు చేసి ఇమ్మన్నారు. టైప్ చేసి ఆమె చేత సంతకం పెట్టించి ఇచ్చా. హెడ్ గుమాస్తాను పిలిచి ఫైల్ తెప్పించి వెంటనే ఆమెను ఎపాయింటు చేసినట్లు ఆర్డర్లు వేశారు. అంతవరకూ, తన అభ్యర్థికి ఆ ఉద్యోగం దొరుకుతుందన్న ఆశతో ఉన్న హెడ్ గుమాస్తాగారు, ఆమెను, పిలలనూ వింతగా చూస్తూ తెల్లముఖం వేసి వెళ్ళిపోయారు.

డాక్టరుగారు ఆమె వైపు తిరిగి 'చూడమ్మా నేను పెద్దవాణ్ణి అంచేత అనుభవం మీద ఒక మాట చెప్పదలిచా. నువ్వు ఇంకా వయస్సులో ఉన్నావు. ఎలాంటి పరిస్థితిలోనూ తప్పు త్రోవను పడక మంచిగా, కష్టపడి పనిచేసుకున్నావంటే తప్పక అభివృద్ధిలోకి వస్తావు నీపిల్లల భవిష్యత్తు బాగుపడుతుంది. ఈవిషయం ఎన్నడూ మరువకు. రేపే పనిలో చేరు" అన్నారు.

ఆమె కృతజ్ఞతతో, సెలవు తీసుకుని వెళ్లిపోయింది. డాక్టరుగారు, ఆయన భార్య యొక్క ఉదారస్వభావాలను మనసులోనే మెచ్చుకుంటూ తేలికపడ్డ మనస్సుతో మళ్ళీ నాపనిలో మునిగిపోయా... ★



[గతవారం తరువాయి]

మర్నాడుదయం కుసుమ తనయింటికి వచ్చింది. వెడుతున్నానని ఇంట్లో ఆడవాళ్ళకి చెప్పి పోవటానికి వచ్చింది. మరెవరైనా అయితే శశిని చూడటానికనా ఇదొక మిషగా భావించే వాళ్ళే. కాని శశి అలా అనుకోలేదు. తనకి అనుకూలంగా వచ్చే ఆలోచనల్ని గురించి శశికి చాలా కాలంనుంచి అనుమానాలు వేధించటం మొదలెట్టాయి. అయినా ఏం చేశాడతను? బయట నుంచుని ఉండటానికి బదులు తన గదిలోకిపోయి కూర్చుని, ఎవరేమనుకుంటారో అన్నది లక్ష్యపెట్టకుండా "కుసుమా! మాట ఇలారా" అనిపిలిచాడు.

కుసుమ గదిలోకివచ్చి, "వెడుతున్నానని చెప్పిపోవటానికి వచ్చాను చినబాబూ! నా తప్పును మనసులో పెట్టుకోకుగా!" అన్నది.

"మనసులో పెట్టుకోనా? తప్పు- ఒప్పులు, మంచిచెడులు నిన్నుగురించిన ఏ చిన్నవిషయమూ ఎప్పటికీ మరిచిపోలేను కుసుమా?"

నిన్నటికంటె శశి ప్రేమ నివేదన ఇవాళ స్పష్టంగా ఉంది. శశి అన్నట్లు కుసుమని మరిచిపోకుండా ఉంటేటయితే- నిజంగా కుసుమని అతడంత గాఢంగా ప్రేమిస్తున్నాడా?

"మీ రిలా మాట్లాడితే నాకింక అడుగు సాగుతుందా చినబాబూ?" అన్నది కుసుమ కళ్ళనీళ్ళ పర్యంతమై.

"యథార్థమైన విషయాన్ని నేను సూటిగానే చెప్పగలను కుసుమా! సూచనప్రాయంగా చెప్పటమనేది నాకు చేతకాదు."

"వెళ్ళేముందు చిక్కు తెచ్చి పెడుతున్నారు."

"వెళ్ళకుండా ఉంటే సరి!"

కుసుమని ఊళ్ళో ఉంచేందుకిప్పటికీ ప్రయత్నిస్తున్నాడు శశి, అదే అర్థంకాకుండా ఉంది. ఇంత ప్రాధేయపడటం ఎలా వచ్చింది! ఇంత బయటపడిపోవటం ఎక్కడ నేర్చుకున్నాడు? కుసుమ ఉండదని తెలుసు. ఉన్నా ప్రేమించదని తెలుసు. అయినా ఆమె సమాధానానికై ఆదుర్దాగా చూశాడు. ఏ కాలంలో వర్షానికి మాత్రం. ఎప్పుడైనా ఎండిన నదికి వరద రాకూడదా? కుసుమ తనని అర్థం చేసుకోలేదేమో ఒక వేళ! నిన్న తాటితోపులో తమాషాకి అలా అన్నదేమో!

"ఉండి ఏం చెయ్యను చినబాబూ? దానివల్ల మీకూ కష్టం నాకూ కష్టం. ఈ వయసులో ఇంకా కష్టానికి తట్టుకోగలనా? కంఠానికి ఉరి-గిరీ పోసుకుంటానేమో ఒక వేళ!" అన్నది కుసుమ భయపడుతూ.

శశికి చేతకాకపోవచ్చు, కాని మనసులోని ఉద్దేశ్యాన్ని సూచనతో కుసుమ స్పష్టంగా చెప్పగలదు. మొదట్నుంచీ తన ఉద్దేశ్యాన్ని శశికి అలా చెప్పటం అలవాటు కనుక-అరితేరిందయిం దిప్పుడు. శశి ముఖం మాడిపోయింది. "వద్దు కుసుమా వద్దు. ఛీ! అలాంటి పని ఎన్నడూ చెయ్యకు. ముందే ఆ మాట చెప్పినట్లయితే ఉండమనికూడా అనేవాణ్ణి కాదసలు. మనస్సింత వికలమై పోయి ఉంటే పుట్టింటికే వెళ్ళి ఉండు. మొదట్నుంచీ వినకొందు ఆలోచించి చేస్తూ ఉండు ఏ పనైనా "అనే చెపుతూ వచ్చాను నీకు" అన్నాడు శశి భయపడుతూ.

"అలా చెయ్యకపోయినట్లయితే ఏనాడో కంఠానికి ఉరి పోసుకుని ఉండేదాన్ని చినబాబూ! ఇంక వెళ్ళనా?"

ఈ అనుమతిని కోరటానికి కారణమేమిటో ఎంత ఆలోచించినా తోచలేదు శశికి అప్పుడు.

ఇంత గ్రంథంనడిపి కుసుమ పుట్టింటికి వెళ్ళింది. కుసుమ స్వభావమే ఇంత. జీవితాన్ని నాటకంగా మలచుకునే చేవ ఆమెకి ఆదికాలంనుంచి కద్దు...

ఊరువదిలిపెట్టి పోదామన్న ఆశ ఒక్కటే కాదు. శశి పెట్టుకున్న చాలా ఆశలు దెబ్బతినిపోయాయి. ఇకా ఊళ్ళో ఉండవలసిన అగత్యమేం కన్పించటంలేదతడికి. ఆస్పత్రి అతడికి గుదిబండ అయినమాట నిజమే, కాని మరొక డాక్టర్ని ఎవర్నయినా నియమించి తాను వెళ్ళిపోవచ్చు. తాను వెళ్ళిపోతున్న సంగతి బయటికి పొక్కినట్టే ఇంటా బయటా కూడా కావలసినంత గొడవ అవుతుంది. సవాలక్ష సంజాయిషీలు చెప్పుకోవాలి. వాళ్ళ వలపోతలు, వాళ్ళ అభ్యంతరాలు వినలేక ప్రాణంపోతుంది. అది తోసిపుచ్చటానికి వీల్లేనిది. పెట్టే—బేడా చంకనెట్టుకుని వెళ్ళిపోతే ఊళ్ళో ఒక్క వ్యక్తి బాధపడటానికి తాను 'కుసుమ' కాదు.

గొడవ అవుతుందన్న భయమే అతణ్ణి అణచిపెటింది. మనస్సు ఏమీ బావుండటంలేదు శరీరమూ అంతంత మాత్రంగానే ఉంటోంది. ఉత్సాహం, ధైర్యం పూర్తిగా లోపించాయి.

★ జీవనరేఖ ★

రెండు నెలలు గడిచిపోయాయి. ప్రొద్దునుంచీ అనుమానంగానే ఉంది. ఆరోజున అర్ధరాత్రికి అనుకుంటున్న ఆపదే వచ్చిపడింది సేన్ దీదీకి.

నిజంగా ఆపదే. సేన్ దీదీ బ్రతుకుతుందని తోచదు.

వయసు చెల్లాక తొలిసంతానం కలగటం అదృష్టంగానే భావించవచ్చు కాని అది ఆపత్కరంగానూ పరిణమించవచ్చు. గోపాల్‌కి ఈభయం పట్టుకున్నట్లు తోస్తుంది. ఇప్పుడతడు ఒకటి రెండురోజులు కూడా ఊరుకదలి వెళ్ళటం మానేశాడు. పూట పూటా ఆమె ఎలా ఉన్నదీ తెలుసుకుంటూనే ఉన్నాడు. యామినీ కవిరాజ్ గారింటికి వస్తూపోతూనే ఉన్నాడు. యామినియే కనుక బ్రతికి ఉన్నట్లయితే ఏమైనాసరే ఆ ఛాయలకు వెళ్ళేవాడు కాదు. సేన్ దీదీ సోదరుడు కృపానాథ కవిరాజ్ గోపాల్‌కి చాలా మచ్చికయినాడు. అతడు వైద్యం బాగా చదువుకున్నవాడే, కాని ప్రయోగవిధానం తెలియదతడికి— ప్రాక్టీసూ లేదు. చరక సుశ్రుతాల్లోని శ్లోకాల్ని ఎత్తిచెప్పటంలో మధ్య మధ్య గోపాల్ స్తుతి కూడా కలుపుతూంటాడేమో! గోపాల్ అతడిమీద చాలా దయచూపిస్తున్నాడు. లేకపోతే సకుటుంబంగా వచ్చి యామినియింట్లో ఎక్కువరోజులుండే అదృష్టం స్థిరంగా ఉండదు. వాళ్ళని వెళ్ళకొట్టమని గోపాల్ చెప్తాడు. 'మీరు వెళ్ళిపొండి'- అని సేన్‌దీదీ కూడా అనేస్తుంది. ఏదో ఓ పెద్దదావా విచారణ సందర్భంలో గోపాల్ వాజత్ పూరి వెళ్ళాడు. కోర్టుపని ఉన్నప్పుడు గోపాల్ వెంటనే యింటికితిరిగి రావటం అలవాటులేదు. కాని ఆ రోజున మాత్రం వచ్చాడు. అప్పటికి పదిదాటి ఉంటుంది రాత్రి...సేన్‌దీదీ విషయమై కబురు వచ్చేసరికి గోపాల్ భోజనం ముందు కూర్చుని ఉన్నాడు. ప్రక్కన కవి కూడా ఉన్నాడు. కబురు తీసుకు వచ్చింది కృపానాథ్.

"పెద్ద ఆపద వచ్చింది అన్నగారూ! తమరొక్కసారి రావాలి" గోపాల్ కొంచెం కంగారుగా "ఆఁ! నేను వచ్చి ఏం చేస్తానోయ్!" అన్నాడు. అతడి ముఖం ముడుచుకుపోయి ఉంది అప్పుడు.

"ఒక్కసారి రావాలి. వచ్చి కాస్త సలహా-సంప్రతింపు—"

సలహా—సంప్రతింపూనా! ఆపద వచ్చినప్పుడు వెళ్ళి సలహాఇవ్వటం తప్పుకిందికి రాదు. గోపాల్ గబగబా భోజనంచేసి లేచాడు. గోపాల్ తొణక్కుండా ఉండాలని ప్రయత్నించాడు. కాని ఆదుర్దాని అణచుకోలేకపోయాడు. ఇంట్లో ఆడవాళ్ళు ముఖ ముఖాలు చూసుకున్నారు. కవి మెదలకుండా తలవంచుకుని భోజనం చేశాడు.

ఈ ఇంటికి వచ్చి గోపాల్ కృపానాథ్‌కి ఏం సలహా ఇచ్చాడో అది అతడికే తెలియాలి. కవి భోజనంచేసి, చేతులు తుడుచుకుని, లోపలికి వెళ్ళి ఇహ పడుకుందామని అనుకుంటూండగా కృపానాథ్ వచ్చి "నీవొక్కసారిరావాలి" అన్నాడు.

"నన్ను దయవుంచి 'నువ్వు' అని మాత్రం అనకండి" అని అన్నాడు కవి.

"ఆఁ!..."అంటూ కృపానాథ్ వెనక్కి తగ్గాడు. కాలిన కొయితంలా అయిందతడి ముఖం, అక్కడికీ "నేను మీనాన్నగారికి స్నేహితుణ్ణి కనుక—" అంటూ ఏదో మొదలెట్టాడు...

"మీరు వెళ్ళండి మహాశయా! నాకునిద్రొస్తోంది" అన్నాడు.

కృపానాథ్ మళ్ళీ కొంచెంసేపు ఆగాడు. జంకు తీరటానికి అతడికి కొంతసేపు పట్టింది. తర్వాత సంస్కృతశ్లోకం చదివినట్లు గడగడా వచ్చిన ఆపద చెప్పేశాడు. అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

శశి వెళ్లకపోతే సేన్‌దీదీ బ్రతకదు. వెళ్ళినా బ్రతుకుతుందో లేదో భగవంతుడికి తెలియాలి. అయినా ఊపిరాడుతున్నంత వరకు మందూ—మాకూ వెయ్యకుండా ఊరుకోలేరు కదా! కనుక "దయ ఉంచి తమరొకసారి రండి శశి బాబూ!" అన్నాడు కృపానాథ్. ఊళ్ళో మరొక డాక్టరు లేడు. కృపానాథ్ కూడా వైద్యుడే. అయినా అతడికి గొడవలన్నీ తెలియవు. ఏ జ్వరమో—ఏదో వస్తే 'ఉప్పు' అరగతీసి యిస్తాడు. కన్ను మూసి తెరిచేలోపల జ్వరం జారిపోవాల్సిందే! ఇది అలాంటి కేసు కాదే! శశి తప్ప సేన్‌దీదీకి గత్యంతరం లేదిప్పుడు. అలా చూస్తుంటే సేన్‌దీదీ మశూచికపు గాధంతా జ్ఞప్తికి వచ్చింది. కొంతకాలంలో సాల్ట్ గావ్‌లోని ఓ మశూచికపు రోగిలోని వ్యాధి బీజాలు రెండు మైళ్లు ప్రయాణం చేసివచ్చి సేన్‌దీదీ శరీరంలో ప్రవేశించాయి. ఆ సాల్ట్ గావ్‌లోని రోగికి వైద్యం చేసింది యామిని శిష్యుడు. అప్పుడు ఈ యింటో గోపాల్, ఆ ఇంట్లో యామిని ఇద్దరూ తనని ఆమెకి వైద్యం చెయ్యనీయలేదు. ఎన్ని ఉపపత్తులు చూపించి, ఎంత వాదించి, అవమానాల్ని ఆవేశాల్ని లెక్క చెయ్యకుండా అప్పుడామెని బ్రతికించాడు తాను! ఒకరకంగా ఒంట్లో హాజం చూసుకుని చేశాడాపని. ఈనాడు మళ్ళీ సేన్‌దీదీ మరొక కారణంగా మరణశయ్యమీద ఉంది. ఇప్పుడు తాను వైద్యం చెయ్యటానికి అడ్డుచెప్పేవారు లేరు. గోపాలే స్వయంగా కబురంపాడు. ఎందుకు కబురంపాడు! కాదుకని ఇలా కబురంపే అధికారం ఎవరిచ్చారు గోపాల్‌కి? సేన్‌దీదీ బ్రతకనియ్—చావనియ్. శశికేమి లెక్క? ఇలాంటి రోగులు ఎంతమంది శశి చేతి మీదుగా చచ్చిపోయారు? సేన్‌దీదీ శశి రోగి కూడా కాదిప్పుడు. మిగిలినవన్నీ మరిచిపోయినా తాను డాక్టరునన్న సంగతైనా శశి గుర్తుంచుకోవాలి. చావుకి సిద్ధమైఉన్న రోగి తాలూకు ఆత్మీయులు వచ్చి తనను పిలిచారు. అయినా వెళ్లకుండా ఉండే అధికారం అతడికి ఉంది. ఒంట్లో నీరసంగా ఉన్నదతడికి. రోజంతా కష్టపడి పనిచేసి, అలసిసొలసి ఇంటికి వచ్చాడతడు. ఇప్పుడు పిలుపు వచ్చినంతమాత్రాన పరుగెత్తగలడా? విశ్రాంతి అనేది అతడికి మాత్రం అక్కర లేదూ?

కృపానాథ్ 'ఫీ'లయి వెళ్లిపోయాక దీపం తగ్గించి, శశి మంచంమీద కూర్చుని చుట్టొకటి ముట్టించాడు. ఇటీవల అతడు బీడీలకి బదులు చుట్టలు కాలుస్తున్నాడు.

కుంద వచ్చి "ఇప్పుడే పడుకుంటావా శశిదాదా? దోమతెర వేసి వెళ్లనా?" అని అడిగింది.

"వెయ్యి" అన్నాడు శశి.

దోమతెర మూలలకి తగిలిస్తూ "సేన్ దీదీని ఓసారి చూసి రావటానికి వెళ్ళరాదా శశిదాదా?" అని అడిగింది. శశి మండిపడుతూ—"నీకు నేనంటే వేళాకోళంగా ఉందా కుందా?" అన్నాడు.

కుంద గాభరాపడి పోయింది. తర్వాత ఏడుస్తూ—"ఏదో తిండిపెడుతున్నారు కదా అని నేనేది మాట్లాడినా మీరు కోప్పడుతూంటారు. నేనేం చేశానని? ఇంతకంటె నన్ను పంపించి వెయ్యండి. ఎక్కడికో అక్కడికి పోతాను" అన్నది.

శశి కొంచెం శాంతించి "అనవసరపు సంగతులు మాట్లాడుతూంటే కోపం వస్తుంది" అన్నాడు.

కుంద ఏడుపు ఒకపట్టాన ఆగదు. ఆమె ఏడుస్తూనే—"అనవసరపు సంగతు లెప్పుడు మాట్లాడాను! నే నెప్పుడు వేళాకోళమాడాను? ఓసారి మీ వైద్యంతో ఆమెని బ్రతికించారు కనుక వెళ్ళి చూసిరారా అని అడిగాను. అది తప్పేనా?" అన్నది.

శశి ఇంక శాంతించి "ఒంట్లో బాగాలేదు కుందా. ఒళ్లంతా విరగ్గొట్టినట్లుంది. ఏడవకు. నీచేతిలో పనికానిచ్చి వెళ్ళు. పడుకుంటాను" అన్నాడు.

రాత్రి యించుమించు పన్నెండింటికి శశి గదితలుపు కొడుతూ "శశీ! నిద్రపోతున్నావా?" అని పిలిచాడు గోపాల్.

అస్వస్థతగా ఉన్న శశికి అప్పుడే నిద్ర పట్టింది. ఊఁ! అని పలికేసరికి గోపాల్ తలుపు తెరవమన్నాడు. శశి లేచివెళ్లి తలుపుతీశాడు. గోపాల్ చేతిలో లాంతరుంది. దాన్ని అతడు క్రిందపెట్టి మంచంమీద కూర్చున్నాడు. గోపాల్ ముఖం దిగులుగా గంభీరంగా ఉంది. అతడేమీ మాట్లాడడేమో అనిపిస్తుంది. ఇలా అర్ధరాత్రివేళ కొడుకు ఎదుట మౌనంగానే తన ఆవేదన వ్యక్తం చేస్తూ కూర్చుంటా డల్లే ఉంది:

చివరికి శశికే విసుగొచ్చి, "నాకు నిద్దరొస్తోంది" అన్నాడు.

"నిద్దరొస్తోందా? అవును ఎందుకురాదు? ఇప్పుడేం తక్కువ ప్రొద్దుపోయిందా? నీవంట్లో బాగా కూడా లేదు. ఒక మనిషి చచ్చిపోతోంది. అందుకని కాని లేకపోతే నిన్ను పిలిచేవాణ్ణి కాదు శశీ!"

శశి మెదలకుండా ఊరుకున్నాడు. గోపాల్ ఆదుర్దాగా "వెళ్ళవూ ఒకసారి? ఊరికే వచ్చిపోవటం కాదు శశీ! ఎంత బాధపడుతోందనుకున్నావ్?" అన్నాడు.

"వాళ్లు వాజత్‌పూర్ నుంచి డాక్టరుని ఎందుకు రప్పించలేకపోయారు? సాయంత్రం మనిషిని పంపినట్లయితే ఈ పాటికి వచ్చేవాడుగా!"

"ఆ ఆలోచన ఎవరికీ తోచలేదు. నువ్వు ఊళ్లో ఉండగా వాజత్పూర్ డాక్టర్ని తీసుకురావటానికి మనిషిని పంపటం దేనికి? నీకంటె అతడేం పెద్ద తెలిసినవాడు, అనుభవమున్నవాడు కాదు. పిలిస్తే నువ్వు రావని వాళ్లు కల్లో కూడా అనుకోలేదు శశీ! కృపానాథ్ ఇప్పుడు నా కాళ్లా వేళ్లా పడుతున్నాడు నాయనా! నువ్వు అవమానించి పంపటం మూలంగా మళ్ళీ నీదగ్గరకి రావటానికి ధైర్యం చాలటం లేదతడికి."

శశికి చాలా కష్టం వేసింది. అతడు చాలా నెమ్మదిగా—"మాన మర్యాదలనేవి నాకూ ఉన్నాయి నాన్నా!" అన్నాడు.

"అహఁ హఁ. నిన్ను నేనేం అవమానించటం లేదు శ." అన్నాడు గోపాల్. పొరపాటుగా ఓ మాట జారాడేమో—ఇంక, ఆమాటను పూర్తి చెయ్యలేదు గోపాల్. తర్వాత ఇద్దరూ మెదలకుండా ఊరుకున్నారు. గోపాల్ తడబడుతూ శశికేసి జాలిగా చూశాడు. గోపాలే తనని బ్రతిమాలటానికి స్వయంగా వస్తాడని శశి కల్లోకూడా ఊహించలేదు. గోపాల్‌కి సేన్‌దీదీ జీవితం ఇంత విలువైనదా? అయితే మరి ఒకప్పుడు తాను ఆమెకి చికిత్స చెయ్యబోతే ఎందుకు అడ్డుపడ్డాడు? శశికి ఎక్కడలేని విచారం, సిగ్గుకలగటంతోపాటు ఆశ్చర్యం కూడా వేసింది. మశూచికం ఆమెలోని సౌందర్యాన్ని మింగెయ్యగానే ఎక్కడలేని మమకారం పుట్టుకువచ్చింది గోపాల్‌కి. అంతటి గంభీరమైన దురవగాహమైన అపేక్ష అతడిది.

తర్వాత శశి—"సరే, మీరు వెళ్లి పడుకోండి. నేను వెడుతున్నానక్కడికి చొక్కా వేసుకుని" అన్నాడు.

గోపాల్ మాట్లాడకుండా లేచాడు. అతడికివాళ నోట మాటవచ్చేటంత కుదురుగా లేదు మనస్సు. శశి అతణ్ణి చాలా కష్టపెట్టాడు. ఇవాళ కలిగించిన కష్టం చెప్పనలవికానిది. కృపానాథ్ వచ్చి పిలిచినప్పుడే కనుక సేన్‌దీదీని చూడటానికి వెళ్ళి ఉంటే—గోపాల్ ఈ బలితిపడటం తప్పేది కదా!


ఈ పరిస్థితుల్లో బయలుదేరి వెళ్లాడు కనుక—సేన్‌దీదీని బ్రతికించటానికై శాయశక్తులా ప్రయత్నించాడు శశి. అర్ధరాత్రిప్పుడు ఆపదలో మునిగిఉన్న ఆయింట్లో మరొక చిక్కు కూడా తెచ్చిపెట్టాడతడు. అదలించి—ఆజ్ఞాపెట్టి ఇంట్లోవాళ్లందర్నీ హడలుకొట్టేశాడు. మనిషిని పంపి ఆస్పత్రినుంచి—మందులు, పరికరాలు తెప్పించాడు. కంపౌండరుని పిలిపించాడు. కొంతసేపటి క్రితంవరకు శశి తనకేం పట్టిందన్న భావంతో సేన్‌దీదీని చావుకు సిద్ధమయే స్థితికి తీసుకొచ్చాడని ఎవరనగలరిప్పుడు? కనక సేన్‌దీదీని బ్రతికించటానికి వచ్చిన పట్టుదలే ఇప్పుడూ వచ్చింది మళ్ళీ. ఆనాడు బయటనుంచి వచ్చిన

(47-వ పేజీ చూడండి)


రెండు గొప్ప లాభాలు



మెట్రిక్ విధాన తూకాలు, కొలతలకు మార్పువల్ల మనకు రెండు ప్రధాన విధాలలో లాభిస్తుంది. మన దేశంలో ప్రస్తుతం అనుసరింపబడుతూన్న నానా పద్ధతుల మూలాన కలుగు కలతలు, నష్టాలూ అంతరిస్తాయి.



అంతర రాష్ట్రీయంగా అనుసరింపబడుతూన్న ఒకే పద్ధతిని మనమూ వాడకంలోకి తేగలుగుతాము. మెట్రిక్ పద్ధతిని ప్రపంచమంతటా గల అన్నిదేశాలూ అంగీకరించాయి.



ఈ ద్విముఖోద్దేశ పద్ధతిని సాధించడానికి తొలిమెట్టుగా ఇది మనదేశంలో ఎంచుకొన్న కొన్ని కొన్ని రాష్ట్రప్రదేశాలలోనూ, పరిశ్రమలలోనూ ఇదివరకే ప్రవేశ పెట్టబడి యున్నది.

మెట్రిక్ పద్ధతి

సులభతరం చేయడానికి ఏకరీతి వాడకానికి

ఇండియా ప్రభుత్వము వారిచె ప్రచురించబడింది.

కొత్త కేలెండర్లు

అయ్యగారి విశ్వేశ్వరరావు

చూచినకొద్దీ ఆ గదులన్నీ చోద్యంగా వున్నాయి మీనాకళ్లకి. ఎంత హాయిగావుంది చూస్తూంటే అనుకుంది మీనా. కాంత యింకా గర్వంగా అందుకుంది. మావారు ఇంకా చాలాచోట్ల పుచ్చుకున్న కేలండర్లని ఎవరెవరికో అడిగిందే తడవుగా ఇచ్చారు. లేకపోతేనా-యింకా కిటకిటలాడేవి-గదులు కొత్త కాలెండర్లతో అంది కాంత.

అయితే-యీ కేలండర్లు కొన్నవి కాదన్నమాట! అంది ఆతురతతో మీనా. చచ్చా! ఏమంత ఖర్మం కాలింది. ప్రతికంపెనీవాళ్ళకీ మావారు తెలుసు. ఇళ్లకి తెచ్చియిచ్చారు మీనా! అదిగో ఆ ఫ్లష్ పుటులో పడేసి వుంచాం చూడు వందకేలండర్ల గుట్ట-కనిపించటంలేదూ! అంది కాంత.

పరదాలేని మొగుడు పంతకొళ్లినా! అనుకుంది మీనా. కాంత నిజంగా పెట్టిపుట్టింది. రేడియో, ఫోన్ చక్క నికర్చీలు, మర్యాదకి స్టెయిన్‌లెస్ స్టీలు గ్లాసులు. ఆహా-కాంతది సంసారసుఖం అనుకుని మీనా గుస్సు మిటకరించి చూసింది ఇంకా కేలండర్ల వైపు.

ఇదిగో యీ నటరాజు కేలండరుంది చూశావూ-వరల్డు ఫస్టు ప్రైజు పొందిన బొమ్మ. ఎంతో మంది ప్రయత్నించారు దీని కోసం. యెవ్వరికీ లభ్యం కాలేదు. ఎంత అందంగా వుందంటావ్ మీనా. అదిగో అది రాధాకృష్ణ చిత్రం. బలేబావుందికదూ-అని కాంత చెబుతూంటే మీనాఅనుకుంది-తనకో కేలండరు ఇమ్మనమని అడుగుదామని. ఇంతలోనే యింట్లోవున్న కేలండర్లని వర్ణించి యిలా అంది కాంత. ఏదైనా ఇస్తానుకొని-కేలండరు ఇమ్మనమంటే ఎవరికైనా సరే! చస్తే ఇవ్వను! ఎదటివాళ్లు యేమైనా అనుకోని-అంటూ.

మీనాకి యీగర్వం నచ్చలేదు. ఇంక యెవళ్ళకీ లభ్యం కావా! ఈపాటి కేలండర్లు అనుకుంది. పంతానికైనా వచ్చే ఆదివారం నాటికి కాంతని మన యింటికి టీకి ఆహ్వానించాలి. ప్రతిగుమ్మానికీ ఒక కేలండరు వుండేటట్టు చేయాలి. ఇంతకన్న షోకైన కేలండర్లని సంపాదించాలి. మావారితో చెప్పాలి. అవసరమైతే డబ్బెట్టి కొనాలి. మా వారి దగ్గర డబ్బులేకపోతే నా పెట్టె అడుగున వున్న బ్లాక్ మనీతోనైనా కొనాలి అని తీర్మానించింది మీనా.

మర్యాదచేసి-మంచి మాటలతో కాంతని సాగనంపింది మీనా. తప్పక వచ్చే ఆదివారం మీ వారితో సహా రావాలి సుమండీ మా యింటికి-ఆ వేళ నా పుట్టినరోజు అని దబాయించింది మీనా. ఎలాగైనా-యింతకన్న నాజూకు కేలండర్లతో కాంతని హోరతించాలి. ఒక మంచి కేలండరు ఎక్స్ట్రాగా తీసుకుని-బుద్ధివచ్చేటట్లు ప్రెజెంటు చేయాలి. ఇవన్నీ చూసి కాంత ఒక గుణపాఠం నేర్చుకుంటుందిలే-అనుకుంటూ మీనా తిరుగుముఖం పట్టింది యింటికి. తలుపు తాళంతీసి చూసేసరికి అప్పుడే అయిదున్నర అయింది. యిలా అనుకుంటూ మీనా ముస్తాబై-శ్రీవారి కోసం ఎదురుచూస్తూంది.

మరి కొంతసేపటికి చిరాకుగా శర్మ యింటికి వచ్చాడు. అన్నింటికీ చిరాకే. రాగానే వుత్తరాలేమైనా వచ్చాయా? అని అడిగాడు. రాలేదంది మీనా. అవేవిటి ఆకిటికీలో వున్నవి—పాత వుత్తరాలా! అన్నాడు శర్మ. తీరా చూస్తే అవి పాత వుత్తరాలు కావు. కొత్త పోస్టు కార్డులు—ఆ వేళటి పోస్టు ముద్రతో నిగనిగలాడుతున్నాయి. అమాంతంగా శర్మ ఆగ్రహించి యిలా అన్నాడు. "రాణీగారు ఎక్కడికైనా సర్క్యూటు కొట్టారా యేమిటి! పోస్టు వచ్చిన వేళకి!"—బలే వారండీ దొంగని యిట్టే పట్టుకున్నారు. నిజానికి యే పోలీసు డిపార్టుమెంటులో చేరాలసిన వారు పొరపాటున పోవరు డివిజను గుమాస్తాగా జనించారు!" అంది మీనా.

నా జన్మకాల పత్రుల మాట అటుంచు నువ్వు పొరుగింటికి వెళ్ళితంటే నే—నాకు బెంగ! గుండె దడదడలాడుతుంది-అన్నాడు శర్మ.

అదేమిటండీ—మరీ చిత్రంగా మాట్లాడుతారు. ఆడాళ్ళయాక అస్తమానూ ఇంట్లోనే అఘోరించాలంటారా. ఇరుగూ—పొరుగూ యేమవాలి. అస్తమానూ ఇంట్లోనే గోళ్ళు గిల్లుకుంటూ కూర్చుంటే యేం తోస్తుంది అంది మీనా.

వెళ్ళిన దానివి తిన్నగా వుంటావుకనకనా-అన్నాడు శర్మ.

తిన్నగా వుండక పిశాచంలాగ ఏడిపించానా అంది మీనా చిరుకోపంతో.

ఇంకా పిశాచాలే నయమేమో. జాలి దలిచి వదుల్తాయి అన్నాడు శర్మ.

చాల్లెండి—మీరూ మీ కబుర్లూనూ. నేనేమీ అలాంటిదాన్ని కాదుఅంది మీనా.

కాదు మీనా, మొన్న దసరాల ముందు మీ ఫ్రెండు ఇంటికి వెళ్లావ్. ఆవిడ కొనుక్కున్న చీరలు చూసేసరికి నీకు మతి పోయింది. ఇంటికి వచ్చి చీరల బెంగతో నువ్వు చూపించే దశావతారాలూ చూసేసరికి నేను నీరయిపోయాను. అప్పుచేసి ఆఖరకు నీ అలక తీర్చాను. ఆ అప్పు ఇంకా తీరలేదు అన్నాడు శర్మ.

ఓస్-యింతేకదా. అలికి చీర కొనడం కూడా ఘనకార్యమేనా! అని చప్పరించింది మీనా. మగాడి కష్టాలను గమనించకుండా ఖర్చులు పెంచే ఆడాళ్లని తలుచుకుని దణ్ణం పెట్టాడు తనలో శర్మ.

వాళ్లని చూసి—వీళ్లని చూసి చెవికివున్న దుద్దుల్ని మీనా లేదంటే ఇప్పటికి ఆరుసార్లు మార్చింది. అలాగే ముక్కుపేసరి కూడా మారింది. కాలిపట్టాల మాట యింక వేరే చెప్పాలా, ఈ నాటి ట్రిప్పు తనకేం ముప్పో అనుకున్నాడు శర్మ యింకా తనలోనే.

పోయి చకచకా కాఫీ తెచ్చింది మీనా. ముస్తాబయిన మీనా! ఇప్పుడే పెత్తనానికి పోయివచ్చిన మీనా! ఎందుకింత హుషారుగా వుంది? ఇదేదో ముందరి కాళ్ళకి బందంలాగా వుంది-అనుకుంటూండగానే మీనా-శర్మ ఇలా మాట్లాడుకుంటున్నారు.

'మనకి కొత్త సంవత్సరం చాలా బాగుంటుంది కదాండీ'

'ఓ—దర్జాగా వుంటుంది!'

'అయితే-ఒక్క కేలండరయినా తెచ్చారు కారేం'

'ఆ కేలండర్ల పిచ్చ నాకేమీ లేదు. నీకెందుకుండాలి'

'అలా అంటారేమిటండీ! నవనాగరకతకు చిహ్నం కేలండరు'

★ కొత్త కేలండర్లు ★

'అయితే'

'కేలండర్ లేనివాని యిల్లు-యిల్లే కాదు'

'అలాగయితే-పంచాంగం కేలండరు యివాళే కొని తెచ్చాను లే'

'ఛా! వుప్పుడిపిండి తిన్నట్టు. అదేం కేలండరు. గోడ అందంకూడా బంద్'

'మరేం కావాలంటావ్'

'మూడు రంగుల కేలండర్. ముగ్గులొలికే కేలండర్, చూచేవాళ్ళని ముగ్ధుల్ని చేసే కేలండర్. అలాంటివి బహువచనంలో వుండాలి'

'నీకు గొంతెమ్మ కోరికలు చాలా వున్నాయి నే చెప్పలే, నీ టిప్పు నాకు ముప్పు.'

'కేలండరుతో నే ముప్పు వస్తుందనడం శుద్ధ తప్పు. సాహసించినందుకు క్షమించండి'

'మీనా!-తేదీలు తెలుసుకోవడానికేగా కేలండరు. ఈ పంచాంగం కేలండరుతో తిథులు-పండుగలు-సెలవుదినాలు-అన్నీ తేలికగా తెలుసుకోవచ్చు. ఇదుగో గోడకు కొట్టు'

'దాని మొహం చూస్తేనే నాకు కోపం. బొమ్మల కేలండరు-ధగధగలాడే దర్జా కేలండరు తీసుకురండి. నా మొగుడూ ప్రయోజకుడే అని చెప్పుకోనీండి'

'కేలండరు తెచ్చిన మొగుడే నా-మీ మహిళామండలి దృష్టిలో మహావీరుడు'

"అక్షరాలా అంతే. ఇందాకా మన కాంత యింటికి వెళ్ళాను ఎన్ని కేలండర్లు ఊపిరి సలపకుండా—గోడనిండా అవే. అప్పుడు మన గోడలూ—మీరు జ్ఞాపకానికి వచ్చారు."

"ఓహో! అదా దీని పునాది! భేష్"

"మావారు తెచ్చారమ్మా ఎన్నో కేలండర్లు తీరుబడిలేక తగల్చలేదన్నాను. ఆదివారం నాడు టీకి రమ్మన్నాను. ఆదివారం అంటే ఎల్లుండి. ఆవిడ వస్తుంది. గొప్పకి—మా యింట్లో కేలండర్లని చూసే మతిపోతుందన్నాను. ఏం చేద్దామంటారు?"

"ఇందులో యేముంది లే. ఇప్పటికి జీతాలలో ఆఖరికి యిర్వై రూపాయలున్నాయి. మంచి అంగడికిపోయి—చిన్న సరుకొని పెద్ద కేలండరు పొందాలి. అలా పదికొట్లు తిరిగామంటే—పది కేలండర్లు చాలవూ—మన గదికి—ఏమంటావ్ మీనా"

"వెరీగుడ్—మంచిప్లాను, మరి యిప్పుడే పోదాంరండి."

ఇలా కూడబలుక్కుని ఆ భార్యాభర్తలు ఆనందంగా పెద్దబజారుకుపోయారు. ఒక పెద్ద ఫేన్సీ షాపు చూశారు. బలే షాపుంది. శర్మ అన్నాడు—మీనా! వీడు పెద్దకేలండరుని అచ్చువేయించి వుంటాడు. చేవాన్సగా కేలండర్ని యిమ్మంటే ముఖం ముడుచుకుంటాడు. కాంపిలగా తిద్దాం చిన్న చిన్న సామానుల్ని-అనగానే మీనా సరేనంది. ఇదరూ కొట్లోకి పోయారు. రెండు రూపాయలతో టాల్కం పవుడరు టిన్—స్నో బాటిలు-కొన్నారు. బిలు ప్రకారం పైకం చెల్లించినా షాపు కీపరు కేలండరు బహుమానించలేదు. శర్మ తనంతట తానే నోరు తెరిచి అడగ్గానే—ఆ పెద్దమనిషి-సారీ-యీ యేడు మేం కేలండరు వేయించలేదు సార్ అన్నాడు. శర్మ చిన్నబుచ్చుకున్నాడు—మీనాతో.

ఇంకో కొట్టుకెళ్ళి కొని యిలా చేశావేం అంది మీనా నాడి కొట్లాంటి కొట్లున్నాయి. అదిగో ఆ పెద్దబట్టల కొట్టుకు పోదాంరా అంటూ శర్మ—మీనాతో ఆ కొట్లోకి వెళ్లాడు. పదిరూపాయలతో వచ్చే కోయంబత్తూరు చీర కొన్నాడు. కేలండరు మాట ఏదూ రెత్తటంలేదు. ఇది కూడా వేస్తేనా? అనుకుంటున్నాడు శర్మ. అనుకున్నట్టుగానే అయింది. కాకపోతే—వేసిన కేలండర్లు అయిపోయాయి సార్ అన్నాడు వీడు మన దురదృష్టం అనుకుంది మీనా.

కాను—యిప్పుడు జ్ఞాపకానికి వచ్చింది. ఆ పక్క కొట్లో మూడు సబ్బుబిళ్లలు కొంటే మంచి కేలండరు యిస్తున్నాడట. పోదాంరా అని మీనాతో శర్మ ఆ కొట్టుకు పోయాడు. సబ్బుబిళ్లలు కొన్నాడు. పైకం యిస్తూ బొమ్మల కేలండరు బహుమానం యివ్వరా? అన్నాడు, అరె—గడువు తేదీ దాటి పోయిందండీ, యీ కన్సెషను నిన్నటితో సరి అని సానుభూతి చూపించాడు షాపుకీపరు.

మీనాకి నిరాశ బయలుదేరింది. చెవులో కాంత గర్వం మాటలే కంకుమంటున్నాయి తన పిలుపు కూడా దప్పుడు చేస్తోంది కేలండరు సంపాదించలేని శర్మ కూడా దిగాలు పడ్డాడు.

ఈ చీరకి ఆ ఫాన్సీ సరుకులకి పెట్టే డబ్బుతో ఎన్ని కేలండర్లయినా కొనచ్చు మిగతా డబ్బుతోనైనా కొందాం రండి—అంటూ మీనా భర్తకి హెచ్చరించి పై బజారుకు పోయింది.

ఒకచోట పెద్ద పెద్ద కేలండర్లున్నాయి. ధరజాస్తి అయినా మీనా లెక్క చేయకుండా పది కేలండర్లని కొంది తనడబ్బుని కూడా భర్తకిచ్చి. ఆనందంగా కాఫీక్లబ్బుకి వెళ్లారు. ఫేమిలీరూములో కేలండర్ల కథ చెప్పుకుంటూ టిఫిన్ తీసుకుంటూ ఆనందిస్తున్నారు. ఆ ఆనందంలో కాంతి వచ్చి ఏమనుకుంటుంది—యీ కేలండర్లని చూసి అనుకుంటున్నారు. చేయాలనుకున్నది సాధించానుకుంది మీనా, భార్య చేసిన ప్రతిజ్ఞ ఫలించినందుకు గర్వించాడు శర్మ, హాయిగా కాఫీ ఆరగించి యివతలకు వచ్చి బిల్లు చెల్లించారు. కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ యింటివైపు వస్తున్నారు. కొత్త చీరతో-టాల్కం పవుడరుతో స్నోసీసాతో కొత్త కేలండర్లతో కుమ్ముత్తిపోతుంది ఆదివారం. నిజంగా పండగ, పుటినరోజు పండగ అన్నందుకు దర్జానిల పెట్టారు అంది మీనా భర్తని అభినందిస్తూ!

అయితే మీనా కేలండర్లు కట్టరేంటి? అన్నాడు శర్మ.

మీరు తెస్తున్నారు అనుకున్నాను. అంగట్లోనే చీర—టాల్కం పవుడరు టిన్ను స్నోబాటిలు పార్సెలు చేయించాంగా! అంది డీలాగా మీనా.

అయితే ఆ పార్సెలు కాఫీహోటలులో మరిచిపోయామా! అంటూ యిద్దరూ కూడా విడిగా కాఫీహోటలుకు వెళ్ళి వెతికారు. ఎక్కడుంది? లేదు! చిన్నబోయింది మీనా. ఏం చేయాలో తెలియటంలేదు శర్మకి.

మాయరోజులు సార్ అన్నాడు హోటలు ప్రొప్రయిటరు.

భార్యాభర్తలు గుండె బరువుతో ఇంట్లోకి చేరారు. ★

అందని పళ్ళు

వేటినీ వదిలారు. జైలునుండి బయట బడ్డాను, ముఖం జేబు రుమాలుతో కప్పుకుంటూ నడుస్తున్నాను.

"నమస్కారం సుందరంగారూ!"అన్నారెవరో.

తలెత్తి చూశాను—సత్యం నిలబడి వున్నాడు—ప్రత్యభివందనం చేశాను.

"ఎక్కడున్నారు?" ప్రశ్నించాడు సత్యం.

"ప్రస్తుతం యిక్కడే!"

"హాస్యాలకేం గానీండి ఉద్యోగం?"

"మదనపల్లివద్ద ఓ గ్రామంలో సింగిల్ టీచరుగా వున్నా"నన్నాను.

"నేను రెవిన్యూ యిన్స్పెక్టరుగా వున్నాను" అదోరకమయిన మందహాసంతో నేనడక్కపోయినా చెప్పాడు సత్యం.

ఆ నవ్వు చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కింది.

కాని సరిగ్గా అలాంటినవ్వే అతడు ట్రెయినింగు అన్ని గ్రూపులూ ఫేలయినప్పుడు నేను నవ్వాను.

ట్రెయినింగు ప్యాసయిన నేను యేకోపాధ్యాయుడుగా అరణ్యవాసం చేస్తుంటే, ఫేలయిన సత్యం రెవిన్యూ యిన్స్పెక్టరుగా వున్నాడంటే నాలో కొద్దిగా యీర్ష్య రాజుకుంది.

"ట్రెయినింగు పూర్తి కాయ్యలేదూ?" అన్నాను అతను ట్రెయినింగు ఫేలయిన సంగతి జ్ఞాపకం చేసి నా గొప్ప చాటుకోవాలని.

"లేదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"ఏం?"

"ఎవరిక్కావాలండీ ఆ గాడిదలు మేపే వుద్యోగం," అంటూ ముందుకు సాగాడు సత్యం.

'గాడిదలు మేపే వుద్యోగం'—నన్నెవరో చెంపకాయ వేసినట్లయింది. ఆ మాట అని వెళ్ళిపోయాడేగాని లేకుంటే సత్యం క్షమాపణ చెప్పేదాకా వదిలేవాణ్ణి గాదు.

ఎవరి వుద్యోగం వారికి గొప్పగా కనబట్టం సహజం గావచ్చుగానీ, సత్యానికి సత్యం వుద్యోగం గొప్పగా కనబడ్డంతో బాటు నా వుద్యోగం "గాడిదలు మేపే వుద్యోగం"గా కనిపించడం మాత్రం నాకు చాల చిరాకేసింది.

సత్యాన్ని గూర్చి యోచిస్తూ యింటిదారి బట్టాను...ట్రెయినింగు కాలంలో సత్యం నూటికి నూరుపాళ్ళూ వుపాధ్యాయుడనిపించుకున్నాడు. అతడు మాట్లాడని సభ, సమావేశం వుండేదిగాదు. ప్రతి యెన్నికలలోనూ పోటీచేసి వోడిపోయేవాడు. అయినా 'అవమాన పడడం' అన్న విషయం అతడికి తెలీదు. చాలమంది విద్యార్థుల కితడంటే అయిష్టం, కొంతమందికి మాత్రం సరదా. ఈ "సరదాగాళ్ళ"లోనే నొకణ్ణి. ప్రతి సభకు, సమావేశానికి, యెన్నికలకు సత్యాన్ని నిలబెట్టి కనీసం మేమయినా ఓటు చేసే వాళ్ళంగాదు, అంతమాత్రాన అతను మా స్నేహం మానేవాడూ గాదు...

సభకు అధ్యక్షత వహించిన "పెద్ద మనిషి" తనకు అవకాశం యివ్వకపోయినా సరే తనులేచి తన వుపన్యాసం సాగించి యధాశక్తి మమ్మల్ని విసిగించి, కొండొకచో మాకుకోపం కూడా తెప్పించాడు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య

అప్రస్తుతమయినాసరే ఉపాధ్యాయ వృత్తికున్న గౌరవ ప్రాభవాలను గూర్చి చెప్పక మానేవాడుగాదు. ఎవరైనా తను స్వీకరించబోతున్న వృత్తిని విమర్శిస్తే వారిమీద యుద్ధం ప్రకటించేవాడు. "ఉపాధ్యాయుడు దేశనిర్మాత, అంతర్జాతీయ శాంతిదూత" అనేవాడు మాటిమాటికీ.

బహుకార్యభారంవల్ల ఫేలయాడే గానీ సత్యం తెలివయినవాడే. బహుశా ఆవిషయం అతడికి తెలుసేమో, అందుకే చదవడు.

అలాంటి సత్యం యీనాడు వుపాధ్యాయ వృత్తిని "గాడిదలు మేపే వుద్యోగం"గా చిత్రిస్తున్నాడంటే నాకు ఆశ్చర్యంగా వుంది.

తరువాత రెండు మాసాలు సత్యాన్ని మరచిపోయాను...

ఏదో పనిమీద చిత్తూరు వెళ్ళాల్సివచ్చింది. చిత్తూరు వెళ్ళినప్పుడల్లా సినిమా చూట్టం నా కలవాటు. ఆరోజు యేదో సినిమాకెళ్లాలని థియేటరుముందు నిల్చున్నాను. చంకలో మోపెడు పుస్తకాలతో వెళ్తున్నాడు సత్యం. నన్ను చూసిగూడా ముఖం చాటుచేసుకోవడంకోసం ప్రయత్నించాడు...కానీ నేనే పలకరించాను. అతడితో మాట్లాడ్డమంటే నాకు అదో కాలక్షేపం.

"ఏమోయ్ సత్యం! మేమంత చూడగూడని మనుషులమా?"

సత్యం సిగ్గుపడుతూ నాదగ్గరకు వచ్చాడు. ఒక పదినిమిషాలసేపు పట్నంలోని సినిమాలలో మంచిదేదన్న విషయం చర్చించాము.

"సినిమాకెళ్దాం రావోయ్," అన్నాను చివరికి.

"పరీక్షలు పది దినాలే వుంట,"అన్నాడు సత్యం.

"ఏం పరీక్షకి?"

"ట్రెయినింగు పరీక్ష," అన్నాడు తల వంచుకొని.

నేను ఆశ్చర్యంతో తలమునకలయిపోయాను. అతడిమీద ఎలాగయినా ఒక విసురు విసరాలనిపించింది. "నీ కెందుకోయ్ యీ 'గాడిదలు మేపే వుద్యోగం'? అన్నాను.

సత్యం తల యెత్తాడు. అతని కళ్ళలో వుత్సాహం వచ్చిచేరింది.

"మేపాలని రూలు లేదుగా! అయినా దీనికేమిటోయ్ బంగారంలాంటి వుద్యోగం_ దినానికి ఐదు గంటలపని. సంవత్సరానికి

(64-వ పేజీ చూడండి)

అసమర్థుని అంతిమ యాత్ర

"టుబీ ఆర్ నాట్ టుబీ దటీజ్ ది క్వశ్చన్!" హేమ్లెట్ అవస్థలో పడిపోయాడు రామచంద్ర.

అవును... తను ఎందుకు బతకాలి? తను చావకుండా, బతక్కుండా అడకత్తెరలో ఇరికించి హింసిస్తున్నారు తనభార్యా పిల్లలూ. నిజానికి తనవలా అవస్థపెట్టటంలో వాళ్లిదరికీ ఏదో ఆనందం ఉండి ఉండాలి. అందుకే తను ఎవ్వరికీ చెప్పకుండా రెండు మూడుసార్లు ఇంట్లోంచి పారిపోయినా కూడా—వాళ్ళు పోలీస్ రిపోర్టు లిచ్చి, నానా ప్రయత్నాలూ చేసి, ఆఖరికి ఏ మారుమూల గ్రామంలోనో—మారువేషంలో – ఎక్కడో తలదాచుకొని ఉన్న తనను ఆచోకీ తీసి, మళ్లీ తీసుకొచ్చి ఉంచుకున్నారు వాళ్ళ కొంపలో.

మరి పిల్లలో...? వాళ్ళకోసమైనా తను బతకాలిగా? అవును పాదసరానమూ 'నాన్నా, నాన్నా!' అంటూ వాళ్ళిద్దరూ తన మెడచుట్టూ చేతులు పెనవేసుకొని ఉంటున్నారుగా. ఈ ప్రపంచంలో తన నెవరైనా నిజంగా ప్రేమిస్తున్నారా అంటే, అది వాళ్ళిద్దరే అని చెప్పక తప్పదు. ఒకవేళ వాళ్ళది కూడా హృదయపూర్వకమైన ప్రేమ కాకపోవొచ్చేమో! ఇరవైనాలుగ్గంటలూ తను వాళ్ళను ఆడించుతూ, తన ఒడిలో నిద్రబుచ్చుతూండడంవల ఇప్పుడు ఇంత సన్నిహితంగా ఉంటున్నారేమో కాని, రేపు పెద్దయ్యాక వాళ్ళదృష్టిలో కూడా తను చులకన అయిపోవొచ్చు...ఏమో – ఎవరు చెప్పగలరు?

అయినా, తనకీ గ్రహచారం ఏమిటి?

"నా మానాన నన్నెక్కడో పడుండనీయకుండా నా కీ శిక్ష ఏమిటి? నా మీద మీ కెవ్వరికీ అనుగింజంతైనా ప్రేమలేనప్పుడు మళ్ళీ నన్నులాక్కొచ్చి ఈ ఇంట్లో పెట్టుకోవడంలో అర్థమేమిటీ అంటా?" ఒకరోజు ఎలాగో గుండె దిటవు చేసుకొని, తనభార్యను అడిగేశాడు.

"మీ మీద కూడా ప్రేమ లేదన్నారు. మీ మాటను పొత్తిగా తీసేయడానికి వీల్లేదనుకోండి... కాని, పిల్లలు మీరంటే పడి చస్తారు. అందుకు కొంతంతైనా మీకే. నేను సినిమాలలో వేషాలు వేయడం మొదలుపెట్టినప్పట్నుంచీ వాళ్ళ[illegible] కొత్త మారమయ్యారా? ఇంట్లోనుండి, వాళ్ళ ఆటాపాటా అంతా చూసుకుంటున్నది మీరేగా? అంచేత వాళ్ళ హృదయాల్లో మీరు గట్టిగా నాటుకుపోయారు. మొన్న మీరు మంగళగిరికి పారిపోయినప్పుడు లేవి, బాబుగాడూ మమ్మల్ని ఎన్ని చెరువులనీళ్లు తాగించారని! అన్నం తినడం మానేశారు. కళ్లుమూసినా, తెరిచినా మీ రేకనిపించేవారు వాళ్లకళ్లకు. 'నాన్న ఏరీ? నాన్నయేరీ?' అని ఒకటే కలవరింపులు. ఇక వాళ్లను సముదాయించే సరికి పైనించి కిందికి దిగివచ్చినంత పనయ్యేదంటే నమ్మండి. రాత్రిళ్ళు ఇద్దరూ నిద్రలో లేచి కూర్చొని, మీదగ్గరికి తీసుకెళ్లమని ఒకటేగోల. చివరికి వాళ్ళిద్దరికీ జ్వరంకూడా వచ్చింది. అది మనోవ్యాధే... మళ్ళీ మిమ్మల్ని చూసేవరకు వాళ్ళ దేహపరిస్థితి దాదాపు అలాగే ఉంటుందని డాక్టర్ గారు అవసే అన్నారుకూడా," అంది తనభార్య చంద్రమతి.

"అందుకని—వాళ్ళగోడు వదిలించుకోటానికి—నన్నో ఆటవస్తువు క్రింద ఉపయోగించుకుంటున్నారన్నమాట! హుఁ...బిడ్డలూ, మొగుడులూనూ," అని

జి. ఏ. జి. కృష్ణ

పటపటా పళ్ళుకొరికాడు రామచంద్ర.

"మీ కిక్కడ ఏంలోటు చెప్పండి. మిమ్మల్నేమయినా సంపాయించి తీసుకువచ్చి పడేయమన్నానా? తిండీ, బట్టా మీకు రాకు తక్కువ కాకుండా ఇస్తున్నానా? మీ సొంత ఖర్చులకు నెలకు అరవై రూపాయలవరకు లభిస్తోంది. పిల్లల్ని స్కూలు తీసుకెళ్ళడానికి మీకోసం చిన్న కారుకూడా కొన్నాను. మీకింకేం కావాలి చెప్పండి!"

"ఛీ! నేనూ ఒకమనిషే—నాదీ ఒక బతుకే...నా కన్నా వీధిలో కుంటె ఊరకుక్క నయం. పేరుకుమాత్రం మేమో నీ భర్తను; నువ్వు పనిచేస్తూన్న సినిమా కంపెనీవాళ్ల దృష్టిలో నేనొక చవట దద్దమ్మ, నాజమ్మను...అందుకు కారణం నువ్వేగా? వాళ్ల ఎదుట భర్తపట్ల ఎంత గౌరవాభిమానాలు చూపించాలో—ఎన్నడైనా చూపించిన పాపాన పోయావా? పైగా నా ఎదుటే ఆ ప్రొడ్యూసర్లతో పకపకలూ, వికవికలూనూ. నీకే సలహా కావలసినా, ఆ సెక్రటరీతోనే సంప్రదిస్తావు. వాడితోనే సినిమా కంపెనీలకు కారులో వెళ్ళుతూంటావు..."

"అవును...సలహా లివ్వడంలో అతడు అఖండుడు. నేడు నే నీ స్థితికి రావడానికి అతనుకూడా కొంత కారకుడంటే మీరు ఒప్పుకోరేమిటి?" అంటూ చంద్రమతి సెక్రటరీ గదికేసి వెళ్లింది.

ఆమె వెళ్లినవైపే చురచురా చూస్తూ నిల్చుండిపోయాడు రామచంద్రం.

ఇంతలో ఆరేళ్ళ బాబిగాడు దక్కగా ముస్తాబై వచ్చి "నాన్నా, ఇక్కడ వొంగు... గుర్రమెక్కుతా!" అన్నాడు.

"ఎక్కుతావుగా—ఎక్కకేం? ఇప్పట్నుంచే నువ్వుకూడా నామీద స్వారీ చేయడం నేర్చుకో!" అనేసి చివాలున పక్కగదిలోకి వెళ్ళిపోయాడు రామచంద్ర.

"భార్యకు,

ఇదే ఆఖరుసారి...నన్ను గురించి ఈ దఫా నువ్వూ, మీ నాన్న ఎంత ప్రయత్నించినా నిష్ప్రయోజనమే. నన్ను మళ్లీ చూడలేరు సరికదా—అనవా చూడడం అంటూ జరిగితే, నా శవాన్నే చూస్తారు. సెలవు...

ఇట్లు,
రామచంద్ర."

పై ఉత్తరాన్ని తండ్రి రాఘవయ్యకు అందించి. సోఫాలో కూలబడిపోయింది చంద్రమతి. రాఘవయ్య ఉత్తరాన్ని సాంతం చదివాక, "ఎక్కడికి పోతాడులే అమ్మాయ్! ఇది మనకు కొత్తా? రేపు సాయంత్రంలోగా అతన్ని తీసుకొచ్చి మనింటి ముంగిట నిలపనూ" అనేసి బయటకు వెళ్ళిపోయాడు.

* * *

"ఈ కింది ఫోటోలోఉన్న వ్యక్తి ఆచోకీ తెల్పినవారికి వెయ్యిన్నూటపదహార్లు బహుమానం.

81 సం॥ వయస్సు. చామనచాయ. 5 అడుగుల 8 అంగుళాల పొడవు. మంచి దృఢమైన శరీరం. మతి స్థిమితం లేక ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఈ వ్యక్తి ఉనికి తెలిసినవారు వెంటనే ఈ క్రింది విలాసానికి టెలిగ్రామ్ ఇవ్వ ప్రార్థితులు..."

—అని తన ఫోటో కింద తన మామ రాఘవయ్య పేరూ, ఇంటి అడ్రసూ వున్న ఆ పత్రికలోని ప్రకటనను మరో మారు చదివి, నిట్టూరుస్తూ ఆ పాడుపడ్డ సత్రం అరుగుమీద కూర్చున్నాడు రామచంద్ర.

ఇప్పుడతను మునుపటిరూపంలో లేడు. పకీరీ మీసాలూ, గడ్డాలూ అంటించు


కున్నాడు. నల్ల కళ్ళజోడొకటి పెట్టుకున్నాడు. గీరలషర్టూ, గూడకట్టుపంచ ధరించాడు. 'ఇలా మారురూపంలోవున్న నన్ను ఎవరు గుర్తుపట్టగలరు?' అనుకున్నాడు రామచంద్ర.

ఇంతలో చిటపట చినుకులతో వర్షం ప్రారంభమైంది. దూరంగా చీకట్లో ఎవరో ఒకతను ఏవో కూనిరాగాలు తీస్తూ, వర్షంలో తడిసి, మెల్లగా వస్తున్నాడు ఇటు వైపు. అతను తూలుతూ రావడం, అస్పష్టంగా కనిపిస్తూన్న అతని చేతిలోని సీసా చూసి, అతనెవరో తాగుబోతై ఉండాలనుకున్నాడు రామచంద్ర. అది నిర్జనప్రదేశం. సమీపంగా చుట్టూ ఇళ్ళుకూడా లేవెక్కడా. ఆ తాగుబోతు మైకంలో వొళ్ళు తెలీక తననేమైనా చెయ్యొచ్చు. అక్కడ్నించి పారిపోదామనుకుంటే, వర్షం నిమిష నిమిషానికీ ఎక్కువౌతోంది. ఏంచేయటానికీ తోచక దిగాలుగా ఆ తాగుబోతువైపే చూస్తూండిపోయాడు రామచంద్ర.

ఇంతలో ఆ తాగుబోతు మరింత సమీపంగావచ్చి. ఓ దీపస్తంభం పక్కన తల గోక్కుంటూ నిలుచున్నాడు.

రామచంద్ర తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. తను కలకంటున్నాడా, లేక ఎదురుగా అక్కడేదైనా పెద్ద నిలువుటద్దం ఉందా అనిపించింది. కళ్ళు నలుపుకొని, మళ్ళీ చూశాడు. సందేహం లేదు...ఆ మొహాన్ని దాదాపు ముప్ఫై ఏళ్ళగా అద్దంలో చూస్తున్నాడు తను. ఇందాక ఓ అరగంట క్రితం కూడా—మీసాలూ, గడ్డం అంటించుకుంటున్నప్పుడు—ఓ పావుగంటసేపు అదే పనిగా చూశాడు అద్దంలో. ఆ తాగుబోతు అచ్చం తనలాగే ఉన్నాడు. అందులో—తను ఇప్పుడున్న రూపంలోనే మీసాలు, గడ్డాలతో ఉన్నాడు. తన వాటి మల్లేనే అవికూడా నకిలీవా లేక నిజమైనవా? తన కళ్ళే...తన చెవులే...అదే ముక్కు! అదే పొడుగే! ఒక్క ముక్కలో చెప్పాలంటే తనూ, ఆ తాగుబోతూ బింబ ప్రతిబింబాలవలె ఉన్నారు. ఏమిటిది? మనిషిని పోలిన మనుషులు నూటికో—కోటికో ఎక్కడో ఉంటారని వినడమేకాని, మరీ ఇంత విచిత్రంగానా, అనుకున్నాడు రామచంద్ర. ఉన్న తేడా అల్లా ఉడుపుల్లోనే. తను గీరలషర్టు, గూడకట్టుపంచ ధరించి ఉన్నాడు. ఆ తాగుబోతు వొంటి మీద బాగా మలినమైన బుష్కోటు, పాంటూ ఉన్నాయి. అవి వానలో తడిసి ఉన్నాయి...రామచంద్ర రెప్ప లార్పకుండా ఆ తాగుబోతువైపే చూస్తూండిపోయాడు.

ఇంతలో ఆ తాగుబోతు తల పైకెత్తాడు. దీపస్తంభం కొసన వెలుగుతూన్న బల్బును చూశాడు. ఒకసారి పిచ్చిగా నవ్వాడు. హఠాత్తుగా తన చేతినున్న సీసాలోని ద్రావకమంతా ఒకే గుక్కన గొంతులో పోసు



★ అసమర్ధుని అంతిమ యాత్ర ★

కాని, ఆ పీసాను విసిరి దూరంగాపారేశాడు. తర్వాత ఆ దీప స్తంభంమీదికి ఎక్కసాగాడు.

'ఏయ్, ఎక్కకు; పడిపోతావు!' అని రామచంద్ర హెచ్చరించాలనుకున్నాడే కాని, అతనికా ధైర్యం లేకపోయింది. గుడ్లప్పగించి అలాగే చూస్తూండిపోయాడు. ఆ తాగుబోతు స్తంభంమీదికి కొంతవరకు ఎక్కాక, ఒకసారి ఆగాడు. బల్బును అందుకోబోయాడు. అది అతనిచేతికి ఇంకా దూరంగా ఉంది. అంచేత మళ్ళీ కొంచెం పైకి ఎక్కి, మళ్ళీ అందుకోబోయాడు. కాని, ఆ స్తంభంలో విద్యుచ్ఛక్తి లీకేజ్ ఉండడంవల్లో లేక ఆ కైపులో పట్టు తప్పాడో ఏమో కాని, అమాంతంగా ఒక్క గావుకేకపెట్టి, అక్కడినుంచి దభాలున నేల మీదికి వెల్లకిలా పడిపోయాడు. అంతే... చాచిన చేతులు చాచినట్లే, చాపిన కాళ్ళు చాపినట్లే నేలకు అంటుకుపోయాడు.

అతని తలవద్ద అయిన గాయం నుంచి స్రవించే రక్తం నేలమీద వర్షపు నీటిలో కలిసిపోవడం ఆ దీపం వెలుగులో స్పష్టంగా కనిపిస్తోంది రామచంద్రను.

రామచంద్రకు ఏం చేయడానికీ తోచడం లేదు. శరీరం ఎందుకో కంపించనారంభించింది కూడా. వెళ్ళి, ఆ తాగుబోతును

మోసుకొచ్చి ఆ పత్రం అరుగుమీద పడుకో బెట్టుదామా అనుకున్నాడు ముందు. కాని అతన్నలా మోసుకొస్తున్న సమయంలో — తన ఖర్మంచాలక — ఆ మార్గాన ఎవరైనా వస్తూ చూస్తే, తనకెక్కడ అనుమానిస్తారో నన్న భయంకూడా వేసింది. ఇలా ఓ ఐదు నిమిషాలపాటు పరిపరివిధాల ఆలోచనలతో అతని బుర్ర వేడెక్కిపోయింది.

ఇంతలో వర్షం క్రమక్రమంగా తగ్గుముఖం పట్టింది. రామచంద్ర ఆయాసంతో కాళ్ళీడ్చుకుంటూ, ప్రయాసతో ఆ తాగుబోతు దగ్గరికి వెళ్లి నిలుచున్నాడు. వీధి దీపం వెలుగులో అతని మొహాన్ని అలా దగ్గర్నించి మరింత స్పష్టంగా చూడగలిగాడు. ఎందుకో మళ్ళీ అనుమానం వేసి, అతని మొహానికున్న గడ్డాన్ని లాగి చూశాడు. అది మీసంతో సహా ఊడివచ్చేసింది. మరింత విస్తుపోయాడు రామచంద్ర. ఇతనుకూడా తనలాగే మారు వేషంలో ఉన్నాడా? ఎందుకు? అసలింతకీ ఎవరితను? ఎవరైతే తనకేం?...

ఉన్నట్టుండి ఆకాశంలో ఒక్క మెరుపు మెరిసింది. రామచంద్ర మస్తిష్కంలో మెరుపులా ఒక ఆలోచన మెరిసింది.

ఆ తాగుబోతు కుడిచేతి నాడిని పరీక్షించాడు. అది ఎప్పుడో ఆగిపోయి ఉంది. నిట్టూర్పు విడిచి. మెల్లగా ఆ శవం వొంటి మీదున్న బుష్‌కోట్‌ను విప్పాడు. దైవవశాత్తూ అవి వర్షంలో బాగా తడిసిపోయి ఉన్నాయే కాని, వాటికి ఎక్కడా రక్తపు మరకలు అంటలేదు. తర్వాత దుస్తులు విప్పి ఆ శవానికి తొడిగి, ఆ శవం దుస్తులు తను ధరించాడు.

అంత చలిలోను రామచంద్ర వొళ్ళంతా బాగా చెమటపట్టేసింది. అయినా సమయోచితంగా — తన బుర్ర ఎన్నడూ లేనంత అమోఘంగా చేసు పనిచేసినందుకు తనను తాను అభినందించుకోకుండా ఉండలేకపోయాడు.

రేపు ఈ శవం పోలీసుల కళ్ళబడుతుంది. దీనిని వాళ్ళు తన భార్యకు అప్పగిస్తారు. అప్పుడు తానే మరణించాడని తెలుసుకొని తన గురించి పోలీసులు కాని, తన భార్య కాని ఇక ప్రయత్నాలు చేయడం మానేస్తారు. అనితృప్తిగా శవానికి తొడిగిన తనచొక్కా జేబులోంచి మనీపర్సును బయటకు తీశాడు. అందులో పదిరూపాయల నోట్లు ఏడెనిమిది ఉన్నాయి. ఆ నోట్లను తను తొడుక్కున్న బుష్‌కోట్ జేబులో ఉంచుకొని, కాళీ పర్సును యథాప్రకారం శవానికున్న చొక్కా జేబులో ఉంచేశాడు. ఒకసారి తన ప్రతిరూపం — ఆ శవంకేసి చూశాడు. 'భలే! ఇతను సినిమానటి చంద్రకాంతి భర్త రామచంద్రమూర్తి అయిపోయాడు!' అనుకున్నాడు.

ఇంతలో దూరంగా ఎక్కడో కారు హారన్ వినిపించింది. ఆ కారు ఇటే వస్తుందేమో! ఇక తను వెంటనే కాళ్ళకు బుద్ధి చెప్పకపోతే కొంప మునుగుతుంది, అనుకుంటూ అక్కడినుంచి వడివడిగా నడక సాగించాడు.

రైల్వేస్టేషన్ అక్కడికి కొద్దిదూరంలోనే ఉంది. పదకొండు గంటలకు ఒక పేసింజర్ బయలుదేరుతుంది. దానిలో తనుకూర్చుంటె రేపు ఉదయం ఏ ఊళ్ళోనైనా దిగిపోవచ్చు. ఇన్నాళ్ళుగా తను ఏ కష్టాలొంచి విముక్తి పొందాలని తాపత్రయపడ్డాడో, ఏ స్వేచ్ఛ కోసం తహతహలాడిపోయాడో — అవి లభించినందుకు సంతోషంతో అతని హృదయం ఉరకలు వేయసాగింది.

తన భార్య శవాన్ని గుర్తుపట్టడానికి అక్కడికి పిలిపించబడుతుంది. తన దుస్తులను ఆ మనీపర్సును ఆనవాలు పడుతుంది. ఆ శవాన్ని చూశాక — నటి గనుక కాస్తయినా కళ్ళలో నీళ్లు తెప్పించుకొని నటించకుండా ఉండలేదు.... ఇక మర్నాటి సాయంత్రం వెలువడే పేపర్లలో అంతా తన చావుగురించే ఉంటుంది. 'ప్రమాదవశాత్తు సంభవించిన మరణం' అనో, లేక 'శవం జేబులో దొరికిన మనీపర్సు ఖాళీగా ఉండడం మూలంగా హత్య అని అనుమానింప బడుతోంది.' అనో మొత్తంమీద ఏదో ఒకవార్త ఉంటుంది... ఇలా ఆలోచిస్తూ, నడక వేగం హెచ్చించాడు.

పాంట్ ఎడమవైపు జేబులో ఉబ్బెత్తుగా ఏవో ఉన్నట్లు అనిపించి, ఆ జేబులోకి చేతిని పోనిచ్చాడు రామచంద్ర. ఏవో కాగితాల కట్టలలాంటివి చేతికి తగిలాయి. చివాలున ఆ కట్టలను బయటకు తీశాడు. క్షణకాలం అతనికళ్ళు చెదిరిపోయాయి. అవి వందరూపాయల నోట్లు! రెండుకట్టలు ఉన్నాయి! కనీసం నాలుగువేల రూపాయలైనా అయివుంటాయి. తను కలకంటున్నాడా? కళ్ళు నులుపుకున్నాడు... కాదు గిల్లుకున్నాడు. సందేహనివృత్తి చేసుకున్నాడు... అటుపైన సంతోషంతో ఈల వేస్తూ, పెద్ద పెద్ద అంగలతో రైల్వేస్టేషన్ సమీపించబోయాడు.

చివాలున ఓ తలంపు కలిగి, రామచంద్ర ఆగాడు. ఆ శవంపేరు 'రామచంద్ర'గా మారినప్పుడు. మరి తన పేరుకూడా మారాలిగా. ఇటుపైన తను ఏ పేరుతో చెలామణి అవాలి? ఆ తాగుబోతు పేరు ఏమైఉంటుంది. ఆ తాగుబోతు ఎవరో తెలిసే ఆధారమేదైనా ఉంటుందేమోనని మళ్ళీ బుష్‌కోట్ జేబులు, పాంటు జేబులు హడావిడిగా వెతికాడు. పాంటు కుడిజేబులో ఓ మనీపర్సు చేతికి తగిలింది. దాన్ని బయటకు తీశాడు ఆదుర్దాగా. లోపల ఒక ఆంగ్లపత్రికలోంచి చింపబడిన ఓ చిన్న ముక్క కనిపించింది. దాని మడత విప్పాడు. అది బొంబాయినుంచి వెలువడే పత్రికలోనిది. దానిపైగాభాన క్రితంరోజు తారీఖు ఉంది.

రామచంద్రకళ్లెదుట ఒక అగ్నిపర్వతం బ్రద్దలయినట్టయింది. ఆ పేపర్ కటింగ్ మధ్యలో అచ్చం తనలాగే ఉన్న ఫోటో ఉంది. అది ఆ తాగుబోతుదే అయివుండాలని ఊహించటానికి అతనికి ఆట్టేసేపు పట్టలేదు.

ఫోటోకింద పెద్ద హెడ్డింగుతో ప్రచురింపబడిన వార్తను గబగబా చదవసాగాడు రామచంద్ర. అది ఆంగ్లంలో ఇలా ఉంది.


పరారీలో ఉన్న గజేందర్

"వరంగల్ జెయిల్‌నుంచి మాసం క్రితం పారిపోయి వచ్చి, ఇంత కాలంగా పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న గజేందర్ నాలుగురోజుల క్రితం బొంబాయి నగరం శివారులలో ఉన్న ఒక బాంకిలో పనిచేస్తున్న గుమాస్తాను పిస్టల్‌తో కాల్చి, ఎనిమిదివేల రూపాయల రొఖ్ఖంతో పారిపోయిన వైనం పాఠకులకు విదితమే. పోలీసువారు అతని ఆచోకీ తీయడానికి మద్రాసునుంచి పోలీసులను, పోలీసు కుక్కలను పిలిపించారు కూడా."

అంతే...ఆ తర్వాత ఏముందో చదవలేకపోయాడు రామచంద్ర. అతనికి తెలీకుండానే అతని చేతిలోంచి ఆ పేపర్ ముక్క గాలికి ఎగిరిపోయింది.

ఉన్నట్టుండి దూరంగా ఎక్కడో ఒక కుక్క మొరుగు వినిపించింది.

రామచంద్ర చెవుల్లో పిడుగులు పడ్డాయి. కళ్లు చీకట్లు కమ్మాయి. పాదాలకింద భూమి కంపించి పోయినట్లయింది. మరుక్షణంలోనే అమాంతంగా స్పృహ తప్పి, నిలుచున్న పళంగా నేలకు ఒరిగాడు. ★



ఆదిపర్వము - షష్ఠాశ్వాసము

వ. దీనిమానవులయందుఁ బ్రయోగింపకుండునది యల్పతేజులయందుఁ బ్రయుక్తంబయి యిది జగంబులఁ గాల్చునిన్ను బాధించునట్టి మానవులు గలిగిరేని ప్రయోగించునది వారి నశ్రమంబున సాధించునని దానిమహిమ సెప్పి నీవు బంధుసపక్షంబున నాకు గురుదక్షిణ యిమ్మది యెయ్యదియనిన నాయుద్ధంబు సేయునపుడు నాతో నెన్నఁడుఁ బ్రతియుద్ధంబు సేయకుండు మిదియ నాకు గురుదక్షిణ యనిన నర్జునుండు వల్లెయని యాచార్యునకు నమస్కరించి దాని కొడం బడియె నంత దుర్యోధనుండు యుధిష్ఠిరుయౌవరాజ్యాభిషేకంబునకు భీమార్జునయముల పరాక్రమంబునకు సహింపక కర్ణశకుని దుశ్శాసనులలో మంతనంబుండి యిట్లనియె.

సీ. ఆయుధవిద్యలయందు జితశ్రము, లనియును రణశూరు లనియు నంత
తోత్సాహులనియు సత్యవ్రతులనియును, భయమందుచుండుదుఁ బాండవులకు
దానిపై నిప్పుడు ధర్మజు యువరాజుఁ, జేసె రాజే నేమి సేయువాఁడ
నృపనీతి యెయ్యది నిరతంబుగా మీర, నాకెఱింగింపుఁడు నయముతోడ

ఆ. ననిన వినియుఁ గణికుఁ డనువాఁడు సౌబలు, నాప్తమంత్రినీతు లందుఁ గరము
కుశలుఁ డైనవాఁడు కురుకులవల్లభు,నిష్టమునకుఁ దగఁగ నిట్టు లనియె.

తరువోజ. ధరణీశుఁ డుద్యత దండుఁ డై యుచిత దండవిధానంబుఁ దప్పక ధర్మ
చరితులఁగా మహీ జనుల రక్షించి సద్వృత్తుఁ డగునది సర్వవర్ణములు
వరుసన తమతమ వర్ణధర్మముల వర్తిల్లుదురు గడవక దండభీతి
నరిమిత్రవర్జితుఁ డై సమబుద్ధి యగుమహీవల్లభు ననుశాసనమున.

క. గుఱుకొని కార్యాకార్యము, లెఱుఁగక దుశ్చరితుఁ డై యహితుఁ డగు వేనిన్
మఱవక గురు నైనను జను, లెఱుఁగఁగ శాసించునది మహీశుఁడు బుద్ధిన్.

క. ధీరమతియుతులతోడ వి,చారము సేయునది మును విచారితపూర్వ
ప్రారబ్ధమైన కార్యము, పారముఁ బొందును విఘాతపదదూరం బై.

క. జనపాలుఁడు మృదుకర్మం,బున నైనను క్రూరకర్మమున నైనను నే
ర్పున నుద్ధరించునది ద,న్ననపాయతఁ బొంది చేయు నది ధర్మంబుల్.

క. బలహీను లైనచో శ,త్రులఁ జెఱుచుట నీతి యధికదోర్వీర్యసుహృ
ద్బలు లైనవారిఁ జెఱుపఁగ, నలవియె యక్లేశసాధ్యు లగుదురె మీఁదన్.

క. అలయక పరాత్మకృత్యం,బుల మది నెఱుఁగునది దూత ముఖమునఁ బరభూ
ములవృత్తాంతము లెఱుఁగఁగఁ, బలుమఱుఁ బుచ్చునది వివిధ పాషండతతిన్.

క. నానావిహారశైలో,ద్యానసభాతీర్థదేవతాగృహమృగయా
స్థానములఁ దిరుగునెడ మును, మానుగ శోధింపవలయు మానవపతికిన్.

తే. ఏరు నమ్మంగఁ దగుదురు వీరు నమ్మఁ, దగరు నా కనవలవదు తత్త్వబుద్ధి
నెవ్వరిని విశ్వసింపక యెల్లప్రొద్దు, నాత్మరక్షాపరుం డగు నదివిభుండు.

ఉ. ఇమ్ముగ నాత్మరక్ష పథియించువిధంబున మంత్రరక్ష య
త్నమ్మునఁ జేయఁగా వలయుఁ దత్పరిరక్షణశక్తి నెల్లకా

ర్యమ్ములు సిద్ధిఁ బొందుఁ బరమార్థము మంత్రవిభేద మైనఁ గా
ర్యమ్ములు నిర్వహింపఁగ బృహస్పతి కైనను నేరఁ బోలునే.

క. పలుమఱు శపథంబులుఁ నం,జలియును నభివాదనమును సామప్రియభా
షలు మిథ్యావినయంబులుఁ, గలయవి దుష్టస్వభావకాపురుషులకున్.

క. తన కిమ్మగునంతకు దు,ర్జనుఁ డిష్టుఁడపోలె నుండి సర్పముపోలెం
దన కిమ్మగుడును గఱచును, ఘనదారుణకర్మగరళఘనదంష్ట్రలచేన్

క. కడు నలుకయుఁ గూర్మియు నే,ర్పడ నెఱిఁగించునది వాని ఫలకాలము పె
న్పిడుగును గాడ్పును జనులకు, బడుటయు వీచుటయు నెఱుక పడియెడుభంగిన్.

క. తఱి యగునంతకు రిపుఁ దన యఱకడఁ బెట్టికొని యుండునది దఱి యగుడుం
జెఱుచునది ఱాతిమీఁదను, వఱలఁగ మృద్ఘటము నెత్తి వైచినభంగిన్.

క. తన కపకారము మదిఁ జే,సినజనుఁ డల్పుఁ డని నమ్మి చేకొని యుండం
జన దొకయించుకముల్లయి,నను బాదతలమున నున్న నడవఁగ నగునే.

క. బాలుఁ డని నమ్మి రిపుతో, నేలిదమునఁ గలసి యునికి యిది కార్యమె యు
త్కీలానలకణ మించుక, చాలదె కాల్పంగ నుగ్రశైలాటవులన్.

క. మొనసి యపకారిఁ గడ నిడి,కొని యుండెడుకుమతి దీర్ఘకుజశాఖాగం
బున నుండి నిద్రవోయెడు, మనుజునకు సమానుఁ డగుఁ బ్రమత్తత్వమునన్.

చ. తఱయక సామభేదముల దానములన్ దయతోడ నమ్మఁగా
నొడివియు సత్య మిచ్చియుఁ జనున్ జననాథ కృతాపకారులం
గడఁగి వధింపఁగా ననుట కావ్యమతం బిది గాన యట్టులుం
గడుకొని శత్రులం జెఱుపఁ గాంచుట కార్యము రాజనీతి మైన్.

వ. కావున సర్వప్రకారంబుల నపకారకారణు లయినవారిం బరులనయిన బాంధవుల నయిన నుపేక్షింపక యాత్మరక్షాపరుండ వయి దూరంబుసేసి దూషించునది యనినఁ గణికుమతంబు విని దుర్యోధనుం డొడంబడి చింతాపరుండై యొక్కనాఁడు ధృతరాష్ట్రున కిట్లనియె.

దుర్యోధనుఁడు దండ్రితోఁ దనమనోదుఃఖంబు దెల్పుట

తే. వీరులని పాండుసుతులకు వెఱతు నేను, వెఱచుటకుఁ దగఁగ నిపుడు విభుఁడ నీవు
పాండవజ్యేష్ఠునకుఁ బ్రీతిఁ బరమయావ, రాజ్య మిచ్చితి కురువృద్ధరాజులొద్ద.

వ. దానఁజేసి పౌరజానపదబ్రాహ్మణప్రధానవరులు ధర్మజునకనురక్తులయి నిన్నును భీష్ముని నాదరింపక ప్రజ్ఞాచక్షుండు రాజ్యంబు సేయసమర్థుండు గాఁడు భీష్ముండు సమర్థుండయ్యును ముందఱ రాజ్యనివర్తనంబునందుఁ గృతప్రతిజ్ఞుం డయ్యెంగావునఁ బాండవజ్యేష్ఠుండైన యుధిష్ఠిరునకు రాజ్యాభిషేకంబు సేయుద మతండు తరుణుం డయ్యును గుణవృద్ధుండు ధర్మశీలుండు పరాక్రమవంతులైన తమ్ములుగలవాఁడు రాజ్యప్రతిష్ఠితుం డయి వృద్ధుల నమాత్యుల బంధుమిత్రులను దొల్లింటికంటె మిక్కిలిగాఁ బూజార్హుల నెల్లం బూజించుఁ బితామహుం డైన భీష్ముని సపుత్త్రకుండైన ధృతరాష్ట్రుని నతిభక్తి నభీష్టభోగానుభవపరులంగా సుఖంబునుచు దీనికి విదురుండు నొడంబడు నని యెప్పుడుఁ దమలో విచారింతురు దీనివింటె కర్ణశూలాయమానంబు లైనమూర్ఖప్రకృతుల పలుకులు విననోపఁ బాండవుల విస్ఫురంబువలనఁ బాయునట్లుగాఁ జేయవలయు నేమి సేయుదు ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డిట్లనియె.

చ. జనపతి యైనవానికిఁ బ్రచండమహోతుములాహవాంతరం
బున మృతిఁ బొంది యొండె మఱి పుత్త్రులపైఁ దన రాజ్యభార మె
ల్లను నియమించి యేఁగి గిరు లం దప మొప్పఁగఁ జేసి యొండెఁ గా
కనిమిషలోకభోగసుఖ మందఁగఁ బోలునె శాశ్వతంబుగన్.

వ. రాజయ్యెడువాఁడు దనరాజ్యభారంబు దానచూచి యరయవలయు నేను షడంగసహితంబుగా వేదాధ్యయనంబుసేసి యర్థశాస్త్రంబులందుఁ గృతనిశ్చయుండనయి బలంబు గలిగియు నంగవైకల్యంబునం బరచక్రంబులకుం బ్రతివ్యూహంబులు రచియింపనేరమిం జేసి రాజ్యంబునకుఁ దగ కున్న.

వాగ్దానం

అప్పటికప్పుడే అనేకసార్లు అనుకున్నాడు తారకనామం; తానింకెప్పుడూ ఎవరికీ యేటి వాగ్దానాలూ జన్మలో చెయ్యనని! గట్టిగా లెంపలేసుకున్నాడు. అంతేకాదు. ఎన్నడూ ఏ మాటా అనియెరుగని రామావతారం కూడా అంతమాటా అనటంతో తనకేమిటీ తనలాంటి వాళ్ళెవరికైనా పీక పిసుక్కుని అమాంతం చావాలనిపిస్తుంది. ఐతే తనుమాత్రం అంతపనీ చెయ్యలేకపోయాడు! చావడమంటే మాటలా మరి! అందుకు బదులుగా రెండుచెవులూ గిరగిరా మెలిపెట్టుకుని మరీ ఇంకెప్పుడూ మాటివ్వనని మాత్రం ఒట్టేసుకున్నాడు. కాదూ మరి! రామావతారం మాత్రం యేం తక్కువ మాటన్నాడా?!

'ఒరేయ్ తారకం నీకిదే చెపుతున్నా. సాయంత్రం మొదటాట "చెంచులక్ష్మి"కి వెళ్ళాలి మనం. నువ్వెలాగైనా 6 గంటలకి రావాలి. లేకపోతే మహారణ్!' అన్నాడు. ఆ రోజు ఉదయం. అయితే అప్పుడు తను కూడా మనస్ఫూర్తిగానే వెళ్ళాలనుకున్నాడు ఎందుకనుకోడూ? ఖర్చుపెట్టి తీసికెళ్తానంటే తనకుమాత్రం చేదా? పోనీ చూసే అలవాటు లేదేమో అంటే తల్లమాలిన మోజు. దీనికితోడు యింతకు ముందప్పుడే రెండుమూడుసార్లు రామావతారం రమ్మనడం, తను 'సై' అనడం చివరకు తుస్సుమనడం జరుగుతోంది. అయినా రామావతారం కోపగించుకోనూ లేదు. పల్లెత్తుమాట కూడా అనలేదు. తనే లోలోపల సిగ్గుపడి ఛస్తున్నాడు; మాట నిలబెట్టుకోలేకపోతున్నానే అని. అందుకే నిశ్చయంగా "అదేమిటోయ్ శ్రీ సీతాపతీ నాలుగున్నరకే హాజరవుతాను, బెంగెట్టుకోకు' అని హామీ విసిరిపారేశాడు. కాకపోయినా మధ్యని ఆ కోటిగాడొచ్చి కొంప ముంచుతాడని ఎవరికి తెలుసు!

అసలు మధ్యాన్నంనించే తను చాలా హడావుడి పడుతున్నాడు; ఎలాగైనా మాట నిలబెట్టుకోవాలని, తప్పకుండా రామావతారం కోరిక మన్నించాలని. ముక్కోటి దేవతలకూ మొక్కుకుంటూ ఒక్కొక్క గంటె లెక్కెడుతున్నాడు. అలాంటి వేళ సాగా నాలుగ్గంటల శుభసమయంలో ఉండవం వేసినట్లు దిగబడ్డాడు కోటీశ్వర్రావు. వచ్చినవాడు వచ్చినట్టుంటే బాగుండునా? అసలు వాడి స్వభావమే వేరు!

'ఏమిటోయ్ బావా! సినిమాకెళ్తున్నావా యేంటి? అంత హుషార్‌గా వున్నావ్' అన్నాడు.

దీనికేం సమాధానం చెప్పడం? ఔనంటే చిపుకి జేడి తప్పదు. ముక్కూ మొహం ఎరుగని పరాయివాడు కాదు. స్వయాన మేనత్త కొడుకు; బావ. పోనీ అంటే తనే ఒకరిగాసుగా వెళుతున్నాడాయె వీణ్ణికూడా వెంటేసుకెళ్ళడం అసందర్భం కాదూ! అందుకే ఒక్కమాటలో 'అబ్బె.అదేం కాదనీ, కొట్టి

నిష్ఫల బ్రహ్మోజీ

పారేశాడు. అయినా కోటిగాడు మాత్రం అంత సులువుగా దుళ్ళిపోలేదు.

'అయితే మరెందుకా తొందర? కూర్చో బాబూ!' అన్నాడు.

తారకనామం బాధనంతా లోలోపలే అణచుకుని యెలాగో కూర్చున్నాడు. 'హే పరాత్పరా! దీనదయాళో! నన్ను అబద్ధాలకోరుగా వంచకుడుగానే యీ ప్రపంచంలో వాడుక పడమంటావా? ఆనాడు గజేంద్రుణ్ణి రక్షించావని పోతన్నగారన్నారు. ఈనాడుకూడా యీ మా మొసలిబావనుండి నన్ను రక్షించు బాబో!' అంటూ మార్గాంతరం అన్వేషించసాగేడు.

'ఏమిటోయ్ బావా అంతదీర్ఘంగా ఆలోచిస్తున్నావ్. చతుర్ముఖ పురాణం వేసుకుందాం మా ఇంటికి రాకూడదూ' అన్నాడు పేకాట ప్రియుడైన బావ.

తారకం సుర్రుమన్నాడు తనలోతానే.

'ఓహ్. అన్నట్టు చెప్పడం మర్చిపోయాను బావా! ఇప్పుడు నాకు వేరే పనుంది. మోక్షానందరావుగారింటికి వెళ్ళాలి. ఆయన కొత్తగా రాసిన "శకునపక్షి" కథల సంపుటి నాకిస్తానన్నారు,' అన్నాడు యిలాగైనా జారుకోవచ్చుని!

కోటీశ్వర్రావు పకపకా నవ్వాడు:

'ఏడ్చాడు. అసలాపక్షి యింటిదగిర లేంకే నే పక్కనెంచే వస్తున్నా సరాసరి,' అన్నాడు.

'హరి హరీ' అనుకున్నాడు తారకం.

'అయినా యింట్లో వాళ్ళకు చెప్పి వెళ్ళొస్తాలే. పర్వాలేదు.' అంటూ లేవబోయాడు.

"అది సరే కాని, చెప్పడమే మర్చిపోయాను. నేనీమధ్య కథరాశానోయ్ బావా!' అన్నాడు కోటీశ్వర్రావు జేబులోంచి ఓ కాయితాల బొత్తి పైకి తీస్తూ.

తారకం కిరకిరలాడిపోయాడు. పళ్ళు కొరుక్కున్నాడు మెల్లిగా—

'మంచిపని చేశావ్. నీకిలాంటి బుద్ధి పుట్టిందేం' అన్నాడు. కొంపతీసి ఆ గ్రంథం ఆమూలాగ్రం చదివి వినిపిస్తానంటాడేమోనన్న భయంతో అటు చూడనట్టే దృష్టి మరో దిక్కుకి మార్చాడు.

కోటీశ్వర్రావు యిదేం గమనించనట్టే మొదలెటాడు.

'హార్నీ. యిదేం లాకాయి 'శకునపక్షి' కథలాంటిది కాదురోయ్. పక్కా క్లాసికల్ మాస్టర్ పీస్. నవరసాల సారం కాచి వడపోసి'—

తారకానికి అంత కోపంలోనూ నవ్వు కూడా వచ్చింది:-

'నిజం నిజం. నీ వుపోద్ఘాతం వింటేనే కోకరసం ఫిల్టర్లో పోసిన కాఫీలా వూరుతోంది బావా! ఇంకా యిలా నీకృపనమిత్రమస్య...'

'అయితే నీకింకా నమ్మకం లేదన్నమాట. కావలిస్తే చూడు. చదివి వినిపిస్తా. నీకే తెలుస్తుంది' అంటూ కాయితం మడతలు విప్పటం మొదలెట్టాడు కోటీశ్వర్రావు.

తారకానికి నఖశిఖపర్యంతం చెమటలు పట్టేశాయి.

'బాబ్బాబూ! నిన్నేం అనలేదు బావా! ఏదో సరదాకన్నాని... నేన్నికన్నా మహా ఏం పూడబొడిచేను కనక. ఫెయిర్ చేసి లేహ్వాదున్నే మొయిలెక్కించెయ్. తిరిగొచ్చినా మరేం భయంలేదు. ఒకళ్ళిద్దర్ని చంపితే కాని వైద్యుడు కాడు. మరి నే

కోస్తా' అంటూ మరోసారి లేవటానికి ప్రయత్నం చేశాడు.

కోటేశ్వరరావుకి మరింత నామర్దాగా అనిపించింది.

'ఆగుగో ఆ మాటే అనొద్దంటున్నాను. తిరిగిరావడం పెంటిటోయ్ నీ మొహం. నాకలంపోటు నారాయణాస్త్రం! అయినా బిగినింగ్ చూడు పోనీ–"భువనమోహన సముద్భవమైన అంభోరుహా"...

'చాల్చాలు. గ్రాండ్. ఎక్సలెంట్. బ్యూటిఫుల్ బిగినింగ్. అంతే బావా! ఆ మాత్రం చాలు. యింకేంకావాలి! శ్రీనాథుడి ముని మనవడిలా సమాస శ్రేణి గుంభించి పారేశావ్. మరి నేనింక...'

'అప్పుడే ఏం చెపావ్? సాంతం వినండే. వినుమరి'—

"ఆ కోమలి కుసుమకోమల కరపల్లవి..."

తారకం వాచీ చూసి గతుక్కుమన్నాడు–

'అలాకాదు బావా! నువ్వు పల్లె పాడుకుపోతే అంత రమ్యంగా వుండదు. కాకపోయినా ప్రతీ పాఠకుడి దగ్గిరికీ వెళ్ళి నువ్వు చదివి వినిపించలేవు కదా. ఆ కాయితాలిలా యిచ్చెయ్. నేను రాత్రి తీరుబడిగా చదివి చూసి భద్రంగా నీకు వాపసుచేస్తా.' అంటూ కోటేశ్వరరావు నెలాగో కొంత సేపటికి వొప్పించి, పంపి, కాయితాలు డ్రాయర్లో దాచి రోడెక్కాడు. కాని తనీ జంఝాటమంతా తేల్చుకుని గమ్యస్థానం చేరుకు నేసరికి పుణ్యకాలం మించిపోయి జరగవలసినంతా జరిగింది. రామావతారం నరసింహావతారం దాల్చి అంత మాటా అనేశాడు—

'ఏరా తారకం! తిరిగెళ్ళేవాళ్ళని చూడ్డానికొచ్చేవా! ఛా ఛా ఛీ! సిగ్గయినా వెయ్యలేదూ మొహానికి! నాలుగున్నరకొస్తానని కూడా కోశావ్'

నిజంగా తనకు సిగ్గేవేసింది. జరిగింది చెప్పేందుక్కూడా మొహం చెల్లలేదు. రామావతారం చివాట్ల దండకంతో పూర్తిగా బూజు దులిపేశాడు—

'అయినా నిన్ను నమ్ముమని యెవడు చెప్పాడు. తెలిసి తెలిసి గోడ్డు గాడిదవాణ్ణి నమ్మినట్టయింది నా పని. పెళ్ళాం వెళ్ళిపోతున్నా వచ్చాను. అయినా యికమీద యెప్పుడూ యెవరికీ యిలాంటి చాతకాని వాగ్దానాలు చెయ్యబోకు...' అని కూడా ఆఖర్న గట్టిగా అన్నాడు.

ఆ క్షణంలోనే తనుకూడా గట్టిగా అనుకున్నాడు–ఒకసారా, ఒకచోటా యిలాంటివి జరిగి మరి!

ఒసారి వంటచెరుకు తెస్తానని చెప్పి వెళ్తూ తుల్చాగా సినీమాధాన్స దొరికింది

(43-వ పేజీ చూడండి)



వచ్చినోడు

అరిగె రామారావు

పొద్దు జారిపోయింది. చిమ్మచీకటు ముసురుకొంటున్నాయి. పూర్ణ గర్భిణిలాగా నిండుగా, విశ్వలంగావున్న భోగం సాని రేవులో పుడిసెడునీళ్లు త్రాగి, తడిసిన రెక్కలను తపతపలాడించుకుంటూ తెల్ల ొంగలగుంపు ఒక్కసారిగా పైకిలేచి,— ాగాదేవి మెడలో మల్లెదండల హారంలాగా—ఎటో ఎగిరిపోయాయి.

నాగరత్నం గడ్డిమోపు నెత్తిమీద పెట్టు ని గబగబ నడుస్తోంది. ఇవాళ మరీ ఆల స్యం అయిందన్న, ఈ పాటికి అక్కడ మోపు న్నీ అమ్ముడుపోయి వుంటాయి. ఏం ధర కుతుందో ఏమిటో!—అని అనుకొంటూ, లిమాగాణులుదాటి, రోడ్డున పడింది. మళ్ళీ గా మోపుకు ధర రాకపోతే, ఇంకెవ్వరి పు కొస్తుందిలే అని అనుకొని, తృప్తిగా వ్వుకుంది.

ఇవాళ చలపతిగాడు అడ్డగించకపోతే ంత జాగయ్యేదికాదు. అడ్డగించాడంటే, రి అడ్డగించడు! ఏ రోజుకారోజు డబ్బు వ్వకుండానే ఆడితోటలో గడ్డి స్తున్నా. అందరి దగ్గరా అకొయించి, నవేన చొప్పున వసూలు చేస్తున్నాడు జా తియ్యటి కబుర్లు చెప్తుంటే, చల్ల కి ఊగుతుంటున్నాడు. మరీయాళ ఆడికేం చ్చిందో ఏమిటో! చేద ఇస్తేనేకాని గడ్డి యటానికి వీలులేదని అటకాయించాడు. నచ్చే పదణాల డబ్బుల్లో సిడికి చేద ఇస్తే—ఇంక నూకలు, పై ఖర్చు మాట! సీతాలు, లచ్చిముళ్ళు మోపులెత్తుకు పోయిచాలసేపయింది; ఈపాటికి మోపులమ్ముకొని, బయదేరివుంటారు. ఇంతకి అచలపాయిగాడు చేశాడు. 'చేస్తాన్లే ఇయ్య— లేకపోతే...' అంటూ చెయిపట్టుకున్నాడా వచ్చినోడు. అడ్ని బులిపించి తప్పించుకునేటప్పటికి చచ్చినంత పనైంది. ఏంటో ఈ మొగాళ్లు ముందు పాడిచేసేటట్లు మాటాడుతారు. తీరా ఆడదాని చెంగు తగిలితే చల్లబడి. జావలాగా జారిపోతారు ఈ వెర్రిమొగాల మొగోళ్ళు!

ఇలా అనుకొంటూ రైలుకట్ట దగ్గర కొచ్చింది నాగరత్నం. అప్పుడే గోలును అడ్డంగా కట్టాడు అకాకిబట్టల వెంకాయిగాడు.

“ఈ బండీ ఇప్పుడే పోవాలా!” అని, తిట్టుకుంటూ మోపుకిందపడేసింది. వెంకాయిగాడు పచ్చదీపం పట్టుకొని, అటు ఇటు ఊపుతూ, నాగరత్నం మొగం వైపు చూపించాడు. కళ్లకు చేతులు అడ్డుపెట్టుకొని, దీపం వెలుగు మొగాన తాకకుండా ఆపింది. బండి బడ బడ వెళ్లిపోయింది.

వెంకాయి నవ్వుతూ “ఇయ్యాళ ఇంత ఆలస్యం అయిందేమే నాగులూ!” అన్నాడు.

“అయిందిగాని, గోలుకుతిరిగే వెర్రి మొగమా!” అంటూ నాగరత్నం మోపు నెత్తిన ఎత్తుకో పోయింది.

వెంకాయి చెయ్యేసి మోపు ఎత్తాడు. నాగరత్నం భుజంపట్టుకొని ఇలా అన్నాడు.

“ఇవాళ రేపు అంటూ రోజులు గడపటమే గాని నావూసే నీకు పట్టడంలా”

“సరేగాని, గోలును తప్పించు”

“ఇంతకి నామనస్సు తీర్చే దెప్పుడే!” అంటూ చేయి పట్టుకున్నాడు.

“ఎల్లండి—ఏకాదశి నాడు—”

చేయి విసిరికొట్టి, వయ్యారంగా గేటు దగ్గర కొచ్చింది. వెంకాయి గోలును లాగాడు.

నాగరత్నం కట్టదాటి, రెండు అడుగులేసి ఆగి,

“పువాకు కాడుంటే ఒకటియ్యరా!” అంది.

వెంకాయి జోడీనుంచి రెండుకాడలు తీసి, నాగరత్నానికి ఇస్తూ “ఒసేయ్ ఈయాళ మనయవారం లేలాల్సిందే! ఈడే కాసి వుంటా—నీవు సరుకులు తీసికొని గూడేనికి పోయేటప్పుడు—ఓ తప్పదు—” అన్నాడు.

“సరేలేపోయ్ వెంకాయ్,” అంటూ, ఆడిచేతిలోని కాడలు లాక్కొని, వయ్యారంగా ముందుకు సాగిపోయింది.

ఈ వెంకాయిగాడికి ఇంకా పెండ్లి

కాలా తండ్రి ముసిలోడు అవటంతో, ఆ రైలుగేటుకాడ ఉద్యోగం వీడికొచ్చింది. తల్లి వీడి చిన్నతనంలోనే చచ్చిపోయింది. తండ్రికూడ ఇవాళ, రేపు అన్నట్టుగా ఉన్నాడు. వెంకాయికి గడ్డిమోపుల వాళ్లందరు పరిచయమే! అసలు నాగరత్నాన్ని వాడే మనువు చేసుకుందాం అనుకున్నాడు. కాని, అది వాళ్ల గూడెంలో మరొకడికి మనసిచ్చి, వాణ్ణే కట్టుకుంది. ఐనా, వెంకాయి ఇప్పటికీ నాగరత్నం వెంటపడటం మానలా. అదంటే వాడికి చెప్పలేనంత మోజు. అది ఏమడిగినా కాదనక, లేదనక ఇచ్చేస్తాడు.

నాగరత్నం వీడి విషయంలో అవును అనదు; కాదనదు. ఇదిగో రేపు, మాపు అని గడుపుకొస్తోంది. దాని మిడిసిపోయే అందంముందు, గుండెలను వడిసికొట్టే చిరునగవుముందు—వెంకాయిగాడు ఎప్పుడు తల వంచవల్సిందే! వాడు రోజుకు రెండు మూడు పువాకు కాడలు, పండుగలకు పబ్బాలకు గాజుల డబ్బులు, అప్పుడప్పుడు సినిమా ఖర్చులు సమర్పించుకుంటున్నాడు. నాగరత్నం ఊరించి మురిపిస్తోందేగాని, వీడి మోజు తీర్చటం లేదు.

నాగరత్నం ఊళ్ళోకి వచ్చేసరికి, అక్కడ మోపులన్నీ అమ్ముడుపోయాయి; కొనే వాళ్ళుకూడ ఎవరూ లేరు. నాగరత్నం మోపు దించుకొని, లైటుస్తంభానికి ఆనుకొని నిల్చుంది. చెరిగిన వెంట్రుకలను మునివేళ్ళతో సరిచేసుకొని, చెంపపిన్నులను ఊడదీసి మరల పెట్టుకుంది.

ఎదురుగుండా దిగాలుమంటున్న గంగానమ్మ రావిచెట్టు వంక చూచింది. ఆరోజు అలస్యానికి కారకుడైన చలపతిని మళ్ళీ ఒకసారి మనస్సులో తిట్టుకుంది. ప్రతిరోజు తన మోపు దింపగానే బేరగాండ్లందరు ముట్టేసేవాళ్ళు. వాళ్ళతో సరాగాలు, పరాచికాలు ఆడుతుంటే, మోపు ధర తనకు తెలియకుండానే పెరిగిపోతూండేది. మిడిసిపోయే నాగరత్నం అందం, సరసాలు అందర్ని ఆకర్షిస్తాయి. అందువల్లే అది తెచ్చే గడ్డి మంచిది కాకపోయినా, దాని మోపుకు అందరి మోపులకంటే ఎక్కువ ధర పడుతుంది.

వచ్చి అరగంటైనా మోపు అడిగేవాళ్ళే కన్పించలేదు. ఇక, వాల్టికి మోపు ఎత్తుకొని ఇంటికి పోవాల్సిందే అని అనుకొంటున్న సమయంలో ఒక యువకుడు అక్కడికొచ్చాడు. అతన్ని చూచి నాగరత్నం చిరునవ్వు నవ్వింది; ఆనవ్వు తంగేడిపూలు పూచినట్లుంది. వీధిదీపం కాంతిపడి నాగరత్నం నల్లటిచెంప తళతళలాడింది. ఆ ముక్కుటిచెంప తళతళలు చూడగానే ఆ యువకుని హృదయం కలకలలాడింది.

"ఏంవండి మోపుకావాలా?" అడిగింది నాగరత్నం.

"ఊఁ— ఎంతకిస్తావు?" అని అడిగాడు.

"పదణాలు—మంచిగడ్డి—"

"సరే, ఎత్తుకో—"

ఇద్దరూ శివాలయంవీధి వైపుగాపోయారు. ఆయువకుడు బ్రాహ్మలకుర్రాడు. ఆ ఊరి హైస్కూలులో ఎస్సెస్సెల్సీ చదువుతున్నాడు; పేరు రామారావు. యౌవనం వికసించే తొలిదినాలు! ఆడదాని అందం చూడగానే, హృదయంలో గడబిడ కలిగే మధురదినాలవి! ప్రతిరోజూ నాగరత్నాన్ని చూడందే ఉండలేడు. ఎక్కువగా నాగరత్నం మోపులే కొంటాడు. మనస్సు విప్పి చెప్పలేక మథనపడుతున్నాడు. ఇదంతా నాగరత్నానికి తెలుసు. తన అందం పందెంలో ఆ అమాయకుడ్ని ఒకఆట ఆడిస్తోంది.

గొడ్లసావిట్లో మోపువేసి, తలవాకిట్లోకివచ్చింది. అక్కడ నైటుక్వీన్‌పూలు నక్షత్రకాంతిలో తళతళలాడుతూ, గాలిలో సువాసనలను కలుపుతున్నాయి. నాగరత్నం ఎగిరెగిరి ఒక పూలగుత్తిని కోసింది; అంతకుముందు తన తలలో వాడిపోయిన తంగేడిపూలు తీసి అవతలపారవేసి,





తీసి పెట్టమంది. ఇదంతా రామారావు చూస్తూనేవున్నాడు. అర్థంకాని తియ్యటి ఉద్వేగంతో ఊగిపోతున్నాడు.

"ఎంటి అట్టా చూస్తున్నారు? డబ్బు లిప్పించండి" అంది.

రూపాయిబిళ్ళ ఇచ్చాడు. దాన్ని తీసుకొంటూ, తనచేతి వేళ్ళను రామారావుచేతికి తాకించింది. ఆ తాకిడి అతడు ఉక్కిరి బిక్కిరైపోయాడు.

"నా దగ్గర చిల్లర డబ్బులు లేవండి." తిక్కిరి, బిక్కిరి చూపులు చూస్తూ, వంకర నవ్వులు నవ్వింది.

"ఫర్వాలేదులే - ఉంచుకో—" తడి ఆరుతున్న గొంతుతో అన్నాడు.

తృప్తిగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. చేతిలోని కర్రతిప్పుకుంటూ, వయ్యారంగా వెళ్ళుతున్న నాగరత్నాన్ని వీధి మలుపు తిరిగే వరకూ చూస్తూ నిల్చున్నాడు ఆ నాడెంటు పుల్రోడు.

* * *

తొందరతొందరగా నడుస్తూ షావుకారు చెంగయ్య కొట్టుకెళ్ళింది - సరుకులు కొనుక్కోటానికి. అప్పుడు కొట్టుమీద షావుకారు కొడుకు సుబ్బారాయుడు ఉన్నాడు.

నాగరత్నాన్ని చూడగానే ఏనుగు గున్నంత ఉన్న సుబ్బారాయుడు - సంతోషంతో అంతెకంతయ్యాడు.

"ఏమే నాగరత్నం ఇవాళ ఇంతఆలస్యంగా వచ్చావే? మీ వాళ్లిందరూవెళ్ళి జాము సేపైందిగా?" అన్నాడు.

"అయిందిలేగాని, శేరునూకలు పొయ్," అంటూ చెంగుపట్టి, సుబ్బారాయుడివంక ములుకుల్లాంటి చూపులు విసురుతూ నిలిచింది. రాయుడుకుండె కొంచెం కలుక్కుమంది.

"నూకలకూడు ఏం తింటావు నీబొంద? పట్టు—" అంటూ ఒకటో నెంబరు వంకసన్నాలు—శేరు ముప్పావలా రకం—పోశాడు.

బియ్యంపోసి, భుజంపట్టుకొని, "రెండో ఆటకు సినిమాడేరా కొస్తావా?" అన్నాడు.

నాగరత్నం ముద్దుగామూల్గి, చేయివిసిరి కొట్టి, "అదిగో, మీ అయ్య వస్తొన్నాడు—" అంది.

సుబ్బారాయుడు భయంతో వణికిపోయాడు. సరుకు సర్దేసి, గట్టిగా "ఇంకేం కావాలో చెప్పవమ్మా—" మామూలు వ్యాపార కంఠంతో అన్నాడు.

నాగరత్నం పకపకనవ్వి, "ఓరి నీధియం దొంగలుతోలా—" అంది.

సుబ్బారాయుడు వెనక్కు తిరిగి చూశాడు. వల్ల మొగం తెల్లబడింది. "బలేదానివే— నిజంగానే అయ్యవస్తొన్నాడేమోనని హడలి పచ్చాను" అన్నాడు.

నాగరత్నం విరగబడి నవ్వుతుంది. సుబ్బారాయుడుకు ఆనవ్వు చిల్లరడబ్బుల సంచిని ఇనప్పెట్టెలోకి కుమ్మరించినట్లుంది. అడక్కుండానే ఇంకా ఉప్పు, పప్పు, మిరపకాయలు—ఇవి, ఇవి అన్నీ చెంగులో పడేశాడు.

ఇంతలో నిజంగానే షావుకారు చెంగయ్య వచ్చాడు. సుబ్బారాయుడు గప్‌చిప్. నాగరత్నం చెంగయ్యకు పరికొత్తనవ్వు విసిరింది. చెంగయ్య నాలికతో పెదిమలు తడుపుకున్నాడు. ఇటువైపు చూశాడు. కొడుకు దిష్టిబొమ్మలాగా కన్పించాడు.

"ఏంరా గరటాలుకు రెండు ఉప్పుకట్టలు విసిర్యమన్నా-మరి వేశావా?"

"ఓ వాంసేపైంది-"

"మరి పైకమో?"

"ఇయ్యలా. పండికొడ రమ్మన్నాడు"

"మరింకా కూసున్నావేంరా వెర్రిమొగమా? వెళ్ళి పనాలుచేసుకురాక-ఊఁ వెళ్ళు-" అన్నాడు.

సుబ్బారాయుడు వాళ్ళ అయ్యవంక, నాగరత్నంవంక చూస్తూ, గొణుక్కుంటూ గల్లాదగ్గరనుండి లేచాడు.

చెంగయ్య పళ్ళుఅంతా కళ్ళుచేసుకొని, నాగరత్నంవంక చూస్తూ, "దీనికి వెచ్చం ఎంత ఇచ్చావే?" అన్నాడు.

"సుబ్బారాయుడు కోపు బుర్ర గోక్కొని, "ఆఁ ఎంత-చేసకానిది" అని బయటికి వెళ్ళాడు.

ఆ మాటవిని నవ్వుతుంది. రూపాయి ఇస్తూ, "మీ డబ్బులు తీసికొని, మిగిలిన డబ్బులిప్పించండి" అంది.

"నీదగ్గర చేసకాసీ తీసికోమంటావా వెర్రి మొగమా?"

"ఈ ఉట్టుటేమాటలుకేం వచ్చేగాని— డబ్బులు తీసుకో—" పెసెసరంగా అంది.

"ఉట్టిమాట లేందే వెర్రి మొగమా? నీకేం గావాలో చెప్పు. పటిక బెల్లం

పెట్టనా?"

"పటిక బెల్లం వద్దు. ఇటిక బెల్లం వద్దు. నేను పోతుండా—" అంటూ రూపాయి బిళ్లను మళ్ళా రొంటిని దోపింది.

"అట్లా దులిపేసుకు పోతా వేంటే పిచ్చి మొగమా? ఇదిగో ఈ సబ్బుబిళ్ల తీసికో. మంచి సువాసనగా వుంటుంది. నీ వంటికి రుద్దుకో," అంటూ లక్సుసబ్బు ఒకటి ఇచ్చాడు.

నాగరత్నం సబ్బు తీసికొని, కళ్ళతో నవ్వి, వయ్యారంగా వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న నాగరత్నాన్ని చూస్తూ, "మడి సంటే అలా బందోబస్తుగా ఉండాలి—మా ఇంటిదీ ఉంది—తగ లెయ్యనా?" అపుకోలేక పైకి అనేశాడు.

ఈ మాటను అప్పుడే దుకాణంలోకి వస్తున్న ఇంటావిడ విని, ఒక మేఘగర్జన చేసింది. వెంగయ్య వెనక్కు చూచి, గతుక్కుమని చలికలపడ్డాడు.

2

నాగరత్నం గుడిసె కొచ్చేసరికి గూడెం వాళ్ళందరు నిద్దర్లు పోతున్నారు. ఆ గూడేన్ని నల్లటి చీకటి కౌగలించుకుంది. అక్కడక్కడ మేకపిల్లల మేమేలు, ఎక్కడెక్కడో కుక్కల మొరుగుళ్లు విన్పిస్తున్నాయి. ఈ పాటికి తనమొగుడు గుడిసె కొచ్చి, తను లేకపోయేసరికి కోపంతో కుతకుత లాడుతూంటాడు; కూడుకూడ వండలేదు. ఏమైనా ఇవాళ తనకు తిట్లు, దెబ్బలు తప్పవనుకుంటూ వచ్చింది. తీరా గుడిసె కొచ్చేసరికి తనమొగుడు జాడే లేదు. తడికతలుపు తీసి లోపలికెళ్ళింది. కిరసనాయిలుబుడ్డి వెలిగించి, గబగబ కూడు వండటం మొదలు పెట్టింది ఏకొద్ది పాటి అలికిడైనా, మొగుడొచ్చాడేమోనని బయటకొచ్చి తొంగిచూస్తోంది.

అన్నం వండటం అయింది. తన మొగుడు ఇంకా రాలేదు. పొద్దుటాల నూరిన గొడ్డుకారం ఉంది. సన్నబియ్యం వన్నం—నచ్చినోడు ఆవురావురుమంటూ కుండెడు ఖాళీ చేస్తాడు అనుకొంటూ తనలో తాను నవ్వుకుంది. ఆ నవ్వులో తన మొగుడి మీదున్న మమత వెల్లివిరిసింది. తెల్లారగట్ట తిన్న కూడు—ఈపాటివరకూ తిండితిప్పలు లేకుండా ఎక్కడెక్కడ బలాదూరు తిరుగుతున్నాడో? దమ్మిడి సంపాదన లేకపోయినా, అయ్యగారికి నీటుకేం తక్కువలేదు. ఏ కలుపాకలదగ్గర పాతేసుకుపోయాడో?

సన్నబియ్యపన్నంలోకి వంకాయ కూరుంటే తన మొగుడి కెంత యిష్టం! పాపం, తిరిగి తిరిగి ఆకలిగా ఉంటాడు; వంకాయకూరకూడా చేస్తే బాగా తింటాడు అని దొడ్లోకి వెళ్ళింది. అప్పుడే చంద్రుడు ఎఱ్ఱగా పైకి లేస్తూ, తేవురునిండిన వెలుగులను విరజిమ్ముతున్నాడు. దొడ్లోని వంగమొక్కల్లో వెదికివెదికి నాలు లేతవంకాయలు కోసింది.

కూర వండటం పూర్తిఅయినా, నాగరత్నం మొగుడు రాలేదు. కూర, అన్నం వండేసరికి, కుండలోని నీళ్ళు బాగా సలసల కాగివున్నాయి. రెండు చెంబుల నీళ్ళు పోసుకొనేసరికి, ప్రాణానికి ఎంతో హాయి అనిపించింది. షావుకారిచ్చిన సబ్బుతో వళ్ళు రుద్దుకుంది. సబ్బువాసనలువంటేని పులుముకున్నాయి. ఆడొచ్చి తన్ను గట్టిగా కావుచేసుకొని, ఈ వాసనలు చూచి ఇదైపోతాడు. మనస్సు ఆ ధ్యాస వైపు మళ్ళేసరికి వళ్ళు గగుర్పొడిచింది. గుడిసెబయట కొచ్చింది. తెల్లటి వెన్నెలతో బయటంతా విరగ్గాచిన మల్లెపందిరిలా వుంది. ఆవెన్నెట్లో గాలి చల్లగా వంటికి తాకుతుంటే, ప్రాణం ఎక్కడెక్కడికో ఎగిరిపోతోంది. తల్లోనిపూలు, వంటికి పూసుకున్న సబ్బువాసనలు, నిశ్శబ్దం, చక్కదనాల మరి చంద్రుడు, దక్షిణపుగాలి, కవకవలాడుతున్న నాగరత్నం వయస్సు—ఇవన్నీ దానిమనస్సును మొగుడి ఆలోచనలతో నింపేశాయి. వాడి కోరమీసాలు, జులపాల జుట్టు, కండలుతిరిగిన శరీరం, చేతిలోని బాణాకర్ర — ఈ వేషమంతా దాని కండ్లెదుట మెదిలి, చక్కిలిగింతలు పెట్టేంది.

నుక్కిమంచం తెచ్చుకొని, గుడిసెముందు చింతచెట్టు కింద పండుకొంది. చెట్టుకొమ్మల సందులనుండి ముగురు వెన్నెలలు చెదిరి దానిమీద పడుతున్నాయి చల్లగాలికి, చింతపూలు జలజల మీద రాలుతున్నాయి. నాగరత్నం ఒకపువ్వును చేతితో నలిపి వాసన చూచింది; వగరవాసన వచ్చింది.

ఎందుకో వెంకాయిగాడు జ్ఞప్తికొచ్చాడు. ఊళ్లోనుండి గూడేనికొస్తుంటే, చీకట్లో చింతచెట్టు చాటునుండి వచ్చి, గట్టిగా వాటేసుకున్నాడు. తొణుకుతున్న గొంతుతో "ఏమైనావరే, ఇప్పుడుతప్పదే నాగులు", అంటూ వణుకుతున్న పెదాల్ని తన చెంపలకు ఆనిచ్చాడు. విడిపించుకోవాలని ప్రయత్నం చేసిందికాని, వాడు పట్టినపట్టు సడలనియ్యలేదు.

"నీకు దన్నం పెడతా వదలరా వెంకాయీ! నేను చెప్పేది వినరా— నేను ఇయ్యాలి వరకూ ఎక్కడా పెడలా—నిప్పులాంటి దాన్ని—నా మావకు అన్యాయం చేయలేను ...నీకు చెల్లెలులాంటి దాన్ని...వదలరా వెంకాయి..." అని తను జాలిగా వేడుకొంది.

ఈమాట వెంకాయి గుండెలమీద చెరనాకోలలాగా మోగింది. పట్టువిడుస్తూ, "మరెంతే సంజవేసాలు? మనుసున్న దానిలా చిమతలు వొలకపోసేదానివి," అంటూ నెమ్మదిగా గొణిగాడు.

"మరి, నీవు వడి వస్తుంటే ఏం చెయ్యమంరా?" నీళ్లు నమిలింది.

"వస్తుంటే—" ఏదో అనబోయి, "ఛీ పోవే, సంజకానా—" అని, చీకట్లోకి దూసుకుపోయాడు.

అంత తేలికగా వదులుతాడనుకోలా. అది మంచితనం తెలుసుకొంటుంటే తన కళ్ళు చెమ్మగిల్లాయి.

గుడిసె ముంగిటనుండి "ఏయ్ నాగులా! ఎక్కడ సచ్చావే?" అంటూ నాగరత్నం మొగుడు గొంతు విన్పించింది.

వాడిగొంతు వినగానే దానికి పట్టుచీర కట్టుకున్నంత సంబరమైంది.

"నా దేర్నం పాడుగాను వీడొచ్చి ఎంత సేపైందో?" అనుకుంటూ లేచి వెళ్ళింది.

"ఇంతసేపుదాక ఎక్కడెక్కడ తిరుగుతున్నావు? పద-పద-కూడు పెడతా—" అంది.

"కూడొద్దు; నీ మొగొద్దుగాని—సిల్లర డబ్బులుంటే పడేయ్. ఉన్న డబ్బులన్నీ ఆ సత్తిగాడు గుంజుకున్నాడు. జూదంలో పెద్ద మొనగాడి ననుకుంటున్నాడు. ఇప్పుడు మన తఢాక చూపించి, వాడి పొగరణచాలి" అంటూ మీసం మెలేశాడు.

"ఇప్పుడేం జూవం? కూడుతిని తొంగో—ఐనా నాదగ్గర ఎర్రనేగానీ కూడ లేదు" అంటూ లోపలికి దోవతీసింది.

★ నచ్చినోడు ★

"వెధవనంజ వేషాలు వేయక, డబ్బు తీస్తావా లేదా?" కట్టించి అడిగాడు.

"లేదని చెప్పటంలా?" అంటూ గుండెలో కూడు మూడుక్లో పెట్తోంది.

వాడసలు జూదంలో డబ్బులు పోయి వచ్చాడు; పందెకాడ త్రాగిన కాపుసారా కైపు ఇంకా కొంత మిగిలివుంది. దీని పెంకితనం మాటలు వినేసరికి, వాడికి అరికాలు మంట నడినెత్తికెక్కింది; కుడికాలుజాడించి నాగరత్నం నడ్డిమీద ఒక్క తన్ను తన్నాడు. అది 'అమ్మో' అంటూ ముందుకుపడింది. ముందుకుపడ్డ దానిమీద పీడు పడి, రొంటిన వున్న రూపాయిబిళ్ళ వూడలాక్కున్నాడు.

"మరేదగా అడుగుతే మాట వినవే.— ముక్కలు విరగ్గొట్టాలేం—" అంటూ బయటికి దూసుకుపోబోయాడు.

నాగరత్నం ఒక్క వుదుటున వాడి కెదురొచ్చి, వాడ్ని వాటేసుకొని ఇలా అంది:

"తీసుకుంటే తీసుకున్నావులే మావా—నా మాట విని బువ్వ తిను. పొద్దుటాల తిన్నకూడు—సన్నబియ్యపన్నం, వంకాయ కూర వండాను నీకు ఇష్టం అని. బువ్వ తిని తొంగో. జూదం లేపు ఆడుకుందువులే—అద్దరాతిరికాడ ఏడికి పోతావు మావా—"

"ఛీ! ఏడుపు మొగందానా! అడ్డులే—" అంటూ దాన్ని ఒక్క తోపు తోసి, బయటికి పోయాడు.

నాగరత్నం తడికకు జారిగిలపడి ఏడుస్తూ కూర్చుంది.

అదే రాత్రి, అదే సమయాన—

గొడ్లకు మేత వేస్తూ, "నాగులు ఇవాళ కూసె తప్పించుకుంది. ఏమైనాసరే దాన్ని లేపు వదలకూడదు" అనుకున్నాడు చలపతి.

* * *

వెంకాయి గూడ్సుబండికి పచ్చదీపం చూపిస్తూ, నాగరత్నం తిరస్కరణను తల్చుకొని బరువుగా నిట్టూర్చాడు.

* * *

రామరావు దీపంముందు కూర్చుని చదువుకున్నాడన్నమాటేగాని, ఒక్క అక్షరం ముక్క కూడా బుర్రకెక్కడంలేదు. పేజీల్లో నాగరత్నం పూలకుర్తిని అందుకోటానికి ఎగురుతోంది...చిలిపినవ్వులు నవ్వుతోంది... కట్రతిప్పుకుంటూ వయ్యారంగా నడుస్తుంది...అర్థంకానితియ్యటి బాధలో సతమతమౌతున్నాడు.

* * *

షావుకారుగారి కొడుకు సుబ్బారాయుడు సినిమా డేరాకాడ నాగరత్నం వచ్చిందేమోనని వెతుకుతూ, అటుఇటు పచార్లుచేస్తూ, వాళ్ళయ్యకు తెలిసినవాళ్ళు కనిపిస్తే మొగం చాటుచేసుకుంటున్నాడు.

* * *

షావుకారు వెంకయ్యవాకిట్లున్న భార్యకు అన్నం వడిస్తూ—నాగరత్నం ధ్యాసలో ఉన్నాడు కాబోలు—"ఇంకొస్త కంది పచ్చడెయ్యమంటావా నాగులూ?" అని, జాలిగ కోరుకున్నాడు. భార్య ఉరిమురిమి చూసింది.

* * *

జూదం ఆటలో వచ్చిన దెబ్బలాటలో—సత్తిగాడు విసిరిన పెద్దరాయి తలకుతగిలి,—కారుతున్న రక్తంతో, జారుతున్న మతిలో—కిందపడి గిలగిల కొట్టుకుంటున్నాడు. నాగరత్నం మొగుడు.

* • •

నిశ్శబ్దంగా నిదురపోతున్న మాలవాడలో ఎక్కడో దూరంగా కుక్కల మొరుగుళ్ళు—ఆగిఆగి వస్తోన్న నాగరత్నం ఎక్కిళ్ళు—చెంపలమీద ఆరిపోయిన కన్నీటిచారికలు నాగరత్నాన్ని నవుకీలు చేస్తోన్నట్లుగా తీతువుల కూతలు!

గుండెల్లో అలుముకున్న విషాదంలాగా చింతచెట్టు చీకటిగుబురు!

నల్ల కుక్కకు పరమైన సన్నబియ్యపన్నం మొక్కపోయిన చంద్రుని దిగాలు మొగం! చెరిగిన కలలాగా విరిగిన అలలాగా భంగపడిన నాగరత్నం వలపు! ★

నక్షత్ర ఫలితాలు

[4-3-59 మొదలు 10-3-59 వరకు]

గ్రహస్థితి.

బు శు శ		కు	
ర	ధనుర్మకర, కుంభ, మీనముల్లో చంద్రుడు.		
కే	గు		రా

అశ్వని [చూ, చే, చో, లా]

ఈ వారము ధనాభావము ఎక్కువ. ఎవరి సహాయమువల కార్యసాధన చేదామనుకున్నారో వారివల్లనె ఆటంకములు కలుగుతవి. అయినా దైవబలమువల క్రమేణా కార్యానుకూలత అవుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుండదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి. వర్తకులకు నిరాశ. విద్యార్థులకు మంచిరోజులు కావు. వారమంతా ఆందోళనగావున్నా సాధుసాంగత్యము, పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, నష్టద్రవ్యలాభము కలుగును.

*** భరణి [లీ, లూ, లే, లో] ***

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్నకార్యములు శ్రమాధిక్యముతో ఫలించును. కోర్టుదావాలు అనుకూలిసవి. పరోపకారానికి యత్నపడిసాగక నిందలు పొందుతారు. భార్య ఆరోగ్యము సరిగావుండదు. ఇచ్చిపుచ్చుకోవడల్ల వివాదములు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడివున్నా తోటివారి సహకారములభిస్తుంది. వారమంతా నిరాశ. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

*** కృత్తిక [ఆ, ఈ, ఊ, ఏ] ***

ఈ వారము ఎన్ని అవాంతరములు వచ్చినను పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభమును పొందుతారు. ఆశించిన డబ్బు సమయానికి అందక అప్పుచేస్తారు. సోదరసహాయము కలుగుతుంది. ఆత్మీయులవల నిందలు పొందుతారు. డబ్బులుతిగిరే ప్రమాదము జాగ్రత్తవల తప్పవచ్చును. గనులయజమానులకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, రంగులు, లోహపు సామానుల వ్యాపారసులకు కష్టముతో కూడిన లాభము. 9, 10 ప్రమాదసూచన.

*** రోహిణి [ఓ, వా, వీ, వూ] ***

ఈ వారము మీకు యోగ్యప్రదము. బంధువుల సహాయముతోనూ, అధికారుల సహాయముతోనూ, అధికారుల సహాయముతో నూ ఆటంకములను గడిచి ఫలం పొందుతారు. ఆదాయము వృద్ధి అవుతుంది. వైద్య జ్యోతిష శాస్త్ర ప్రసంగాలు చేస్తారు. ఈశాన్య దిక్కునుండి కుశలవార్త తెలుస్తుంది. విద్యార్థులకు మంచికాలము. కవులకు, గణిత శాస్త్రజ్ఞులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 4, 5, 6, 7 ధనలాభము, కార్యసిది.

బి. నరసింగరావు

*** మృగశిర [వే, వో, కా, కీ] ***

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. ఆశించిన సొమ్ము చేతికివస్తుంది. నూతనకార్యములు ప్రారంభిస్తారు. కోర్టు దావాలలో అనుకూలత వుంటుంది. పండిత గోష్ఠి జరిపి నూతనాంశాలు తెలుసుకుంటారు. వారమంతా శుభయోగములువున్నా కొంత ఆందోళనతో కూడివుంటుంది. 4, 5, 6, 7 ధనలాభము, కార్యసిద్ధి. 9, 10 అధిక ఖర్చులు. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుగా వుంటుంది.

*** ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] ***

ఈ వారము వినోదములలో పాల్గొనుట, దధి - క్షీర - మధుర పదార్థయుక్త సుభోజనము రజితపాత్రలలో భుజించుట, తలచిన కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము, తెల్లని వస్తువులు కొనుట మొదలగు యోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము ద్రవపదార్థ జన్యముల క్రయవిక్రయములతో వర్తకులకు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది. విద్యార్థులకు మంచికాలము. 9, 10 అధిక ఖర్చులు, ఆందోళన

*** పునర్వసు [కే. కో. హా-హీ] ***

ఈ వారము ధనధాన్యవృద్ధి కృషిమూలకముగా లాభము, వివాహాది శుభకార్యములలో పాల్గొనుట, ఇష వసులాభము, పరోపకారమువల్ల కీర్తివంటి రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదములలోపాల్గొన్నా, చదువు బాగా సాగుతుంది. విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు రెట్టింపు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము.

*** పుష్యమి [హూ. హే. హో. డా.] ***

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. రాబడి తక్కువ. గృహావసరములు తీరక కలతలు. ఆరోగ్యము సరిగా లేని సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా గ్రహారాధన రవిశాంతి చేయించుట మేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. రాజకీయవాదులకు ఆందోళన. 4 5 6 7 పితృవర్గ సహాయము, ధనలాభము, ప్రయాణము. 9 10 ఆరోగ్యభంగము.

*** ఆశ్లేష [డీ. డూ. డే. డో] ***

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా మిత్రసహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు ఏమంత బాగుండదు. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అవయోగములువున్నా, మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్రవస్తు సంపాదనవంటి శుభయోగములుకూడా వుంటవి.

*** మఖ [మా మీ మూ మే] ***

ఈ వారము మీరు సహాయము పొందదలుచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని పొందుతారు. ధనాభావంకూడా ఎక్కువ. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. ఆధ్యాత్మిక చింతనల దైవముపై భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి, వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు మంచికాలము కాదు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, విచిత్రములను చూచుట, జరుగును. వారమంతా అవయోగ, శుభయోగ మిశ్రమముగా వుంటుంది.

★ నక్షత్రఫలితాలు ★

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
(మో, టా, టీ, టూ)

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్నకార్యములు ఎక్కువ శ్రమతో ఫలిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకూలిస్తాయి. ఇతరులకు సహాయము చేయబూని ఫలించక నిందలు పొందుతారు. యిచ్చి పుచ్చుకోవడములో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ, తోటివారి సహకారము వుంటాయి. వర్తకులకు వారమంతా నిరాశ, వారాంతమున మేలు. 9, 10 భార్య అనారోగ్యముచే ఆందోళన, విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

ఈ వారము ఎన్ని ఆటంకములు వచ్చినా పట్టుదలతో ప్రయత్నించడంవల్ల కార్యసిద్ధి అవుతుంది. ఆశించిన సొమ్ము సమయానికి అందక అప్పు చేస్తారు. దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహ రంగు వ్యాపారస్తులకు కష్టముతో కూడిన లాభము. గనుల యజమానులకు, యంత్రములు నడుపు నిపుణులకు, ఇంజనీరింగు వుద్యోగులకు మేలు కాలము.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు యోగకాలము. బంధు సహాయము. అధికారుల సహాయము కలుగుట చేత అన్ని చిక్కులు వీడి కార్యసిద్ధి అవుతుంది. ఆదాయము వృద్ధి పొందుతుంది. శాస్త్ర ప్రసంగాల్లో పాల్గొంటారు. కవులు నూతన రచనలు చేస్తారు. బంధువుల క్షేమ వార్త తెలిసి సంతోషము పొందుతారు. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. గణితశాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము.

* చిత్త [పే, పో, రా, రీ] *

ఈ వారం మీకు మంచి భాగ్యయోగము. అనుకున్న డబ్బు చేతికి వస్తుంది. ఇబ్బందులు తీరుతవి. దావాలలో గెలుపు పొందుతారు. పిల్లల అభివృద్ధికి చేసే ప్రయత్నాలు ఫలిస్తవి విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. న్యాయస్థాన వుద్యోగులకు, న్యాయవాదులకు, పండితులకు, వుపాధ్యాయులకు మేలుకాలము.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీకు యోగదాయకము. ధనయోగము వుంటుంది. సంగీతసభలు, కవితాగోష్ఠి వంటి వినోదాలలో పాల్గొని మృష్టాన్న భోజనము వెండి పాత్రలలో చేస్తారు. శుభ కార్యములలో పాల్గొంటారు. నూలు బట్టలు, బియ్యము, వెండి వస్తువులకు లాభము. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది.

* విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారముకూడా మీకు గతవారమువలె శుభయోగదాయకముగా ఉంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభదాయకముగా ముగుస్తవి. శుభ పుణ్యకార్యాలలో పాల్గొంటారు. నూతన గృహనిర్మాణమునకు ప్రయత్నిస్తారు. ఉద్యోగస్తుల హోదా పెరుగుతుంది. వర్తకులకు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో ఎక్కువ లాభము. వారమంతా శుభయోగములతో కూడివున్నా వారాంతమున కుటుంబ కలహముచే ఆందోళన కలుగుతుంది. స్త్రీలతోనూ, మిత్రులతోనూ విందు వినోదము.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము రాబడి తక్కువ. ఖర్చులు ఎక్కువ. గృహావసరములు తీరకవ్వరలు వస్తాయి. అనారోగ్య సూచనలు కనబడగానే వైద్యచికిత్స పొందడము, దానికి శాంతి చేయించడము మంచిది. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన విద్యార్థులకు చదువు సరిగా జరగదు. వారమంతా భయాందోళనలతో కూడివున్నా

—ధరలు:—

నగలు వస్త్రములు: సమస్థాయిలో వుండును.
నూనెగింజలు: మార్పులేదు.
ఆహారధాన్యములు: తగ్గుదలలో వుండును.
బెల్లము, పంచదార: సమస్థాయిలో వుండును.
చింతపండు: తగ్గుదలలో వుండును
పప్పుదినుసులు: మార్పులేదు.
వెండి, బంగారము: స్వల్ప తేడాలో వుండును.

* * *

జన్మనక్షత్రమునుబట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటి అక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకోనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృష్ణుడను పేరునకు స్వాతియూ, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయున్నూ చూచుకోనునది.

పిత్రువర్గ సహాయము, కార్యలాభము కలుగుతవి.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈవారము నిరాశగావున్నా మిత్ర సహాయమువల్ల కార్యలాభము అవుతుంది. ఇంటో వున్నవారి అనారోగ్యమువల్ల ఆందోళన కలుగుతుంది. ఉద్యోగస్తులకు స్వల్ప అనుకూలత. వర్తకులకు వారాంతమందు లాభము. వారమంతా ఉద్రేకముగావుంటుంది. విదేశీయుల పరిచయము, అపురూప వస్తుసంపాదన కలుగుతాయి. 9, 10 అధిక ఖర్చులు, మనోవ్యధ. విద్యార్థులకు చదువు బాగా సాగదు.

మూల [యే, యో, బా, బీ]

ఈవారము మీకు మిశ్రమ యోగము. ఆశించిన సహాయము లభించక, అవసరము తీరక, ఆందోళన కలుగుతుంది. అయినప్పటికీ దైవానుగ్రహమువల్ల కష్టములుగడిచి కార్యసిద్ధి పొందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ. వర్తకులకు చాంచల్యము. పుణ్యపురుష సాంగత్యమువల్ల మనోవికాసము కలుగుతుంది. వారమంతా అశాంతిగా వున్నా నష్టద్రవ్య లాభము పొందుతారు. 9, 10 అధికఖర్చులు.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈవారము అనుకూలతకన్నా ప్రతికూలతే యెక్కువ. ఇచ్చిపుచ్చుకు నేపట్ల వివాదాలు వచ్చి మనోవ్యధ కలుగుతుంది. కోరు వ్యవహారములు అనుకూలించినా అమిత ఖర్చులవల్ల అసంతోషమువుండదు. భార్యకు అనారోగ్యము కలిగేసూచనలున్నవి. మినుములు, కొర్రలు, రాగులు, ఉప్పు, నువ్వులు, నూనె వ్యాపారస్థులకు లాభయోగము. ఇతరజాతుల వారివల్ల గౌరవము కలుగుతుంది. 9, 10 భార్యకు అనారోగ్యము, బంధువులరాక, అధిక ఖర్చులు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈవారము ఎంతప్రయత్నించినా యత్న కార్యములకు ఆటంకములు కలుగుతునే వుంటాయి. అయిననూ పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభము పొందుతారు. సోదర సహాయమువల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, లోహ, ఖనిజవ్యాపారస్థులకు, పోలీసుశాఖ ఉద్యోగులకు మేలుకాలము. 9 న ప్రమాదసూచన. 10 అధికఖర్చులు.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈవారము మీకు యోగదాయకము. ప్రయత్నించిన పనులు నెరవేరుతవి. ధనలాభము కలుగుతుంది. ఈశాన్య దిక్కునుండి క్షేమవార్త తెలుస్తుంది. శుభకార్యములలో పాల్గొంటారు. బంధుదర్శనము కలుగుతుంది. గణిత, జ్యోతిషశాస్త్ర చర్చలు జరుపుతారు. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, ఇత్తడి, కంచు వర్తకులకు లాభదాయకము. కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. 6, 7 కార్యసిద్ధి. 9, 10 అధిక ఖర్చులు.

ధనిష్ఠ [గా, గీ, గూ, గే]

ఈవారము మీకు శుభయోగము. ఆశించిన డబ్బు చేతికివస్తుంది. ఇంట్లో శుభకార్యాలకు ప్రయత్నములు చేస్తారు. పుణ్యకార్యాచరణ, ప్రభుత్వ సన్మానము, శాస్త్ర చర్చలు జరుగుతవి. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకుంటారు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు ఉపాధ్యాయులకు మేలుగా వుంటుంది. ఇంట్లో వున్న వారి అనారోగ్యమువల్ల కలిగిన ఆందోళన తొలుగుతుంది. పిల్లల లాభక్షేమములకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

శతభిషం [గో, సా, సీ, సూ]

ఈవారము మీరు తలపెట్టిన పనులలో జయము పొందుతారు. నీటిపై ప్రయాణము చేయవలసి వస్తుంది. బంధుమిత్రులతో వినోదములలో పాల్గొని మృష్టాన్న భోజనము చేస్తారు. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. ప్రత్తి, దూది, నూలు బట్టలు వెండి బియ్యము ద్రవపదార్థజనిత వస్తువులు క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. కవులకు గాయకులకు, కళాకారులకు నటీనటులకు మేలుకాలము.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈవారము మీకు యోగప్రదము ధనధాన్యవృద్ధి కలుగుతుంది. వివాహాది కార్యాలోచనలు ఫలప్రాప్తి పొందుతాయి ఇష్ట వస్తులాభము, పరోపకారమువల్ల కీర్తి కలుగుతవి. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము ఎక్కువ వాహనయోగము కలుగుతుంది. కవులకు, గాయకులకు కళాకారులకు నటీనటులకు యోగకాలము. ఉద్యోగస్తుల హోదా పెరుగుతుంది. 9,10 కుటుంబ కలహము.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఛా, ధా]

ఈవారము మీకు కార్యభారము ఎక్కువ వింతమాటలు వినుట పరాక్రమమువల ఘనత, ప్రయాణము ధనలాభము కనబడగానే జాగ్రత్త వహించుటముంచిది. ఉద్యోగస్తులకు స్వల్ప అనుకూలత. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. రాజకీయవాదులకు వారమంతా అలజడితో పాటు అనుకూలత 7,8 పిత్రువర్గ సహాయము, కార్యలాభము 9,10 అనారోగ్య సూచనలు.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈవారము యత్నకార్యసిద్ధికి ఆలస్యము కలుగుతుంది. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల ఆరోగ్యము చికాకు గలిగిస్తుంది. ఉద్యోగస్తులకు వనపర్వత ప్రాంతాలకు బదిలీ అయే సూచనలున్నవి. రహస్యములకు కనిపెటుటకు నియోగించబడుతారు. వారమంతా చికాకుగా వున్నా, వారాంతమందు అజ్ఞాత మిత్రుని సహాయమువల కార్యసిది కలుగుతుంది.

★

బాలసాహితి

★ యుక్తి ★

అనగనగా గ్రీసుదేశ
మందుండె ప్రపంచ వీరు
డపరిమిత పరాక్రముడని
ఖ్యాతిగొన్న హెర్క్యులిస్.
చిన్నతనమునందె యతడు
చేసెను సాహసము లెన్నొ
క్రూరజంతువుల గూల్చియు
ఘోర రాక్షసుల జీల్చియు.

అతని శౌర్యసంపద విని
ఆ దేశము రాజుగారు
సముఖానకు బిలిపించిరి
చనవుమీర నిటు బలికిరి.

"వీరాగ్రణీ! నీ యవక్ర
విక్రమక్రమంబెల్లను
వింటిమది ముదముపొదల
వినవోయీ మాదుముదల.

"బహుదూరపు ద్వీపములో
బంగరుఫలములు కాచెను
ఆపిలుచెట్టున్నదంట
మాపు రేపు దానివెంట—

"కాపు చేయునట పడగలు
చాపి నూరుతలల నాగు
ఆ ఫలములు మాకు నెట్టు
లైనా సరె తెచ్చిపెట్టు."

రాజునాజ్ఞ తలనిడి మృగ
రాజు తోలుమై నిడి వి
ల్లమ్ములు కైదండ నిడి మ
హావీరుడు వెడలెను వడి.

ఎవరి నడిగినా మార్గము
నెరుగమనియె చెప్పచుండ్రి
కడకు జడధి తీరస్థలి
కానుపించె నొక ముదుసలి.

"ఈ దారిని తిన్నగ నీ
వేగినచో 'అట్లాస్' అను
నతికాయుం డగుపించును
నతడు మార్గ మెఱిగించును."

అనువృద్ధుని మాటల క
త్యంతానందంబు నొంది
హెర్క్యులిస్సు నట్లే చని
యెదుట నొక మహాకాయుని,

కొండంతటి దేహము భూ
మండలి క్రుంగింప గగన
మండలి తలపై మోయుచు
మెండుగ డస్సి వగర్చుచు—

ఉన్న రాక్షసేశ్వరు గని
విన్నవించె తన కార్యము;
మన్ననమై రాక్షసుడును
మారుపలికె నీవరుసను—

"మార్గము నెరిగింపగ నే
మాయె, పరులు చొరలేరా
దీవి నేనొకండ తక్క—
తెత్తు ఫలము లేగి చక్క—

"ఈలోపల నీ గగనం
బీవు సుంత మోయు" మనిన
వీరవరుడు వల్లె యనెను
భారము మల్లించుకొనెను.

మూడంగల లో చెంగున
వాడు కడలి లంఘించెను.
ఏడే నిముసములలోన
నేతెంచెను పండ్లతోన.

కూష్మాండము లంత లేసి
కుందన ఫలములు జూడగ
హెర్క్యులిస్సు కుతుకభరము
హెచ్చిపోవ, గగన భరము—
కో కొమ్మన; రాక్షసుడును
"కొంచము తాళుము భాయీ!

మీ రాజున కీఫలమ్ము
లీరోజే యిత్తు లెమ్ము—
ఇన్నాళ్లకు బరువు తీఱి
ఈ స్వేచ్ఛ లభించె నాకు
ఆగుము మరికొంత కాల
మంతలోన తొందరేల?"

అన మన వీరునకు మతి త
నంతట నే పోయె గాని
యుక్తి తోచి వెనువెంటనె
భక్తి నటించుచు నిట్లనె.

"అబ్బా! తల నొచ్చెడు; సిం
హము చర్మ మమర్చుకొందు
కుదురుగ; నందాక నూ దయ
గొనుముగగనమార్ద్రహృదయ!"

నమ్మి రాక్షసుడు బరువును
నెమ్మి మార్చుకొనె మూఢుడు
యోధుడంత పండ్లందుక
ఉడాయించె వెనుజూడక.

ఎంతగ నట్లాస్ పిలిచిన
హెర్క్యులిస్ తిరిగి రాలే
దరచి యరచి యొకకొండగ
నాతడట్టె పడియుండగ,

నేటికి 'అట్లాసు' పేర
నిల్చెను గిరి దానిశిఖరి
జలదగర్జ హెర్క్యులిసును
పిలిచినట్లు యనిపించును.

శక్తి యెంతయున్న గాని
యుక్తిలేక పనిగాదను
సూక్తికి తార్కాణయౌచు
చోద్యం బీ కథ రహించు.

★ యస్. కోటయ్య ★

ఇది తెచ్చిన విజయము

ఎమ్. వి. ఎస్. ఆర్. కె. ప్రసాద్

పూర్వము ఒకరాజుదగ్గిర ఒక వికటకవి వుండేవాడు. అతని దగ్గిర పాండిత్యము లేకపోయినా చమత్కారమైన మాటలతో రాజుని, సభికులనూ ఆనందపరుస్తూండేవాడు.

ఒకనాడు రాజదర్బారుకి నాలుగు శాస్త్రములలో గొప్ప పాండిత్యము గల పండితుడు వచ్చాడు. ఇతని యెదుట ఇంతవరకు ఏ పండితుడూ నిలవలేకపోయాడు. ఈ సంగతి తెలిసి రాజు మన దర్బారులో ఇతనిని గెల్చే పండితుడే లేడని విచారిస్తుంటే సంగతి తెలిసి వికటకవి రాజుదగ్గిరకు వచ్చి 'ఈ పండితునితో వాదమునకు సెలవి'మ్మని కోరాడు.

అతనికి పాండిత్యములో ప్రావీణ్యము లేదని తెలుసికూడా అతని చమత్కార వచోరచనవలన అవతలపండితుణ్ణి ఓడించగలడేమో అన్న ధైర్యముతో వాదానికి సెలవిచ్చాడు రాజు.

అప్పుడు, వికటకవి పండితుడిని సమీపించి "అయ్యా! ఇది, యను శబ్దానికి ఎన్ని అర్థములున్నవో చెప్పండు" అన్నాడు. వచ్చిన పండితుడు ముందు తెల్లబోయి తర్వాత "ఇది, అనగా సమీపవస్తువు. ఇంతకన్న ఏమి అర్థము వుంటుంది?" అన్నాడు.

వికటకవి నవ్వుతూ, "ఇదా నీ పాండిత్యము? నవద్వీపములో నాలుగేండ్లు, కాశీలో ఎనిమిదేండ్లు చదువుకోగానే పండితుడనయ్యా ననుకున్నావా? 'ఇది,' కి అర్థము చెప్పలేని నీ పాండిత్యము తగలేయనా? నీ పాండిత్యము బూడిదలో పోసిన పన్నీరువంటిది. నీకు తెలియదని ఒప్పుకున్నావు కనుక, నేను చెపున్నాను విను. ఇది, అను మాటకు నూరర్థము లున్నవి; తిరిగి మాట్లాడితే రెండువందల అర్థము లున్నవి. మూళ్ళు మాట్లాడితే మూడువందల అర్థములువున్నవి. నాకు తెలిసినవే నాలుగొందల అర్థములున్నవి ఇప్పుడు తెలిసిందా ఎన్ని అర్థము లున్నవో?" అన్నాడు వికటకవి.

'ఇది' లో ఇన్ని అర్థాలు వున్నాయనగానే పండితుడు విస్మితుడయ్యాడు.

"నేనన్ని అర్థములు ఎన్నడూ ఎఱుగను. కనీసము నిఘంటువులో కూడ అన్ని అర్థాలు వుండవు" అన్నాడు హీనస్వరముతో.

★ ఇది తెచ్చిన విజయము ★

వెక్కిరించినట్లుగా నవ్వుతూ వికటకవి, "నిఘంటువులో లేనంత మాత్రాన దానికి అర్థమే వుండదనా నీ వుద్దేశము? నిఘంటువు వ్రాసినవారు సర్వజ్ఞులనుకున్నావా? 'ఇది' యనుశబ్దము కల్పవృక్షమువంటిది. అది అన్ని అర్థములకూ అన్వయిస్తుంది. చూడు కొన్ని వుదాహరణగా చెప్తాను.

'ఏమండి మీరు కొంచము ఇదిగా వున్నారు. మీ మొగమెంతో ఇది అయినట్లుంది. మీ శరీరములో ఇదిగా వున్నదా ఏమిటి? మీకు పనిఎంతో ఇదిగా వున్నది. ఎంత ఇది వున్నా అంత ఇది పనికిరాదు. కొంచము ఇదిగా వుండాలి లేకపోతే మనపని అనలే ఇది అయిపోతుంది. ఒట్లో ఇది వుంటేనే కదా ఏ ఇదయినాను. ఆ ఇది కాస్తా పోతే తరువాత ఏమి ఇదవుతుంది? మీ ఇదేమి బాగా లేదు. ఎవరి ఇది వారు చూసుకోవాలి కాని ఒకరి ఇది ఒకరు చేయగలరా? ఇందులో మీ రాజుగారి ఇది వున్నందునే మీరింత ఇదిగా వచ్చారు. ఆయన బొత్తిగా మీ మీాద ఇది పెట్టటము, ఏమంత ఇదిగా లేదు. అధికారులతో వచ్చే ఇది యింతే. మరొక ఇదయితే ఏదైనా చేద్దాము. శాస్త్రిగారూ! చూచినారా ఇది శబ్దానికి ఎన్ని యర్థములు వున్నాయో. మీ ఇది చూడగా నాకెంతో ఇదవుతున్నది.

ఇది మొదలుకొని ఇది అనగా ఏమిటో తెలుసుకొని కొంచెము ఇదిగా వుండండి."

ఈ విధంగా వికటకవి పండితుని మళ్ళా నోరెత్తకుండా ఓడించాడు. వికటకవి చతురతకు, రాజు, సభాసదులుకూడా ఎంతో సంతోషించారు. తమ గౌరవము కాపాడినందుకుగాను రాజు, వికటకవికి, పండితునకు కూడ ఎన్నో కానుకలు, కట్నాలు బహుమతులుగా ఇచ్చి సత్కరించాడు. ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం
[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక B

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో) ....

పుట్టినతేదీ, నెల, సంవత్సరం : జులై 1 నాటికి వయస్సు ....
తండ్రి, లేక, సంరక్షకుని పూర్తి పేరు : ....
ఊరిపేరు. జిల్లా, తాలూకా, పోస్టు [వీధి: నెంబరు] ....
* చదువుతున్న తరగతి, లేక, ఫారము ; ....
పాఠశాల పేరు : ....
ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) ;

ఆర్యా :

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొన ప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1959]

(సంతకము)

* మరా : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: 4-3-59 | ఈ దరఖాస్తు 7-3-59 నాటికి మాకు చేరాలి |

★ వాగ్దానం ★

(31-వ పేజీ తరువాయి)

కదా అని కోప్పడేసినందుకు ఒదినమాత్రం ఏమన్నది!

'యిదేమిటయ్యా! యిన్నేళ్ళొచ్చి యీ అబద్ధాలెందుకూ! నీకంత సాక్షి అయితే మొన్నటే ఖచ్చితంగా చెప్పరాదూ! తీసుకురావడం కోరతెస్తావా!' అనడిగిందికదా! ఎంత చెప్పినా నమ్మిందా? కాదోదినా' అంటే 'నీ పైలు నే నెరగనా' అని కొట్టి పారేసింది. సరి అక్కడితో యింట్లో ముద్ర పడిపోయింది.

వీధిలో సంగతి సరేసరి. కొందరు 'దగాకోరు' అని పేటెలిచ్చారు. 'కుక్క తోకపట్టి గోదావరీదినట్టే' అన్నారింకొందరు 'చలచిత్తం' అన్నారు మరికొందరు. ఇంకా కోపం వసేపట్టలేక వెనక వెనక తిట్టారు కూడా కొందరు. అయితే తను దేన్నీ అంతగా లక్ష్యం చేయలేదు. తన కవేవీ అంత కష్టాన్ని కలిగించలేదు. అయితే తన దృష్టిలో వీళ్ళంతా ఒకెత్తూ, రామావతారం ఒక్కడూ ఒకెత్తు అలాంటి రామావతారమే తనమీద అంత కఠినత్వం వహించడం నిజంగా బాధాకరమైన సంగతే. అలాంటిది జరుగుతుందని తానెప్పుడూ అనుకోలేదు. ఊహించనుకూడాలేదు. అందుకే యిప్పుడూహించుకున్నాడు. రామావతారం ఎంత వినిగతితే అంతిమాటన్నాడా అని. అదే ఆలోచించవలసిన విషయమే మరి. అంచాతనే బాగా ఆలోచించి యీ ఘోరనిర్ణయం చేసుకున్నాడు. ఎవరికీ తానింకెప్పుడూ ఎట్టి వాగ్దానాలూ చెయ్యకని. ఇంక దానికి తిరుగులేదనుకున్నాడు. అనుకుంటూ అనుకుంటూండగానే పురుక్కున మళ్ళీ ఆ వెధవపని చేశాడు. నోరు జారక నాలిక్కరుచుకుని, తొడుంబొక్ అనెందుకు వీల్లేని చిక్కది. అందులోనూ తానిప్పుడు వాగ్దానం చేసింది లాకాయి లూకాయ్ లక్ష్మీపతిక్కాదు. తనంటే యెంతో గౌరవిస్తూ, తనని గౌరవనీయుల్లో నమ్మకస్థులో ఒకడని నమ్ముతున్న ఒకఅబలకి గట్టివాగ్దానం చేశాడు. చెయ్యకతప్పని పరిస్థితాయె. ఏం చేయడం?

* * *

రాజేశ్వరికి తన గురించి అట్టే తెలియదు. తనకుమాత్రం ఆమె గురించి ఎక్కువేం తెలుసారేం! అసలు తెలుసుకోడానికైనా పెద్ద అవకాశమేదీ. తానసలు మొటమొదట రాజేశ్వర్ని చూడ్డం అన్నయ్య పెళ్ళిలో. ఆడపెళ్ళివారి తరఫున ఒచ్చిన చుట్టాలట. అటూ పోటూ కొద్దిగావచ్చు. అప్పటికింకా వాళ్ల స్వంతవూళ్లో చిన్నక్లాసు చదువులోవుంది. కాని మొగపెళ్ళివారిమీద పాటలు పాడి కప్పులు కటడానికి ఆ అమ్మాయిని వుసికొల్పారు. బాగానే పాడిందికూడాను. అది చూసి ఆడపెళ్ళివారిమీద తనో రెండుఅంటించాడు. అక్కడితో యిదరికీ తాత్కాలిక సంధి జరిగింది. అది జరిగికూడా ఇప్పటికప్పుడే ఎనిమిదేళ్ళవాటి ముచ్చట. చిన్న రెక్కలగౌను తొడుక్కుని, ఎర్రగా బక్కపల్చగా వుండే ఆ రాజేశ్వరికీ, మరోవన్నె పెరిగి, బాగాపొడుగెదిగి, చకచకా మాట్లాడే నేర్పు సంపాయించి, అనేక పావును చేర్చి చీరలు కడుతూన్న ఈ రాజేశ్వరికీ ఎక్కడా పోలిక లేదు.

కాలేజిలో చేరటానికని వారంరోజుల కిందటే యీవూరొచ్చింది రాజేశ్వరి. వాళ్ల పిన్నిగారింటో మకాం. వాళ్ళ బాబయ్య వెంకటాద్రిగారు కాలేజీలో కొత్తగా రెండేళ్ల కిందటే ప్రవేశించిన ఫిజిక్స్ లెక్చరర్. మంచి సాహిత్యాభిమాని. తనకెలాగో కొన్నాళ్ళుగా అతనితో పరిచయమై తీరిక సమయాల్లో వారింట్లో కూర్చుని మాట్లాడుకునే అలవాటయింది. అమన్య అలాంటి ఓ సందర్భంలోనే అకస్మాత్తుగా రాజేశ్వర్ని వాళ్ళింట్లో తనుచూడ్డం తటస్థించింది. ఆమె చటుక్కున గుర్తుపట్టి "మీరుభిలాకాదూ" అనడిగింది. తనూ పోల్చుకున్నాడు. "ఔను మీరుకూడా భిలానాకాదూ! ఇంతలా మారిపోతే పోల్చుకోడం సాధ్యమా!" అన్నాడు.

వెంకటాద్రిగారు యీపరిచయం చూసి మొదట ఆశ్చర్యపోయారు. అప్పుడే రాజేశ్వరి పాతసంగతులన్నీ ఓసారి రికార్డు వేసింది. వాళ్ల పిన్నిగార్నికూడా పిల్చి, పరిచయం చేసి. బంధుత్వాన్ని బయటపెట్టింది. ఆ తర్వాత తతిమ్మా విశేషాలన్నీ వెంకటాద్రిగారిద్వారా విన్నారు రాజేశ్వరీ తనూ. రాజేశ్వరికూడా సాహిత్యప్రియ, సంగీత శారద!

"ఈవూళ్ళో పుసుపోవడం కష్టంగా వుంటోందండీ. కాలేజీలో జాయినయ్యాకయితే పూచీలేదు. అంతవరకూ ఇబ్బందే. అంచాత వీలయినప్పుడల్లా రండి కాస్త" కోరిందికూడా.

ఈరోజు వుదయం కూడా అలాగా వెళ్ళి కాలక్షేపం చేసుకున్నారు తనూ, రాజేశ్వరీ, వాళ్ళపిన్ని. వెంకటాద్రిగారు వీధిలో కెటో వెళ్లారు. ఆమాటా యీమాటా వొచ్చి "సినిమాలంటేనూ పెద్ద సరదా" అంది రాజేశ్వరి.

తను పూరుకోవచ్చా. 'నాకూ అంతే. అవసరమైతే ఓపూట తిండయినా మానేస్తాను. కాని సినిమామాత్రం చూడకుండా పోనివ్వను" అన్నాడు కొంచెం అతిశయోక్తిగా.

రాజేశ్వరి నవ్వుతుంది.

"మీరో" అన్నాడు తారకం అక్కడేవున్న వాళ్ల పిన్నిగార్ని.

"మరీ అంతపిచ్చి నాకు లేదుసుమండీ ఏదో చూస్తాను" అందావిడ.

తను నవ్వేశాడు—

"అసలింతకూ "తుమ్సా నహీ దేఖా" చూశారా?' అన్నాడు. అదైనా మాటవరసకి. కాని దర్భపుల్లే నారాయణాస్త్రం ఔతుందనుకోలేదు.

"అబ్బే. లేదండి. ఇక్కడుందిట కదూ!" అంది రాజేశ్వరి చాలా వుత్సాహంగా.

పాడు జ్ఞాపకశక్తి! చటుక్కున స్ఫురణకొచ్చింది తమాషాగా.

"ఔను. మిలానిలో, కాని యీ వాళే లాస్ట్ సెట్," అని కూడా అందించాడు.

రాజేశ్వరి విలవిలా కొట్టుకుంది—

"ఏవిటండి, యివాళ్ళతో నే సరా. అరెరె! పిన్నీ బాబయ్యతో చెప్పు పిన్నీ! ఇవాళెలాగైనా వెళ్దాం...పిక్చరు చాలా బాగుంటుంది కదండీ" అన్నది.

"బాగుండడమా! గ్రాండ్ గా వుంటుంది. తప్పకుండా చూడవలసిన దౌను. ఇంతకన్నా యెక్కువేం చెప్పేది! అయినా చూడకుండా మీరోదుల్తారా!" అన్నాడు తను మందహాసం చేస్తూ.

"ఏమోనండీ. బాబయ్యగారు వస్తారో రారో చెప్పలేం. అదే ఒచ్చిన చిక్కు," అని నొచ్చుకుంది రాజేశ్వరి.

"ఏం ఆయన కంత యిష్టం లేదా!" అన్నాడు తారకం తన కెంతో యిష్టమని మరోసారి తెలియజేసేందుకు.

"ఇష్టం లేక కాదు. అయినా యీవాళ చాలా బిజీగా వున్నారేమో మరి," అందామె.

★ వాగ్దానం ★

ఇంకో తనలా ఉపేక్షించగలడు! ఉపేక్షిస్తే తనకు మర్యాద తెలీదనుకోరూ! అందుకే పాతవాతలు మర్చిపోయి చటుక్కున తను నోరు జారేశాడు:

"అదేమిటి రాజేశ్వరీ! యీ మాత్రం దానికే యింత బాధపడాలా! అయినా చెట్టంత మనిషిన్నేనుండ ఎందుకూ! సాయంత్రం మొదటాటకిపద్దాం. పిన్నిగార్ని తీసుకుని రండి. ఆరుగంటలకి మీరు రావొచ్చు. ముందుగా నేవెళ్ళి టిక్కెట్టు తీసుకుంటాను. ఏం అభ్యంతరం ఏముంది!" అన్నాడు అతిసునాయాసంగా వాళ్ళయితే అభ్యంతరం చెప్పలేదు.

కాని తీరా యింతా అనేశాక చాలా నొచ్చుకున్నాడు. తనే! అన్నందుకొక్కడుగాని ఆ మాట నిలబెట్టుకోగలడా లేదా అని, కాని పరిస్థితి యిప్పుడు చేతులు దాటింది. గోట్లో తల దూర్చాక యెలాగో నిగ్రహించుకోవాలి. కానీపోయినా యిది ఒకవిధంగా తనకు మంచికే వచ్చిందేమో. తన మీద పరిసరాల్లో ప్రచారంలో వున్న అభిప్రాయాల సంగతి రాజేశ్వరి దాకా రాలేదింకా. ఈ లోపునే తానెలాగైనా యీ మాట కాస్తా నిలబెట్టుకుంటే— రేపొద్దున్న ఏ రామవతారంగాడో వచ్చి తారకం యిలాంటి మనిషని చెప్పినా రాజేశ్వరి ఛస్తే నమ్మదు. పైగా ఒక వ్యక్తి దగ్గిర, అందులోనూ రాజేశ్వరిలాంటి యువతి చేత తను మంచి మనిషి అంటే అన్న మాట అక్షరాల జరిపేవాడని అన్పించుకునేందుకు యీ చాన్సు తప్పితే యింకోటి దొరకదు. అందుకే తనుగట్టిగా నిశ్చయించుకున్నాడు. తన మాట మన్నించి తప్పకుండా సాయంత్రం రమ్మనమని మరీ మరీ హెచ్చరించి యింటి దారిపట్టాడు.

* * *

ఈరోజు తారకనామం తన జీవితంలో చేయలేని యేదో ఘనకార్యం చేస్తూన్నట్టు ఫీలయ్యాడు. ఎటువంటి అంతరాయాలొచ్చినా తానీరోజు వాటిని తృణప్రాయంగా యెదుర్కోగలడు! భూనభోంతరాళాలు ఏకమయినా సరే, ఎవరడ్డొచ్చినా, ఎంత అవసరమైన పని ముంచుకున్నా తానీరోజు చేసే పని మాత్రం అదొక్కటే! రాజేశ్వరితో మొదటాట సినిమాకెళ్ళి ఆమె చాత "థాంక్స్" చెప్పించుకుని తన పరువు నిలబెట్టుకోవాలి! అందుకు విఘాతంగా ఏ మొచ్చినా తను ఖాతర్చెయ్యదల్చుకోలేదు. చెయ్యలేదు కూడానూ!

ఏ స్నేహితులింటికీ వెళ్ళలేదు. ఎవ్వరికీ యీ సంగతి చెప్పలేదు. మధ్యాహ్నం కోటీశ్వరరావు పేకాటకు రమ్మని బలవంతం చేసినప్పుడు కూడా రానని ఖచ్చితంగా చెప్పగలిగాడు. చివరికి వదిన సాయంత్రం బజారు పని పురమాయించినప్పుడుకూడా మొహమాటపడలేదు.

'ఏం కావల్సినా రేపొద్దున్నే' అన్నాడు

'ఇప్పుడేం చెయ్యాలి కనక' అంది ఒదిన.

'సినిమాకు వెళ్తున్నా' అన్నాడు. తానిలా ఎప్పుడూ చెప్పలేదు.

'నే వెళ్ళకూడదూ?' ప్రశ్నించిందొదిన.

'లేదు. యివాళతో ఆపిక్చరు సరి.'

'పోనీ రెండో ఆట.'

'లాభంలేదు. మొదటాటకి రమ్మని ఒకర్ని రమ్మని ఆహ్వానించాను. వాళ్ళు పాపం యెదురు చూడరూ!'

'అలాగా! అయితే సరే వెళ్ళు' అన్నది ఒదిన.

వదినకు మనసులోనే వెయ్యినమస్కారాలర్పించి గబగబా సినిమాహాలు చేరుకున్నాడు నాలుగున్నరకే. రూపాయి పావలా టిక్కెట్ల క్యూలో నించుని మరోసారి తన అదృష్టాన్ని స్మరించుకున్నాడు. నిజంగా తను అనుకున్న రోజున చేస్తానని చెప్పిన పని చేస్తున్నాడివ్వాళ.

లోపల మేటినీ అవుతోంది. హాలుబయట అక్కడక్కడా జనం గుంపులు గుంపులుగా గుమిగూడి వున్నారు. చిన్న చిన్న దుకాణాలు అక్కడక్కడా జల్లిన నువ్వులా వున్నాయ్. కొందరు ఆ దుకాణాలచుట్టూ చేరారు. తారకం మూడు ఫస్టుకాసు టిక్కెట్లు పిడికిట్లో గట్టిగా పట్టుకుని ఆపద్మవ్యూహంలోంచి బయటపడ్డాడు. నలుగురూ కన్పించే ఒక జంక్షను లో నిలబడి చూస్తున్నాడు. మేటినీ లాంగ్ బెల్ కొట్టేశారు. అంటే యింకో అయిదు నిమిషాల్లో లోపలి జనం బయటికొచ్చేస్తారు. బయటి వాళ్ళు లోపలకెళ్ళిన మరో పది నిమిషాలకి మళ్ళీ ఆట ప్రారంభం అవుతుంది. వచ్చీ పోయే రిక్షాలని పరీక్షిస్తున్నాడు తారకనామం. సమయంకూడా ఆరు గంటలు దాటుతోంది.

లోపలిజనం బయట పడుతున్నారు. ఓ యబ్బ! ఏం జనం! ఆడవాళ్ళూ మగవాళ్ళూ పుట్టలో చీమల్లా వస్తున్నారు. తను విస్తుబోయి చూస్తున్నాడల్లాగే ముందునుంచీ వెనకనించీ సాగిపోతూన్న వాళ్ళందర్నీ. అందరు హుషార్ గా కబుర్లు చెప్పుకుపోతున్నారు. రిక్షాల వాళ్ళు గంట కొడుతూ ఇటూ అటూ తిరుగుతున్నారు.

'ఏం రిక్షా' అన్నదొక శ్రావ్యమైనకంఠం.

తను చటుక్కున తిరిగి చూశాడు. తేలిపోతూన్న పాదాల్ని బరువుగా రెండడుగులు ముందుకేశాడు.

'ఓహ్. తారకం బాబుగారే పిన్నీ!' అన్నది అదే కంఠం. ఇద్దరు స్త్రీలు ఆగి తిరిగి చూశారు.

'మేట్నీ చూసివస్తున్నారా రాజేశ్వరీ?' అతికష్టంమీద మాటలు పెగిలాయి తారకనామానికి.

రాజేశ్వరి తెల్లని మొహం మరీ తెల్లనై పోయింది.


'క్షమించండి. నే నెంతో చెప్పాను. అయినా నామాట వాళ్ళు నమ్మలేదు. మాఁవయ్య మాట విని....

ఎవడీమాఁవయ్య?తనపాలిటిధూమకేతువు?

తారకం శాపగ్రస్తునిలా నిలబడ్డాడు.

'మధ్యాహ్నం వచ్చాడు. మీ గురించి మరేం కాదు...మీకెప్పుడూ ఏవో వెయ్యి వేపకాలనీ యేమిటో గొడవంతా...అతనికి మిమ్మల్ని బాగా తెలుసుట. అతనే నండీ మా రామవతారం మాఁవయ్య...ఇప్పుడిలా'

రొదచేసుకుంటూ పోతూన్న జనంలో అదృశ్యమైపోయాడు తారకనామం. ★



కందుకూరి లింగరాజు

సమర్పణ

11

వసుపతికి తండ్రి అంత అదరా బాదరా తిరుగు ప్రయాణం చేయడం! చిన్న పెదిలవల్ల శ్రీపతి తల్లక్రిందులై పోయేడని గబగబా వెళ్ళిపోవడం ఇష్టంలేదు. పైగా వెళ్ళినా శ్రీపతికి అతి శీఘ్రంగా ద్రోహం చేసినట్లే అవుతుందేమోనన్న అనుమానం కూడా లేకపోలేదు. ఏంచేసినంటే మొదటి నుండీ శ్రీపతి నాన్నగారు గీచిన గీటు దాటకుండా తయారయాడు. లేచి నుంచోమంటే నుంచోడం ఈ పని చెయ్యమంటే చెయ్యడం, వద్దంటే మానడం యిలా అతడు పెరిగినందువల్ల వ్యక్తిత్వం నశించిపోయింది; కేవలం ఒక ప్రదర్శనపు బొమ్మలా మరయంత్రంలా తయారైపోయేడు.

ఓ వేళ నాన్నగారు అక్కడకు వెళ్ళినా ఏమీ చెయ్యలేక, ఆ మొండి బాలుండలమన్నీ మనవడికి, మరింతగా ప్రకోపిస్తారన్నది కూడా సత్యమే. అందువల్ల ఎల్లాగైనా ఈ ప్రయాణం తను వూహించుకుని మనస్సులో నిర్ణయం చేసుకున్నట్లుగానే జరపాలనుకున్నాడు. పండరీపురం పండిత సభకు వెళ్ళి అక్కడనుంచి ఉత్తర దేశంలో పుణ్యక్షేత్రాలు చూసుకొని దేవతా దర్శనంచేస్తే భక్తి, ముక్తి అన్న ధోరణిలో పడ్డాడు.

వచ్చే కుంభమేళం దర్శించుకొని, సంగమంలో స్నానంచేస్తే మంచిదనిపించింది. ఇన్నాళ్ళుగా తనను లోలోపల బాధిస్తున్న సంతానవాంఛ ఫలించి శ్యామల కడుపున ఓ పసికందువ కలుగవచ్చుననే ఆశ జనించింది.

ప్రయాణం మొదలు పెట్టేటప్పుడు "సింహాచలం కూడా వెళదామురా" అన్న మాటలతో దేవాలయంలో వున్న సంతాన ప్రాప్తి స్తంభం జ్ఞాపకం వచ్చింది. సింహాచలేశ్వరుడివద్దకు తన భార్యను కూడా తీసుకువస్తానని చెప్పే గుండె ధైర్యం అతడికి లేకపోయింది. అడుగుదామనుకుంటే అప్పుడే నీకు సరి సమేతంగా పండితసభలకువెళ్ళే తొందరేమిటిరా అబ్బీ అనేస్తారేమో అన్న భయం ఒకటి అడ్డువచ్చింది.

తన కళ్ళలోకి జాలిగా చూచిన భార్యకు "వెళితే దేవుని ప్రసాదం తీసుకువస్తాలే" అని జవాబు చెప్పి తృప్తిపరచగలిగాడు.

ఉల్లాం సభలకు కాశీ, ప్రయాగ, మొదలైన ప్రదేశాలనుండి వచ్చిన ఉద్దండులను కలుసుకున్నప్పుడు మాటల ధోరణిలో వాళ్ళు పండరీపురం వెళ్ళుతామని చెప్పడంవల్ల ఈ లోగా దగ్గరలో వున్న పూరీ, అరసవిల్లి, శ్రీకూర్మం వెళ్ళి - సముద్రస్నానంచేసి వెళ్ళవచ్చునన్న ఉద్దేశ్యం వెల్లడించడంవల్ల ఎల్లాగైనా ప్రయాణం మాన్పించాలన్న ఆవేశం అతడికి ఎక్కువైపోయింది.

అమ్మతో ప్రస్తావించేడు. గత రెండు, మూడు వత్సరాలనుంచే ఆవిడ రావడం ప్రారంభించింది. అంతవరకూ గడపైనా దాటి ఎరగదు. ఏ పుట్టింటికో పుట్టినరోజుకి ఓసారి వెళ్ళి వచ్చినట్లు తప్ప మరెక్కడికీ వెళ్ళి ఎరగదు. ఆవిడ చూచిన పెద్ద వూరు ఒక్క రాజమహేంద్రమే. ఇంకోటి చూడనేలేదు. నిత్యం సంస్థానానికి వెళ్ళి వచ్చి అలవాటు ప్రకారం చెప్పే విషయాలతోపాటు, ఆ రోజు పండితుల చర్చలు, పుణ్యక్షేత్రాల ప్రసక్తి వాటి మహిమలు, అక్కడి పురాణగాథలు వగైరా అన్నీ చెపుతూ సంగమస్నానం మహత్తును కూడా చిలవలూ పలవలూ చేర్చి వర్ణించి చెప్పేడు.

అన్నీ విని ఉత్సాహం ఇనుమడించగా సంబరపడి పోయింది తల్లి. క్షణంసేపు ఆయా స్థలాలలో తను యాత్రచేస్తున్నట్లు, దేవుళ్ళకు పూజలు చేయిస్తున్నట్లు తాదాత్మ్యం పొందింది. ఆమెకి ఆయన్ని ఎల్లాగైనా ఒప్పించాలన్న ధైర్యమూ కలిగింది. ఉత్సాహ ప్రోత్సాహాలు పెనవేసుకోగా ఆమె సంతోష పరవశత్వంలో సాక్షాత్తూ పార్వతీదేవే అయింది.

"నాన్నగారికి, చాలా ఘనంగా సన్మానించేరు ఈ సంవత్సరం. అర్ధశెయ్యన్నూట పదహార్లు ఇచ్చేరని విన్నా."

"అంతడబ్బే!" అంది అమాయకత్వంలో పార్వతి. పుట్టి పెరిగినప్పటి నుండి రూపాయి బిళ్ళ సరిగా చూచి ఎరుగని అమాయకురాలు.

"అంచేత నువ్వు చెపితే... పట్టుపడితే.." అని మధ్యలో ఆగిపోయేడు వసుపతి.

"వింటారుటగా! మొండిఘటం!" అంటూ గోడకు చేర్లబడింది.

దింతో వెన్ను విరిగినట్టయ్యింది వసుపతికి.

ఈ సభల్లో తను అగ్రపీఠం పదహార్ల శాఖలో వుండిపోయేను...కాని అక్కడికి వచ్చిన హేమాహేమీలైన పండితులకంటె తను ఏమీ తీసిపోలేదు అనే విషయం నిర్ధారణ చేసుకో



సమర్పణ

కలిగితే, అక్కడికి వచ్చేవారందరి స్థాయి ఒకటే అవుతుంది.

వారిలో ఎల్లాగైనా గొప్పవాడనిపించుకుని, జ్యోతిష శాస్త్రంలో ఉపజ్ఞ కనబరచ గల్గితే శాశ్వత శాలువా పుచ్చుకోగలనన్న ధైర్యం అతడికి కల్గింది. అది ఇప్పుడు చూస్తుండగానే. చేతులు జారిపోవడంవల్ల కొంత బాధ కలిగింది.

అటు తండ్రి సాయంత్రపు పూజానుష్ఠానానికి వెళుతుండగా, తను బజారున పడ్డాడు. ఒకళ్ళిద్దర్ని ఆ జ్యోతిరాహుల్ని కలసి అన్ని విషయాలూ విపులీకరించలేదు.

ఆ రాత్రి తమతో పాటు పూరీ జగన్నాథం వైపే అందరూ ప్రయాణం కావడంతో పశుపతి పని కోటలో పాగా వేసినట్లయింది.

కూర్చుని తండ్రి చెపుతుంటే పశుపతి గ్రామీణ పరిస్థితుల్లో చెయ్యవలసిన విధానం మొదలు సూర్యరాజు, రంగాచారి, రెడ్డిలకు చెప్పవలసిన విషయాల వరకు, ఇల్లు జాగ్రత్త విషయం మొదలు నిత్యాగ్నిహోత్రం ఆరిపోనియ్యరాదని చేయవలసిన ఆదేశం వరకూ శచి, శ్యామల, కాంతమ్మలు జాగ్రతగా వుండాలని హెచ్చరిక చేస్తూ ఉత్తరం వ్రాసేడు.

పునః చదివినప్పుడు హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి.

“ఓ రేయి, దేవీ కళ్యాణం వచ్చే నెలలో వస్తోంది. అప్పుడు వచ్చిన రంగనాయికకు సభలో తాంబూలం ఇవ్వడం మనవిధి. దాని కోసం నా తరఫున శాలువచాలు ఇవ్వమని కూడా వ్రాయరా!” అనికూడా చెప్పాడు.

రంగనాయిక మాటెత్తేటప్పటికి పార్వతి చిరునవ్వుతో లేనికోపం నటిస్తూ “పుణ్య తీర్థాలకు బయల్దేరినా, దాన్ని మాత్రం మర్చిపోలేరు మీరు!” అని చురుక్కున అంటించింది.

సోమయాజులు సమర్థిస్తున్నట్లు కవబడని స్థాయిలో “అది నాదగ్గర కావ్యాలు నేర్చుకుంది. కూచిపూడిలో నృత్యం నేర్చుకుంది. విజయనగరంలో సంగీతం. అది చదువుల మహాలక్ష్మి తెలుసా? నీకు మల్లే శేధ్యం కాదు!” అన్నాడు.

“ఆ చెప్ప వచ్చేరు! మీ నాయనగారు దానితల్లికి కన్నెరికం చేసేరని చెప్పుకోరేం?”

నోరు మూసుకున్నాడు సోమయాజి.

పశుపతి మాత్రం, అప్పుడప్పుడు రామచంద్రపురం వెళ్ళినపుడు అది కన్పించి, చేసే మర్యాద లన్నీ జ్ఞాపకం రాగా “ఎంత వినయం, విధేయత. గౌరవం నామీద చెల్లాయికి!” అని మురిసి పోయేడు.

—ఇంకా వుంది]

★ జీవనకేళి ★

(19 వ పేజీ తరువాయి)

అడ్డంకుల్ని ఎదుర్కొన్నాడు. ఈనాడు అంతర్యంలో రేగుతున్న గుంజాటనని ఎదుర్కోవలసివచ్చిందా అతడికి? చావుకుసిద్ధమైవున్న సేన్‌దీదీని చూస్తున్నా కూడా శశి మనస్సులోని నిస్పృహ తొలిగిపోలేదా? అంతా అతడిచేతిలో ఉంది. ఆ ఇద్దరిప్రాణాలు అతడిచేతిలో ఉన్నాయి. చేయలేనిదేముంది శశికి? సేన్‌దీదీనే కాదు. ఆమెకి పుట్టబోతున్న శిశువునికూడా భూమ్మీద నిలవకుండా చెయ్యగలడు! ఎందుకు జరిగింది అని ఎవరూ అడిగేందుకు అవకాశంకూడా ఉండదు. శశి మనుషుల్ని బ్రతికించటమే నేర్చుకున్నాడు కాని చంపటం నేర్చుకోలేదా? అతిసులభంగా, ఏదో యథాలాపంగా ఉండి పొరపాటు చేసినట్లు చేసినా చెయ్యగలడు. అందుకై మిగిలిన జీవిత మంతా విచారించవలసి వస్తుందా శశికి?

తెల్లవారకట సేన్‌దీదీకి ఓ పిల్లవాడు పుట్టాడు. తెలతెలవారుతూండగా సేన్‌దీదీ చచ్చిపోయింది. సేన్‌దీది ఇంత దుర్బలురాలు. ఆమె హృదయకోశం ఇంత దుర్బలమైందని మొదటిసారిగా పరీక్షించి నప్పుడు నమ్మ శక్యంకాలేదు. ఆమె శరీరం ఇంతలో చెడిందని సేన్‌దీదీని చూసినప్పు డెప్పుడూ తోచనేలేదు. 'అయినా ఆమె ఈ గండంగడిచి బయటపడదు అని శశి అనుకోనేలేదు. డాక్టరతడు. అయినాకూడా అతడు సరీగ్గా తెలుసుకోలేకపోయాడు. మళ్ళీ స్పృహ తప్పి ఉన్న స్థితిదాటి ఆమె ప్రశాంతంగా నిద్రపోవలసిన సమయానికి హఠాత్తుగా కాళ్లూ చేతులూ చల్లబడ్డాయి, ఎందుకనో!

ఇలా అవుతుందని శశి యెరుగు. మానవదేహంలో ఇలాంటి విపర్యయం ఏదైనా సంభవిస్తే అది ఈ యుగంలోని ధన్వంతరుల తెలివికి అంతుపట్టనిదిగానే ఉంటుంది. శరీరం మానవనిర్మితమైన యంత్రంకాదు. ఏమయినా జాగరణ చెయ్యటం మూలంగా శశి కళ్లుబాగా ఎర్రపడిపోయాయి. చెప్పలేనంత నీరసంగా ఉంది అతడికి. ఇంక చేసేందుకేంలేదు. శశి ఇంటికివచ్చి స్నానంచేసి ఓ కప్పు టీ త్రాగి పడుకున్నాడు. వచ్చే ముందు ఆ యింటిబయట గోపాల్‌ని చూసే వచ్చాడు.

తాను ఎరిగి ఉన్న యిళ్లలో ఇద్దరు ముగ్గురు చనిపోవటం ఎలా చూశాడో, అలాగే వారి యిళ్ళలో ఇద్దరు ముగ్గురు పుట్టటంకూడా చూసి ఉన్నాడు శశి. నలుగురు చస్తూ ఉండటం-నలుగురు పుడుతూ ఉండటం ఇదే ప్రాపంచిక నియమం. అయినా ఆ చావులు-చావుని గురించి చదివిన డాక్టరు శశిని విచలితుణ్ణి చేస్తూనే ఉంటాయి. చచ్చిపోయేవాళ్ళందరూ అతడికి పరిచితులు. స్నేహమో ద్వేషమో వాళ్లతోటిది చిరకాలసంబంధం. పుట్టేవాళ్ళంతా అతడికి అపరిచితులు. ఈ సంగతులే ఆలోచిస్తున్నాడు శశి. తాను మరోకమందు ఇచ్చి మరోక విధంగా ప్రయత్నించి ఉంటే సేన్‌దీదీ బ్రతికేదేమో! చివరికతడు కంగారుపడి యిచ్చిన ఇంజక్షన్లు రెండూ రోగికి ప్రమాదంతెచ్చిపెట్టాయా? దాని కతడితప్పు ఏమీలేదు. ఎంతో ఆలోచించి మరీ ఇచ్చాడా ఇంజక్షను. అప్పుడిక అంతకంటె చెయ్యకలిగిందేమీ లేదు. తన బుద్ధికి తోచిందేదో చేశాడతడు. అంతకంటె ఏం చెయ్యగల డతడు? ఇప్పటివరకు అతడెంతమందిని బ్రతికించలేదు? అది మాత్రం లెఖ్ఖలోకి తీసుకోవద్దూ?

గోపాల్ ఇంచు మించు మారిపోయినటయినాడు. అతడిలా మారిపోవటం, అది నలుగురికళ్లలో పడటం శశికి చాలా తలవంపులుగా ఉంది. గోపాల్ మొదట్నుంచీ భోజనప్రియుడు. ఇప్పుడతడికి అన్నహితవు తప్పింది. ఎప్పుడూ ధూం ధాంలు చేస్తుంటే అలాంటివాడి నోటిమీదుగా పరుషవాక్యమనేది రావటంలేదిప్పుడు. బయటివైపు గదిలో విచారంగాకూర్చుని, హుక్కా త్రాగుతూ ఉంటాడు. అవసరమయినవీ, అనవసరమయినవీ కాయితాలు తిరగేసుకుంటూ ఆ కాయితాలింతవరకు గోపాల్‌కి నవలలు, నాటకాలంత ప్రియమైనవిగా ఉండేవి. ఇప్పుడతడికి వాటిమీద ధ్యాసనిలవకపోయినా, అలవాటైనపని కనుక అందులో మునిగి కాలంగడపటానికి ప్రయత్నిస్తున్నాడు. శశి కిదంతా చాలా ఆశ్చర్యంగా కన్పించింది. శశి జీవితంలో తలవని తలంపుగా సంభవించినదాంట్లో - గోపాల్ ప్రవర్తనలోని అమర్యాదకరమైన ఈ సంఘటనే అన్నిటికంటె విస్మయకరంగా ఉంది.

గోపాల్ - శశి అసలు మాట్లాడుకోవటమే అంతంతమాత్రం. ఇద్దరి ప్రపంచాలు ఈ సంఘటనలో మరింత వేర్వేరు అయిపోయాయి. ఓనాడు గోపాల్ హఠాత్తుగా "మీసేన్‌దీదీ ఎందువల్ల చచ్చిపోయింది శశీ?" అని అడిగాడు.

"గుండె బలహీనంవల."

"మొదట్లో కనుక్కోలేకపోయావన్నమాట అది నువ్వు?"

"మొదట్లోనే కనుక్కున్నాను"

అయితే మరి చచ్చిపోయిందేం?

"ఇలా అడగటంతో శశికి చటుక్కున కోపంవచ్చేసింది." "ఈ రోగాన్ని మొదట్లో కనుక్కున్నా మనుషులు చచ్చిపోతూంటారు."

"బహుశా ఆ యింజక్షన్లు ముందుగా యివ్వకపోవటం మూలంగానేమో -"

ఈమాట ఒకటేఅని, శశి సమాధానం ఏంచెపుతాడోఅని గోపాల్ ఉత్సుకతతో ఒక్కక్షణం ఎదురుచూశాడు. అతడు ఏ సత్యాన్ని తేల్చివేయాలనుకుంటున్నాడో ఎవరికి తెలుసు? శశి నిర్విణ్ణుడైపోయాడు. తరచి తరచి తన చికిత్సలోని మెలకువ లన్నీ పసికట్టేసి ఉండొచ్చు గోపాల్. ఏమనుకుంటున్నా డతడు? డాక్టరయిన కొడుకువిషయమై అంతర్యంలో ఏమనుకుంటున్నా డతడు? శశి ముఖం నల్లబడిపోయింది. ఏం మాట్లాడటానికీ ధైర్యంచాల్లేదు.

"సమయానికి రెండు కస్తూరిమాత్రలు తగిలించి ఉంటే"- అన్నాడు కృపానాథ్.

ఈ మాటతో శశి ఇహ మెదలకుండా లేచి వెళ్ళిపోయాడు. కోపమూవస్తోంది, జాలీవేస్తోంది శశికి. సంసారి, వ్యవహర్త, వయసుమళ్ళినవాడూ అయిన అతడికేమిటీ క్షుద్రతనం! "మామయ్య అలా అయినా దేమిటి శశిదా?" అని అడిగింది కుంద. ఆ పేటుతో ఆదుర్దాతో అడిగిందామె ఆ మాట! కుంద కొడుక్కి ఒకసారి చాలా జబ్బుచేసింది. శశి ఎంతోకష్టపడి ఆ పిల్లవాణ్ణి బ్రతికించాడు. కుందకి తమయింట్లో ఒక గదీ ఇచ్చారు. గృహనిర్వహణా బాధ్యత అప్పగించారు కొంత. వాచాల అయిన కుంద దాంతో పూర్తిగా మారిపోయింది. ఒకొక్క స్త్రీకి ఎన్నో మామూలుకోరిక లుంటాయి. అవి నెరవేరకపోయేసరికి వాళ్ళలో ఓర్వలేనితనం రెచ్చుతుంది. కుంద ఏమయినా మొత్తానికి మంచిదే అన్నభావం కద్దు శశికి. తన పనుల్లో మునిగితేలటం ఎక్కువవటంమూలంగా శశికి ఈమధ్య సింధు విషయం పట్టించుకోటానికి తీరిక ఉండటంలేదు. కుంద సింధుని ఆప్యాయంగా చూస్తూవుండటం శశికి చాలా ఆనందంగా ఉంది. కుంద ప్రశ్నకు జవాబుగా "నాకు తెలియదు కుందా!" అన్నాడు శశి.

"మీరు పెళ్ళి అదీ చేసుకోనందుకు నిన్న మామయ్య విచారాన్ని వెలిబుచ్చారు."

"నాన్న విచారించారా? ఆయన ఎదుట మళ్ళీవిచారించారా?"

కుంద కొంచెం నవ్వి—"మేము ఇద్దరమూ విచారించాం" అన్నది.

[ఇంకా వుంది]



వనితాలోకం

దేశంలో అంధులకు సహాయం

పూర్వం భారతదేశంలో అంధులకు ఎలాటి గౌరవం ఇవ్వబడిందో ఎంతటి ఆదరణ, సహాయం లభించాయో ఉదాహరణ సహితంగా చెప్పలేం. పూర్వం అంధులు ఆయా విద్యలలో ప్రజ్ఞాప్రాభవాలు గడించడానికి ఏ పరిస్థితులు దోహదం చేశాయో బాగా తెలియదు. వర్తమానంలోని అంధజనసేవకు కొంత కృషి జరుగుతోంది. తెలిసిన వివరాలనుబట్టి మన దేశంలో అంధుల సంక్షేమానికి ప్రథమంగా జరిగిన ప్రయత్నం 1889 లో. అప్పుడే "అమృతసర్"లో గ్రుడ్డివారికై ఒక పాఠశాల నెలకొల్పారు. కాని ఈ స్కూలు కేవలం స్త్రీలకోసం మాత్రమే. మిస్. ఏనీషార్ప్ అనే ఆంగ్ల మహిళ ఈ పాఠశాల సంస్థాపకురాలు. దీని పేరు "షార్ప్ మెమోరియల్". దక్షిణ భారతంలోకూడా అంధుల కొక కేంద్రం ఏర్పాటు చెయ్యాలని కొందరు పట్టుబట్టారు. దీని ఫలితంగా 1890 లో పాలంకోటా అనే చోట "చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ మిషనరీ సొసైటీ" విధానాన్ననుసరించి ఒక పాఠశాల స్థాపించబడింది.

1897 లో లాల్ బిహారీషా కలకత్తాలో "కలకత్తా స్కూల్ ఫర్ దిబ్లయిండ్" అనే దాన్ని నెలకొల్పారు. దీనికిముందు ఎన్ని అంధపాఠశాలలు నిర్మించబడినా అవి ఏదో ఒక పూర్వ నిర్మాణంమీదనే ఆధారపడి ఉండేవి. కాని ఈ సంస్థ ప్రారంభం చాలా ఆకస్మికంగా జరిగింది. దీనిని గురించిన కథ ఇది:

ఒకసారి లాల్ బిహారీషా కాలేజికి వెళ్తూండగా రోడ్డుమీద ఓ గ్రుడ్డిపిల్లవాడు దారి కనిపించక తడుముకుంటున్నాడుట. వెళ్ళవల్సిన చోటికి వెళ్ళలేక మధ్యలో పడిపోతున్నాడుట. వంటికి చాలాచోట్ల దెబ్బలు కూడా తగిలి రక్తం కారుతోందట పాపం.



అంధులకు కూడా చదువుకొనే సదవకాశం అదృష్టం కల్పించడానికి 'బ్రెయిలీ' లిపి కనిపెట్టిన అంధమహిళ హెలెన్ కెల్లర్

ఆ దృశ్యం చూసి బిహారీలాల్ యువక హృదయం కలిగి పోతుంది. ఆ పిల్లవాణ్ణి వెళ్ళవలసిన చోటుకు దిగబెట్టి వచ్చారుట. కాని కాలేజీ చేరుకునే సరికి చాలా ఆలస్యమయిపోతుంది, ప్రొఫెసర్‌కి కోపం వచ్చి మాటలన్నాడు. బిహారీలాల్ జరిగిందంతా చెప్పినా ప్రొఫెసర్ ఏ మాత్రం చలించలేదు సరికదా బిహారీని క్లాసునించి పంపించివేశాడు.

పై సంఘటన బిహారీలో కొంత పరిణామం తీసుకు వస్తుంది. తన జీవిత పర్యంతం నేత్ర విహీనులసేవ చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడుట లాల్ ప్రతిజ్ఞా ఫలితమే కలకత్తా స్కూల్‌కి పునాది వేసింది.

దీని తర్వాత బొంబాయిలో "అమెరికన్ స్కూల్ ఫర్ ది బ్లయిండ్" వెలిసింది. దీని వర్తమాన నామం "దాదర్ స్కూల్ ఫర్ బ్లయిండ్ గర్ల్స్" తరవాత "విక్టోరియా మెమోరియల్ స్కూల్ ఫర్ ది బ్లయిండ్" ఏర్పాటు అయింది.

పై సంస్థల స్థాపన తరువాత మన దేశంలో అంధులకోసం చాలా పాఠశాలలు నెలకొన్నాయి. నేడు దేశంలో ఇంచుమించు ఎనభైఆరుస్కూళ్ళు గ్రుడ్డివారి కున్నాయి. వీటిలో సుమారు మూడు వేలమంది విద్యార్థులకు విద్యా సౌకర్యాలు ఉన్నాయి. ఈ సంస్థల్లో చాలా వాటికి వివిధరాష్ట్ర ప్రభుత్వాలనించి ఆర్థికసహాయం లభిస్తోంది. కొన్నిటికి కేంద్రప్రభుత్వం తోడ్పడుతోంది.

యుద్ధంలో గాయపడి నేత్రాలు కోల్పోయిన సైనికులకు జీవనోపాధి కల్పించడంకోసం "సెయింట్ డన్‌స్టన్స్" అనే సంస్థ 1943 లో డెహరాడూన్‌లో స్థాపించబడింది. ద్వితీయ ప్రపంచ యుద్ధంలో గాయపడ్డ అంధసైనికులే దాంట్లో తీసుకోబడేవారు. సుమారు మూడువందలమంది అంధసైనికులకు ఈ సంస్థద్వారా శిక్షణ-భృతి సమస్య తేలికయింది.

స్వతంత్రం వచ్చిన తరువాత 1950 జనవరిలో ఇది భారతప్రభుత్వం అధ్వర్యంలోకి వచ్చింది. ఇప్పుడు ప్రతి అంధపౌరుడికీ అందులో స్థానముంది. చక్కటి విద్య, సదుపాయాలవల్ల ఈ సంస్థ దేశీయులకే కాక దూరదేశాలవార్నికూడా ఆకర్షిస్తోంది. ఇక్కడ తూర్పు ఆఫ్రికాలోని ఇద్దరు విద్యా

(64-వ పేజీ చూడండి)

రెబ్బాప్రగడ సుబ్బలక్ష్మి
(కొవ్వూరు)

కుటుంబ నియంత్రణ ఉద్యమ వ్యాప్తికి

మహిళలు ప్రచారం చేయాలి

పల్లెపట్టులలో నివసిస్తున్న కోట్లాది ప్రజలకు కుటుంబనియంత్రణంగురించి తెలియాలంటే భారీఎత్తున ప్రచారం జరగాలి. చదువు రానివారికీ, వచ్చినా వార్తాపత్రికలూ పుస్తకాలూ చదివే తీరుబాటు, ఓపిక లేనివారికీ దీని మంచిచెడ్డలు, సాధకబాధకాలూ తెలియాలంటే అందుకు మహిళలే ప్రచారం చేయవలసిఉన్నది అని కుటుంబనియంత్రణ సమస్యపై ఢిల్లీలో జరిగిన గోష్ఠిలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు టి. టి. కృష్ణమాచారి గారు చెప్పారు.

ఈ గోష్ఠి ఫిబ్రవరి మూడోవారంలో జరిగింది. అంతర్జాతీయ కుటుంబనియంత్రణ సమాఖ్యవారు దీనిని ఏర్పాటుచేశారు. 22 దేశాలనుండి ప్రతినిధులు వచ్చి అక్కడ ఈ సమస్యను చర్చించారు.

దేశానికి జనాభా సమస్య; కుటుంబానికి అందులోని సభ్యులు సమస్య. ఈ సమస్య మన ఒక్క దేశానిదే కాదు. ప్రపంచ సమస్య అని పెద్దలు అన్నారు.

ఆస్ట్రేలియా, కెనడా, బ్రెజిల్ వంటి కొన్ని దేశాలలో జనాభా తగినంతగా లేని మాట నిజమే. చైనా, రష్యావంటి దేశాలకు కూడా జనాభా పెరుగుదల సమస్య కాదు. అలాగే విశాలమైన భారతదేశంలో జనులు నివసించని భూమి ఎంతో ఉందనీ, ఇంకా కొన్నికోట్ల జనానికి తావుందనీ కేవలం వైశాల్యం ఆధారంగా చూసేవారు అంటారు. కాని అన్నవస్త్రాల సమస్య, సాగుకు లాయకీ అయిన భూముల లెక్కలూ పరిశీలిస్తే సగటున మనిషికో ఎకరం భూమికూడా ఉండదు. దీనికి తోడు సాలుకు 60 లక్షల జనాభా పెరుగుతుంది. శతాబ్దం ముగిసేసరికి మన దేశం జనాభా 75 కోట్లకు పెరుగుతుంది. (ఇప్పుడు 40 కోట్ల జనం మనం) పోను పోను ఈ సమస్య ఏ రూపం ధరిస్తుందో తెలుసుకోవడానికి ఊహాగానాలు అక్కరలేదు. లెక్కలు చేస్తే చాలు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారత ప్రభుత్వం నాలుగేళ్ళ క్రితం కుటుంబ నియంత్రణ ఉద్యమం ఆరంభించింది.

* * *

ఢిల్లీలో జరిగిన సభలో ప్రసిద్ధ బ్రిటిష్ శాస్త్రజ్ఞుడు సర్ జూలియన్ హక్స్లీ భారతీయ అణుశాస్త్రజ్ఞుడు డా॥ హోమీ భాభా మొదలగువారంతా ఉపన్యాసాలు ఇచ్చారు.



కుటుంబ నియంత్రణ ఉద్యమాన్ని నడిపే సంఘాల కార్యక్రమానికి స్థూలంగా మార్గాలు సూచించి సారథ్యం నిర్వహించే అంతర్జాతీయ సమాఖ్యను స్థాపించిన మహిళ—శ్రీమతి మార్గరెట్ శాంగర్.



శ్రీమతి ధన్వంతిరామారావు. భారత కుటుంబ నియంత్రణ సంఘానికి, అంతర్జాతీయ సమాఖ్యకు అధ్యక్షురాలు.

భారతదేశానికి జనాభా సమస్య తీవ్రస్థితికి వచ్చిందనీ, దీన్ని సకాలంలో పరిష్కరించుకోనకపోతే దేశానికి రాజకీయంగానూ, సాంఘికంగానూ కూడా విపత్తు కలుగుతుందనీ జూలియన్ హక్స్లీ హెచ్చరిక చేశారు. ఆర్థికంగా కూడా, జనాభాను అదుపుచేయడానికి పెట్టే పెట్టుబడే అత్యంత లాభకరమైనది అని ఆయన చెప్పారు.

సంతాన నిరోధానికి మందులు ఉన్నాయి కాని, వాటిని దేశంలో అందరికీ—అరు లక్షల గ్రామాలలో పడ్డుకుని ఉన్న ప్రజానీకానికి అందచేయడం ఒక సమస్య. కాగా ఆ మందులను క్రమంగా, ఒక పద్ధతిలో జాగ్రత్తగా వేళపట్టున పుచ్చుకోవాలి. ఇదంతా అందరికీ తెలియచేయడం సాధ్యం అయ్యేపనిగాదు. అని డా॥ హోమీ భాభా అన్నారు. ప్రస్తుత సమస్యను ఎదుర్కోవడానికి గర్భనిరోధం పూర్తిగా సాధించాలని లేదు గర్భధారణావకాశాలు నూరింట 30 వంతులు తగ్గించగలిగితేచాలు. దీనికి, ఏదైనా ఒక ఔషధం కనిపెట్టి, దానిని ప్రతిరోజూ నిత్యంతినే ఉప్పులోనో పప్పులోనో, లేదా అన్నంలోనో కలిపి వేసే పద్ధతి ఏర్పాటుచేసి ఈ లక్ష్యం సిద్ధించవచ్చు.

“నేను చేసిన ఈ సూచనవిని చాలమంది ఇది చాలాఘోరం అని నిరసించవచ్చును. అయితే వాస్తవ పరిస్థితులను క్రమంగా పరిశీలించమని వారికి నా మనవి” అని డా॥ భాభా ఆ సభలో చెప్పారు.

మనదేశంలోఉన్న నూరుకోట్ల కుటుంబాలలో స్త్రీ పురుషులకు ఈ సమస్య మంచి చెడ్డలూ సాధకబాధకాలూ బోధపడాలంటే, దీన్నిగురించిన వివరాలు తెలియాలంటే అందుకు మహిళలు పూనుకోవాలని టి. టి. కృష్ణమాచారిగారు చెప్పారు. తెలిసిన వాళ్లు వ్యక్తిగతంగానూ, చిన్న చిన్న సభావేదికల ద్వారాను తాము ఎరిగినవారికి చెప్పవచ్చునని ఆయన సూచించారు.

కుటుంబనియంత్రణపై ప్రచారం ఉధృతంగా సాగించాలనీ, ఆస్పత్రులన్నిటిలోను దీనికై ఒక విభాగం ఏర్పరచి శస్త్రచికిత్సకు సదుపాయాలు చేయాలనీ ఈ సభవారు ప్రభుత్వానికి సూచించారు. ★

కుటుంబ నియంత్రణ ★ స్త్రీల గురుతర బాధ్యత

శ్రీమతి గర్గీయాజ్ఞవల్క్య



అంతర్జాతీయ కుటుంబ నియంత్రణ సమాఖ్య కార్యదర్శిని శ్రీమతి వెరా ఆస్లిటన్.



భారత కుటుంబ నియంత్రణ సంఘం గౌరవ ప్రధాన కార్యదర్శిని శ్రీమతి అవాబాయ్. బి. వాడియా. అంతర్జాతీయ సమాఖ్య పాలకవర్గంలో ఈమె సభ్యురాలు.

భారతదేశంలో నానాటికి జనాభా పెరిగిపోతోంది. కాని దానికి అనుగుణంగా, ఆహార పదార్థాల ఉత్పత్తి సాగటంలేదు, ఫలితంగా దేశంలో దారిద్ర్యం, యూల్గుతూనే వుంది, విపరీతంగా పెరిగిపోతోన్న జనాభా వలన, ఎన్ని ప్రాజెక్టులు కట్టినా ఎన్ని ప్రణాళికలు అమలు పరచినా, ఆహార పరిస్థితిగాని, సగటు మానవుని జీవనప్రమాణంగాని మెరుగైనట్లు కన్పించటంలేదు. దేశంలోని నిపుణులు ఈ పరిస్థితి కూలంకషంగా చర్చించిన మీదట, విపరీతంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టి, ఆహార సమస్యను పరిష్కరించి మధ్యతరగతి, క్రిందితరగతి ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచాలన్నారు. అందుకు కుటుంబ నియంత్రణ పాటించాలని సూచించారు. ఆ మధ్య శ్రీ నెహ్రూ కూడ "జన సంతతి తప్ప అన్ని రంగాలలోను ఉత్పత్తి పెంచాలి" అని ఉద్ఘాటించారు. మన ప్రణాళికలను పరిశీలించిన విదేశీ నిపుణులు కూడ మన ప్రణాళికలు బాగున్నాయి కాని విజయవంతమైన ఫలితాలను పొందాలంటే జనాభా పెరగరాదు అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఈ కుటుంబ నియంత్రణ అనే వివాదం చాలరోజులనుండి వాడబడుతున్నా, ఈ నాడు దానికి ప్రాముఖ్యం ఎక్కువగా కన్పిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కుటుంబ నియంత్రణ అవసరమా అనిపిస్తోంది అనే భావం బాగా వ్యాపించి కన్పిస్తోంది. కాని కుటుంబ నియంత్రణ అనేపాటికి చాల ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కుటుంబ నియంత్రణ ఎలా జరగాలి, ఈ నియంత్రణ అమలు జరుపటానికి అభ్యంతరాలేమిటి, ఒకవేళ అమలు జరుపటమే నిశ్చయమైతే పాటించవలసిన నియమాలేమిటి? ఇలాగే మరికొన్ని......

వైద్య శాస్త్రజ్ఞులు సంతాన నిరోధం మీద పరిశోధన జరిపి కొన్ని మార్గాలను సూచించారు. దీనివలన తేలిన విషయమేమంటే, స్త్రీ పురుషులు, కొన్ని ఔషధములను, సేవించి గర్భ నిరోధం జరపవచ్చు అని. ఇవి తాత్కాలికాలు; కాకుండా, శాశ్వత సంతాన నిరోధం జరగాలంటే, స్త్రీ గాని, పురుషుడుగాని, శస్త్రచికిత్స (ఆపరేషన్) చేయించుకోవచ్చు, పోతే ఈ శస్త్రచికిత్సలు అన్నీ విజయవంతమౌతాయా అనేది మరో ప్రశ్న. సరే, అదలా వుంచుదాము.

ఈ కుటుంబ నియంత్రణ అమలు జరపుటకు అభ్యంతరాలేమిటి అనేది మరొక ప్రశ్న. ఇక్కడ చాలచిక్కులు వస్తున్నాయి. ఈ ప్రపంచంలో మానవుని స్థితిగతులు, అన్నీ ప్రకృతి సిద్ధాలని, సృష్టిస్థితిలయాదులు అన్నీ భగవన్నిర్ణయ, సంకల్పాలని, వాటిని వశపరచుకోవాలని ప్రయత్నించటం అవివేకమని ముఖ్యంగా మన భారతీయుల దృష్టి; అందువలన ప్రకృతిసిద్ధమైన వేటినీ నిరోధించరాదనేది ముఖ్యవాదం; కాదు కాలమాన పరిస్థితులను దృష్టిలోవుంచుకొని ప్రవర్తనా ప్రాచీన సంప్రదాయాలను, నమ్మకాలను, ఆధునిక సంప్రదాయాలను, నమ్మకాలను, పరిస్థితులను, అవసరాలను సమన్వయపరచి సాగిపోవాలనటం మరోవాదం; ఈ వాద ప్రతివాదాలనటుంచి, ఆధునికులు కొందరు అభిలషించిన ఈ కుటుంబనియంత్రణ విజయవంతం కావాలిఅంటే, అనుసరించవలసిన పద్ధతులేమిటి? పరిస్థితుల దృష్ట్యా మానసిక ప్రవృత్తులలో మార్పులుకలిగి, ప్రతివారూ, కుటుంబ నియంత్రణకు సుముఖులు కావాలి అనేది ఒక అభిప్రాయం.

ఇక కుటుంబ నియంత్రణ అమలుపరిచితే ఎలా అమలుపరచాలి, అనేది మరో సమస్య. ప్రతి స్త్రీ, పురుషుడు వివాహానంతరం సంతాన నిరోధం పద్ధతులను అన్వేషిస్తూ కూర్చొంటే, వారియవ్వనం, ఏ అడ్డంకులూ లేకుండ గడచిపోవచ్చు కాని, మరి వృద్ధాప్యం సంగతిఏమిటి? మానవుడు సంఘజీవి ఒకరిమీద ఆధారపడి జీవించాలి. ముఖ్యంగా తమ సంతానం మీదనే జీవించాలి. కాబట్టి

స్త్రీ పురుషులకు సంతానావసరం కన్పిస్తోంది. ఈవిషయం అందరూ ఒప్పుకొన్నదే. దీనిపై వివాదం లేదన్నది నిర్వివాదాంశం; సంతానావసరాన్ని అంగీకరిస్తే హద్దువిమిటి అనేది రెండవప్రశ్న. ఒక కుమారుడు, ఒక కుమార్తె అనుకుంటే కుదరదు. ఎవరిజీవితా లెప్పుడో? ఒక కన్ను కన్ను కాదు ఒక బిడ్డ బిడ్డకాదు అని సామెత.

వైద్యనిపుణులు ఈవిషయాన్ని చర్చించి కనీససంతానం నాలుగుగా భావించారు. ప్రస్తుతం అములులోవున్న ప్రభుత్వ నిర్ణయమూ అదే. ఆస్పత్రిలో 4 గురు సంతానం (జీవించిన) వుంటేనే కాని గర్భనిరోధక చర్యలు తీసికోరు—స్త్రీ ఆరోగ్యం దృష్ట్యా కూడ ఈ నియమం అవసరమంటు వైద్య నిపుణులు తమ అభిప్రాయాన్ని వెలిపుచ్చారు. కొందరు మధ్యతరగతివారు, క్రిందతరగతివారు 4 గురు బిడ్డలను పోషించటంకూడ కష్టం. కాబట్టి ఈ నిబంధనను సడలించాలంటున్నారు.

ఈ కుటుంబనియంత్రణ అనేవిషయాన్ని గురించి చర్చిస్తూ పోతే చాల సమస్యలు, ప్రశ్నలు ఎదురవుతాయి; ఇదంతా ఏదో పెద్దవాద గ్రస్తమైన విషయంగా కన్పిస్తుంది. కానీ ఈ విషయాన్ని చర్చించి ఒక నిర్ణయానికి రావటమూ అవసరమే నని పిస్తోంది.

ఈ పెదంతా, కుటుంబనియంత్రణ దాని చరిత్ర. నేడు ఆవిషయమై జరుగుతోన్న ప్రచారం అది అలావుంచగా ఈ కుటుంబ నియంత్రణ విషయంలో పురుషునకంటె స్త్రీపాత్ర ఎక్కువనేది సుస్పష్టం—కాని ఈ విషయాన్ని స్త్రీలకన్నా పురుషులే ఎక్కువగా చర్చిసున్నారు — మాటడుతున్నారు. ప్రత్యక్షంగా వనితలకు సంబంధించిన ఈ విషయాన్ని మరొకరు చర్చించి నిర్ణయాలను మనపై గుద్దటం విచారకరమైన విషయం. అంటే నిపుణుల, పెద్దలఅనుభవజ్ఞుల నిర్ణయాలను మనం స్వీకరింపరాదనికాదు; స్త్రీలూ ఈ చర్చలో పాల్గొనాలనే.

"ఒకప్రక్క భారతీయత, సంస్కృతి సంప్రదాయాలు, ఆస్తికత, అంటూ సంతాన నిరోధాన్ని నిరసించేవాదాన్ని బలపరచటమా లేక కాలమాన పరిస్థితుల కనుగుణంగా ప్రాచీన ఆధునిక పద్ధతులను ఆచారాలను నమ్మకాలను సమన్వయ పరచుకొని సంతాన పరిమితిని పాటించి, కుటుంబ నియంత్రణ సాధించటమా? అనేదే నేటి స్త్రీ సమస్య—ఆ సమస్యను చర్చించి పరిష్కరించవలసినది స్త్రీ...

సోదరీమణులు ఈ విషయాన్ని గురించి స్వేచ్ఛగా తమ తమ అభిప్రాయాలను పత్రికా ముఖంగా ప్రకటించి ఎందుకు చర్చించరాదు? ★

తెల్లశోభికిమందు

తెల్లశోభకమందు ఎవరికైనా తెలుస్తే చెప్పమన్నారు ఒక సోదరి.

ఈ మందులలో కొబ్బరినీరుతో వైద్యం చాలా బాగా పనిచేస్తుంది. నేను వాడిన మందులలో ఇదే మేలిరకమైనది నాకు నమ్మకం కుదిరింది.

తెలశోభియో లేక ఇంకేదోనో బాగుగా ముందు తెలుసుకోవాలి. ఒక వేళ ఇంకో వ్యాధే అయినా ఈ మందు వాడకంవల అపాయము ప్రమాదములేదు. కాని, ఆ వ్యాధిమట్టుకు (ఇంకేదైనా అయితే అది) తగ్గకపోవచ్చు. సరైనమందు పడక ముదురుతుందికూడా. తెల్లశోభి మచ్చలమీద చీపురుపుల్ల, పిన్నులతో గుచ్చిన నొప్పిలేకుండా ఆ ప్రాంతము "సెన్స్-లెస్"గా ఉన్నయెడల, వెంటనే డాక్టరువద్దకు వెళ్ళవలెను. అది తెలశోభికాదు. తెల్లసోభికి వేసవిలో దురద కొద్దిగా ఉంటుంది ఇంతేగాక ఆ ప్రాంతముపై పిన్ను లేక చీపురుపుల్లతో గుచ్చినచో బాధకూడ ఉంటుంది.

కొబ్బరినీరుతో మందు: తెలశోభికి కొబ్బరినీరు బాగుగా పనిచేస్తుంది. పూర్తిగా మచ్చలను మాన్పుతుంది. శివకోవిలలో గాని, తదితర కోవెళ్ళలో గాని అప్పటి కప్పుడు కొట్టితీసిన కొబ్బరినీరు గాని, ఇంటివద్ద కొట్టి తీసిన కొబ్బరినీరు గాని వుపయోగించవచ్చును. అప్పటికప్పుడు కొట్టితీసిన కొబ్బరినీరు అయిన మంచిది. లేకున్న ఆ నీరు నిలువచేస్తే కుళ్ళికంపుకొడుతుంది. అయినా ఆ కొబ్బరినీరులోగల ఔషధగుణము చెడిపోదు. అందుచేత ఆ కొబ్బరినీటిలో కర్పూరము, వాసనసూని లేక సెంటుగాని వేసినచో ఆ కొబ్బరినీరు నిలువకూడ చేసి ఉంచవచ్చును. ఇది రోజుకు రెండు మూడుసార్లు ఆ శోభి మచ్చలు ఉన్న ప్రాంతములో వ్రాయాలి. ఒక వారములోపునే ఆ మచ్చలు తగ్గిపోతాయి కాని అది తగ్గింది అని మానకుండా మరి రెండు మూడు వారాలు రాయాలి. అశ్రద్ధ చేసిన తిరిగి యథాప్రకారముగా ఆ శోభిమచ్చలు మరల శరీరముపై కనబడును. ఇది చవకమందు.

"డ్యూమెక్స్" కంపెనీవారుగూడ ఒక శోభమందు తయారు చేసేరు. దానిపేరు 'డెరొబిన్'. —"కల్యాణతార, బరంపురం.

డోర్ మాట్స్

కొబ్బరిపీచును నీళ్లలో రెండు మూడు రోజులు నానబెట్టాలి. కొబ్బరికాయల పైనుంచి లాగినప్పుడు పీచు ముక్కలు ముక్కలుగా వుంటుందిగా! దానినదే ఆకారంలో వుంచాలి. ముక్కలు నానిన తరువాత రాతితో బాగా కొట్టాలి. ఇలా కొడితే పొట్టురాలి కొబ్బరి త్రాడులో లాంటి పీచు శుభ్రమైనది వస్తుంది.

ఇలా తయారైన పీచును పెద్ద పొడవైన జడమాదిరిగా అల్లాలి. మొదలు పెట్టేటప్పుడు జడపాయలను కలిపి దారంతో ముడివేయాలి. జడ అల్లేటప్పుడు గుప్పెడు గుప్పెడు పీచును చేరుస్తూ రావాలి. ఈ పీచు చేర్చేటప్పుడొకటి గమనించాలి. జడలో నే కలిసి పోయేటట్లు యీ పీచు పెట్టకుండా కొద్దిగా పైకి వదలిపెట్టాలి (ఇలా చేస్తే జడపైన కుచ్చువస్తుంది. డోర్ మాటే తయారైనప్పుడు కాళ్లక్రింద యీ కుచ్చు మెత్తగా తగులుతుంది 1. వ బొమ్మ చూసే అల్లేటప్పుడు యీ క్రొత్త పీచు ఎలా చేర్చాలో తెలుస్తుంది.) ఓ జడ వెడల్పు మూడు అంగుళముల లోపుగా వుంటే బావుంటుంది

జడ మొదలు దగ్గర దారనుగాని (పొడవైన యేనారైనాసరే) పురికొసగాని 6 చోట్ల కట్టాలి. బాగా బిగించి కట్టాలి వదులుగా వుంటే యేమీ లాభంలేదు. ఈ దారాలు కట్టేవిధానం 2. వ. బొమ్మలో వుంది.

ఇక అసలుభాగాని కొచ్చాయున్న మాట: ఈ జడను ఒక్కసారి చుట్టచుట్టాలి. అలా చుట్టినప్పుడు ఈ ఆరు దారాల మధ్యనుంచీ జడ పోయేలా చూచి యెక్కడి కక్కడ యీ దారాలనుకలిపి బిగించి ముడివేయాలి ఈ చుట్టరు ఆరుచోట్ల ముళ్లుపడ్తాయన్న మాట.

ఇలానే జడఅంతా అయిపోయేవరకు చుడుతూ, దారాలమధ్యలో నుంచి జడ పోనిస్తూ ఎక్కడి కక్కడ ముళ్లు వేయాలి. ప్రతిసారి చుట్టినప్పుడూ ముళ్ళు వేస్తూ వస్తాము కొబట్టి ఒకసారి చుట్టినదానికి మరోసారి చుట్టినదానికి కలిపి ముళ్ళు పడ్తాయి. గట్టిగాలాగి ముడివేయాలి అలాగైతే వదులుగా బారి త్వరలో డోర్ మాట్ విడిపోకుండా ఉంటుంది 3 వ. బొమ్మలో చుట్టే విధానాన్ని తెలియపర్చాను.

ముఖ్య గమనిక—యీ కుచ్చుగా వుండే జడభాగం పైకే వుండాలి.

గుండ్రని డోర్ మాట్ తయారయినట్లే పైకుచ్చు సమంగా ఒకేయెత్తులో వుండదు కాబట్టి కత్తెరతో సమంగా వుండేలాగున యెత్తుగావున్న కుచ్చును కత్తిరించేయాలి. చివరికొన మలిపి కుట్టాలి.

చుట్టూరా జంపకానాగుడ్డను, లేక గోనెపటను వేసి కుడితే అందంగా వుంటుంది.


ఒక్కరోజులో తయారు చేయలేనివారు మధ్యలో ఆపితే యీపీచు కొద్దిగా తడిగా వుండేలా చూడాలి లేకపోతే అంత సులభంగా చేతిలో యిమిడ్చి మన కిష్టమొచ్చినట్లు వంచలేము.


ఎండిన తరువాత పీచు బిగుసుకుపోయి డోర్ మాట్ వదులుగా అవుతుంది శ్రమ ఫలితం దక్కదు. 1. అందుకని పీచు మరీ యెక్కువ తడిగా వుండకూడదు. 2. జడను చుట్టేటప్పుడే గట్టిగా బిగించి చుట్టుతూ గట్టిగాలాగి ముడులు వేయాలి.

20 అడుగుల జడకు డోర్ మాట్ వస్తుంది.

డి. కోమలాదేవి కాకినాడ







సగానికి సగం

ఒక లావుపాటి పిన్నిగారూ ఆరుగురు సైజువారీ పిల్లలూ బిల బిల లాడుతూ బస్సులోకి ఎక్కి చోటులేక, నిలబడలేక గిల గిల లాడుతున్నారు.

"అందరు పిల్లల్నీ ఒక్కసారే తిసుకొచ్చి ఇలా అవస్థపడక పోతే, సగం మందిని ఇంట్లో ఉంచి బయల్దేరవచ్చు గదమ్మా" అన్నాడు కండక్టరు హేళనా లాలనా మేళవించి.

"నాయనా ఆపాటి నాకూ తోచకపోలేదు. సగం మందిని ఇంటిదగ్గిర ఉంచే వచ్చాను" అన్నదావిడ.

* * *

దస్తూరి తిలకం

ఒకడు: "మన సుబ్బారావు ఈ ఊళ్లో డాక్టర్లా పెద్ద కర్తయ్యాడు తెలుసా?"

మరొకడు: "కాకేంచేస్తాడు! వాడు రాసిన ఉత్తరం చదవటానికి నాకు ఒక రోజంతా పట్టేది."

మహిళా సంఘాలు

భీమవరం పట్టణ మహిళాసంఘంవారు ఫిబ్రవరి 13-న సర్వప్రియ సరోజినీదేవి 80-వ జన్మదినోత్సవం జరిపారు. సరోజినీ గ్రంథాలయంలో సభ జరిగింది. శ్రీమతి కాడిమళ్ళ వెంకటరమణాదేవి అధ్యక్షత వహించారు. మధుర కవయిత్రి సరోజినిదేవి గొప్పతనాన్ని గురించి ఆమె ఉపన్యసించారు. శ్రీమతి మోచర్ల సుబ్బలక్ష్మి మాట్లాడుతూ నేటి మహిళలు సరోజినిదేవి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని రాజకీయరంగంలోనూ సాహిత్యంలోనూ కృషిచేసి రాణించాలని అన్నారు. సరోజినీదేవిపై తామురచించిన గేయాలను చదివారు. శ్రీమతి జయరామారావు వందనసమర్పణ చేశారు.

పోలాప్రగడ కామేశ్వరి.

వనితా వాణి



వీరంకి వెంకటరమణాదేవిగారు వ్రాసిన "వేదాలలో మహిళలు" అన్న వ్యాసం నన్నెంతో ఆకర్షించింది "పురుషుడు మృగప్రాయుడుగా, దుఃఖజీవిగా కాకుండ నిలిపింది స్త్రీముఖంలో చిందులాడే చిరునవ్వే" అని అన్నాడు ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత అనటోల్ ఫ్రాంస్. నిజం పరిశీలిస్తే ఇది నూటికి నూరుపాళ్ళు నిజం.

చక్కని వ్యాసం వ్రాసిన వెంకటరమణాదేవిగారికి అభినందనములు.

మిస్ రాజ్యంచౌదరి.

* * *

జి. సూర్యకాంతిగారు వ్రాసిన 'బి ఎ పరీక్షకు మావారి చదువు' అను వ్యాసము వనితాలోకము శీర్షికలో ప్రచురించుటకు తగినది కాదు. సమష్టి సమస్యల పరిష్కారానికి తోడ్పడు వ్యాసాలు, వనితాలోకం శీర్షిక క్రింద ప్రచురిస్తే వనితల కెంతో సహాయము చేసిన వారవుతారు. వనితాలోకానికి వ్యాసాలు వ్రాయు సోదరీమణులు ఎలాంటి వ్యాసం పంపితే బాగుంటుందో ఆలోచించి మరీ పంపితే బాగుంటుంది.

ఇ సునంద (మదనపల్లె)

* * *

ఈవ్యాసంవల్ల స్త్రీలు నేర్చుకోవల్సింది, తెల్సుకోవల్సింది, వారికి ఉపయోగించేది ఏముందో నాకేమీ బోధపడలేదు.

ఎ. వి. రత్నం (గూటాల).

* * *

'మావారి బి. ఏ చదువు' అనే వ్యాసం ఎందుకు ఉపయోగిస్తుందో నాకు బోధపడలేదు. రచయిత్రి ఉద్దేశమేమిటో అంతకంటె బోధపడలేదు. ఆ వ్యాసంలో తెలుసుకోవలసిన విషయాలు లేవు ఆమె భర్తగారి చిలిపితనంగురించి వ్రాశారు.

అందరికీ ఉపయోగించే వ్యాసాలు వ్రాసి వారి పేర్లు చిరస్థాయిగా జ్ఞాపకముండేలా చేయాలి. వనితాలోకంలో ముగ్గురు సోదరీమణులు తరచుగా చక్కని వ్యాసాలు మనకి అందిస్తున్నారు. వారిపేర్లు ఎప్పుడూ మనసులో మెదలుతూఉంటాయి. వారి పేర్లు బి. యూసీ లక్ష్మి. పవని నిర్మలప్రభావతి, బి. ప్రేమలీల. వీరు వ్రాసిన వ్యాసాలంటే నాకు చాలా ఆనందం. వారి వ్యాసాల ద్వారా మనకి ఎన్నో విషయాలు తెలియజేస్తున్నారు. వారికి నా అభినందనములు. గతవారం ప్రభావతిగారు పిల్లలెందరు మీకు అనే వ్యాసం వ్రాశారు. ఆ వ్యాసం ప్రతీ వారు చదవవగ్గది. చదివి ఆచరణలో పెట్టవచ్చు.

శ్రీమతి సుబ్రహ్మణ్యం.

* * *

పవని నిర్మలప్రభావతి వ్రాసిన "ఎంతమంది పిల్లలు మీకు" అను వ్యాసంచదివేం. ఈ కాలంలోకూడ ఇటువంటి విషయాల పట్ల విముఖంగా ఉన్నవారు చాలామంది ఈ వ్యాసం చదివి అందులోని విషయాలను ఆచరించి, పట్టుదలలువదిలి తమ భవిష్యత్తు పిల్లలభవిష్యత్తు సుఖమయం చేసుకుంటారనుకుంటాము.

సరస్వతి, కమల, ప్రభ (అసాక.)

* * *

ఆంధ్రప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు

(4-వ పేజీ తరువాయి)

ఇక్కడ క్యాంపు హాస్పిటల్‌కు, క్రొత్తగా కట్టబడిన ఔట్ పేషెంట్ బ్లాకు తూర్పువైపు వరండాలలో 1958 జనవరినుండి నాలుగు నెలలపాటు వ్యాధిపీడితులు ఎండకు, వానకు, ధూళికి స్వాగతమిస్తూండేవారు. వారి ఇబ్బందులు పరిస్థితిలో ఏవిధమైన మార్పునూ తీసుకురాలేకపోయాయి. కొన్నిరోజుల క్రితమే మాసం-మర్నాడు ఉదయం గవర్నరు సతీమణి ఆస్పత్రికి వస్తారనేసరికి ముందురోజు సాయంకాలానికల్లా వరండాలనిండా దాదాపు యాభై అందమయిన ఆకుపచ్చ పెయింట్లతో వెదురుతడికలు వెలిశాయి. ఇంతా చేస్తే (పాపం!) గవర్నరు సతీమణి రాలేదు; కాని ఆ తడికలు మాత్రం అలాగే వుండిపోయాయి. ఆ మాత్రం సౌకర్యానికి కారకురాలైన గవర్నరు సతికి సర్వదా కృతజ్ఞులమై వుండాలి.

ఈ భవనాలు, లిఫ్టులు, తడికల గొడవ వదిలేస్తే, వైద్యులు, వారి విధానాల వగయిరాల విషయం ఆలోచిద్దాము.

ఈ మధ్య చెవిలో పెద్ద కురుపులేచి, మూడురాత్రుళ్ళు యమబాధపడ్డ తర్వాత ఈ ఆస్పత్రులంటే నాకున్న భయాన్ని విధిలేక తోసిరాజని, దానిలోకి ప్రవేశించి, "చెవి-ముక్కు-గొంతు" గదిలోపలకి వెళ్ళి ఒకనాడు డాక్టరుయెదుట కూచున్నాను. ఆయన ఒక నిమిషంసేపు గొట్టాలతో, దీపాలతో పరీక్షచేసి, కాగితంమీద ఏదో రాసిచ్చి ఇక వెళ్ళమన్నారు. మధ్య నా బాధనుగురించి నేనేదో చెప్పబోతుంటే—"మీ రింకేం చెప్పక్కర్లేదు; అంతా నాకు తెలుసు"నని సర్వజ్ఞత్వం వహించారు. ఆయన డాక్టరు, అందులో నిపుణుడు! అది కాదనను. అంత మాత్రం చేత రోగి చెప్పదలచిన దాన్ని వినిపించుకునే ఓపిక లేకపోవడం, అసలు వినిపించుకోకపోవడం ఏమంత వివేకమో బోధపడదు! నేను అవమానంగా నోరు మూసుకుని లేచిరావలసి వచ్చింది. అనంతమయిన ఆశలతో రోజూ వందలకొద్దిగా వచ్చే గ్రామీణులు విద్యావిహీనులు ఎంతవరకు తమ తమ అనారోగ్య వివరాలను చెప్పగల్గుతున్నారో, చెప్పబోతే వినిపించుకుంటున్నారో ఊహించవచ్చు. రోగి చెప్పిన దానిని సావధానంగా విని, అతను చెప్పలేని దానిని అడిగి తెలుసుకుని, అతడి పరిస్థితి బాగుపడడానికి తాను ఏమిచేయబోతున్నదీ రోగికి వివరించడం సగం వైద్యమంటారు. అంతేగాని కాగితాలమీద వ్రాసే మిక్స్చరూ, మాత్రలూ - ఇవే సర్వస్వం కావనీ, ఇటువంటి పాశ్చాత్య దేశాలలో డాక్టర్లు తెలుసుకొని అవిఘంగా ఆచరిస్తున్నారట. మన వారికి ఆ మాటలు అంతగా రుచించవేమో!

* * *

మరొక మిత్రుడు గుండెల్లో శూలంతో పొడుస్తున్నంత బాధకల్గగా పొద్దున పదింటికి మా వూరి ఆస్పత్రికి వెళ్లితే—"ఔట్ పేషెంట్ల చీటీలు రాసిచ్చేది - ఉదయం 9-30 గంటలదాకనే! ఇప్పుడిక వీల్లేదు పొమ్మన్నారు! అత్యవసర ప్రమాద పరిస్థితులకని వినియోగించిన 'కాజువాలిటీ' గదిలోని డాక్టరూ ఆమాటే అన్నాడు. అంటే రోగులను చూడడానికి వారి దేహపరిస్థితి కారణం కాదు.

ఆఖరికి నా మిత్రుడు గుండెనొప్పికి ఒక ప్రైవేటు డాక్టరువద్ద చికిత్సపొంది, ఆ విషయాన్ని పెద్ద అధికార్లకు ఫిర్యాదు చేశాడు. తత్ఫలితంగా జరిగిన 'విచారణ'లో—"ఔట్ పేషెంట్ చీటీ లేనిదే చూడడానికి వీలులేదు పొమ్మన్న డాక్టరు—"అబ్బే! ఆరోజు అతగాడి ఆరోగ్య విషయంలో అంత అవసరంగా పరిశీలించగలసిందేమీ లేదు. ఇతను సాధారణమయిన 'మెడికల్ - చెకప్' కోసం మాత్రమే వచ్చాడు" అని చెప్పారట! అశ్రద్ధతో బాటు అబద్ధంకూడా చేరితే విధిలోని మనిషి చేసేదేమీ లేదు!

* * *

ఇంతేకాదు. ఇలాటివి ఎన్నో వున్నాయి.

కుడిప్రక్కన బాధ అయితే ఎడమప్రక్క అపరేషన్ చేశారు మరొకరికి. ప్రస్తుతం ఆ అపరేషన్ చేసిన వారే ఏడీదబ్బుడూ లేకుండా నిజంగా నొప్పివున్న ఆ కుడిప్రక్క మీదకు తమ శస్త్రాలను సంధిస్తున్నారని వార్త. గని ఫలితంగా ఆ మిత్రుడు మాత్రం రెండు నెలలనుంచి జీతంలేని సెలవుమీద ఆస్పత్రిలో జీవిస్తున్నాడు!

కొత్తగా 'కారు డ్రైవింగ్' నేర్చుకుంటూ ఆ నేర్చుకోవడంలో ఆసుపత్రి కాంపౌండ్ లోపల వస్తున్న ఒక రోగి కాలిమీద కారు చక్రం ఎక్కించారట ఒక డాక్టరు!

రోగుల్ని పరీక్షచేస్తూ, వారు విటెడ్ పరీక్షార్థం చొక్కాగుడ్డలు విప్పడం ఆలస్యమయితే, ఆ రోగుల వీపుల మీద తన చేతులు ప్రయోగించడానికి వెనుదీయని పెద్ద డాక్టరొకరున్నారు.

ఒక స్త్రీ (వివాహిత) అగ్నిప్రమాదానికి గురిఅయింది ఆమె తండ్రి ఒక ఆఫీసరు. ఆమెను ఆస్పత్రిలో 'అడ్మిట్' చేశారు. చేసిన వెంటనే ఏదో అవసరమైన పనిమీద ఆయన వూరు వదలివెళ్లి కొన్ని గంటల తర్వాత తిరిగివచ్చారు కాని ఆయన ఆస్పత్రి మీద పెట్టుకున్న ఆశ అడియాస అయింది. ఆ పాటికే ప్రాణం విడిచిన ఆమె అంతకుముందు మంచినీళ్ళు అడిగినా అందిచ్చేవారు లేకపోయారట!

ఇక్కడ ఒక చిన్న "ఆస్పత్రి" అనబడేది వుంది. ఇది పొద్దున 8—11 గంటల మధ్య, సాయంకాలం 3—5 గంటల మధ్య తెరచి వుంచబడుతుంది—అని అక్కడి బోర్డు చెబుతుంది కాని దీన్ని ఏనాడైనా ఎనిమిదిటికి తెరిచివుంచితే ఒట్టు. ఇక ఇక్కడి డాక్టరుగారంటారా, ఏ పది గంటలకో వచ్చినట్టే వచ్చి, ఇట్టే వెళ్లిపోతుంటారు. కాంపౌండరే అధిష్ఠానదేవతయి 'దయా'సమేతుడై ఆస్పత్రినీ, వచ్చేరోగుల ఆరోగ్యాలనూ ఏలుతుంటారు.

ఇది మన ఆంధ్రదేశం!

ఇవీ మన ఆస్పత్రులు!

పైన చెప్పబడిన వాటిలో కొన్ని పూర్తిగా యదార్థం కాకపోవచ్చు; మరి కొన్నిటిలో అతిశయోక్తి వుందేమో ననిపించవచ్చు. నిప్పులేనిదే పొగరాదు! నిజంలేనిదే కలం కదలదు. ఇది ఎవరిని నిందించాలని, విమర్శించాలని, బాధించాలని కాదు. దీనిని ఒక అద్దంగా భావించి తమను తాము చూచుకుని, రోగనివారణ—ప్రాణరక్షణలకు బాధ్యత వహించగలిగిన మహాద్భాగ్యం కలిగినవారు ఆసేవలో మానవ సాధ్యమయిన పరిపూర్ణత ధ్యేయంగా తమ వైద్యవిజ్ఞానాన్ని వినియోగించాలని ప్రార్థన.

కాకినాడలో కొత్త మెడికల్ కాలేజి పెడతామని, తిరుపతిలో ఇంకొక కాలేజీ పెట్టబోతున్నామని, ఇక్కడ రెండువందల పడకలుగల ప్రసూతివార్డు ఏర్పాటు చేస్తున్నామని మంత్రులు, డైరెక్టర్లు వేదఘోష సాగిస్తున్న ఈ రోజుల్లో 'సంఖ్య' అవసరమే అయినా 'శ్రేష్ఠత' అంతకన్నా ముఖ్యమని మనవి ★

వనితా వాణి

ప్రచారం కావాలి

కుటుంబ నియంత్రణ సమస్యలపై వ్యాసాలు చాలా ప్రోత్సాహకరంగా ఉంటున్నాయ్ ఇంతవరకూ చాలామంది వెలిబుచ్చిన అభిప్రాయాల్నిబట్టి చాలామందికి ఆసక్తి వున్నప్పటికీ, సరియైన సహాయం అందుబాటులో లేకపోవటం, సంఘంలో కొందరి ధోరణి దీనికి ప్రతిబంధకంగా పరిణమిస్తున్నయ్. అనిపిస్తుంది. మద్రాసు మొదలైన రాష్ట్రాలలో 'ఫామిలీ ప్లానింగ్'మీద పుస్తకాలు ప్రచురించి ప్రజలకు చవకగా లభించే ఏర్పాటు చేశారు. కాని ఇంకా మన రాష్ట్రంలో ఇంతవరకు అటువంటి ప్రయత్నం ఏమీ జరుగుతున్నట్లు కనపడదు మొన్నటివరకూ జరిగిన హైదరాబాదు ఎగ్జిబిషన్‌లో ఒక చిన్న 'బడ్డీ' అంత స్టాలు పెట్టారు. అందులో రెండు ఖాళీ బల్లలు పెట్టి ఒక జవానుచేత ఫామిలీప్లానింగ్ మీద సినిమా కాగితాలులాంటివి అచ్చువేయించి పంచి పెట్టించారు.

'జస్వంత్'—హైదరాబాదు. ★



సినిమా

పెట్టుబడి సంస్థ

పాతిక లక్షల రూపాయలతో, దేశీయ చలనచిత్ర పరిశ్రమకు ఆర్థిక సహాయం చేసే నిమిత్తం పెట్టుబడిసంస్థ నెలకొల్పడానికి ఏర్పాటు ఆరంభమయ్యాయి

ఇందుకు అవసరమైన బిల్లును మొన్న రాజ్యసభ కూడా ఆమోదించింది

దీనితోపాటే ఫిలిం ఇన్‌స్టిట్యూట్ నెలకొల్పి, చలనచిత్ర కళలో శిక్షణ సదుపాయాలు చేయడానికి కూడా ప్రభుత్వం నిశ్చియింది

ఆరేళ్ళ క్రితం ఎస్ కె పాటిల్ (ప్రస్తుతం కేంద్రప్రభుత్వ రవాణా వ్యవహారాల మంత్రి) ఆధ్వర్యాన ఫిలిం పరిశ్రమ బాగోగులను విచారించిన సంఘం ఈ సదుపాయాలన్నీ జరగాలని సిఫార్సు చేసింది

పెట్టుబడి కార్పొరేషన్‌కు కోటి రూపాయలు కేటాయించాలని కూడా వారు అప్పట్లో చెప్పారు

అయితే ఇప్పుడు దేశ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యానూ ఇతర సాధక బాధకాలవల్లనూ పాతిక లక్షలతో ఆరంభించాలని ప్రభుత్వం సంకల్పించినట్లు కేంద్రమంత్రి డా॥ కేస్కర్ చెప్పారు

ముందుగా కథ స్క్రిప్టు పూర్తిగా వ్రాసుకుని ఆమోదం పొంది సత్వరంగా సకాలంలో నిర్మాణం సాగించే సంస్థలకు ఈ కార్పొరేషన్‌నుండి ధనసహాయం లభిస్తుంది

దీనిని పరిశ్రమ ఎంతవరకు ఉపయోగించుకోగలుగు అన్న విషయం క్రమేపీ, ఆచరణలో తెలిసినమీదట అవసరమైతే పెట్టుబడి

‘ఏక్ షోలా’ చిత్రంలో మాలా సిన్హా



పెట్టుబడి సంస్థ

మొత్తాన్ని పెంచగలమని కూడా ఆయన చెప్పారు

పూనే ఫిలిం ఇన్‌స్టిట్యూట్‌లో ఛాయాగ్రహణం, రచన, దర్శకత్వం, నటన మొదలయిన అన్ని శాఖలలోను శిక్షణ ఇవ్వాలని మొదట అనుకున్నారు గాని, చిత్ర నిర్మాణం పెద్ద ఖర్చుతో కూడిన పని కాబట్టి ప్రస్తుతానికి అది తప్పించి మిగతా వాటితో కార్యక్రమం ఆరంభిస్తారు

ఫిలిం సలహామండలి స్థాపన మటుకు విరమించుకున్నారు అలాంటి సంఘాన్ని పరిశ్రమలోవారే ఏర్పాటు చేసుకోవడం ఉచితంగా ఉంటుందని మంత్రి చెప్పారు ★

అమెరికాలో అపరాజిత

సత్యజిత్ రాయ్ తొలి చిత్రం 'పథేర్ పాంచాలి' న్యూయార్క్ ఫిప్త్ ఎవెన్యూ సినిమాలో ఆరునెలలు విజయవంతంగా సాగి మార్చి 1 న, రెండవ భాగంఅయిన 'అపరాజిత' చిత్రానికి చోటుఇచ్చింది 'పథేర్ పాంచాలి'కి జోహార్లు అర్పించి ప్రపంచ చిత్రాలలో ఉత్కృష్టమైనదని పొగడిన అమెరికన్ పత్రికలూ, చిత్రకళాభిమానులూ ఇప్పుడు ఈ రెండవ చిత్రానికి ఘనస్వాగతం చెబుతున్నారు "అపరాజిత" ఉత్తమోత్తమమైన అతివిశిష్టమైన చలనచిత్రంగా కీర్తిప్రతిష్ఠలు సంపాదించగలదని అమెరికన్ వారపత్రిక 'టైమ్' ఈ వారం వ్రాసింది

"సత్యజిత్ రాయ్ నిర్మించిన అపరాజిత చిత్రం, "పథేర్ పాంచాలి"కంటే "ప్రతిభావంతంగా ఉన్నది దీనిలోని పాత్రలన్నీ కరుణరస పూరితంగానూ అత్యంత స్వాభావికంగానూ, ఉన్నవి" అని "దిసాటర్‌డే రివ్యూ" అమెరికన్ వారపత్రిక వ్రాసింది

"పథేర్ పాంచాలి"తో ప్రారంభమైన అపూ కుటుంబకథ "అపరాజిత"లో కొనసాగింది తొలి చిత్రంలోకన్న ఇందులో సంఘటనలు పల్చగా ఉన్నా, ముందుచిత్రం కంటే ఇది శక్తివంతంగా ఉన్నది మొదటి చిత్రంలో అయిదు ప్రధాన పాత్రలతో కథ నడుస్తుంది ఈచిత్రంలో రెండు పాత్రలతో అపూ చిన్ననాటి సంఘటనలను చక్కగా చిత్రించారు

పాత్రపోషణలో రాయ్ శ్రద్ధ, జీవితంలో అతి చిన్నవి సామాన్యమైనవి అనిపించే సంఘటనలను ఉదాత్తంగా చూపించటంలో ఆయన ప్రతిభ, సహజత్వానికి దెబ్బతగలకుండా ఒక కవితలాగ చలనచిత్రాన్ని నిర్మించటంలో ఆయన శక్తిసామర్థ్యాలు ఈ చిత్రంలోకూడా కనిపిస్తవి

అపరజితలో కథా విధానానికి ఒక పద్ధతి లేదు క్లయిమాక్సు అంటూ కూడా లేదు. నిజానికి జీవితం ఎంత ఒడుదుడుకులతో కూడి ఉంటుందో ఆ కథ కూడా అలాగే ఉన్నది అందుచేతనే కథలో అపూ అతని తల్లి పాత్రలు అత్యంత కరుణరస పూరితంగానూ స్వాభావికంగానూ, మూర్తిభవించినట్లు కనిపిస్తవి అని ఆపత్రిక వ్రాసింది ★

సుధాకర్ ఫిలింస్‌వారి "వచ్చినకోడలు నచ్చింది" చిత్రంలో జమున



డెమిల్ చివరి యత్నం

కీర్తిశేషుడు సిసల్ బి డెమిల్ తలపెట్టిన చివరి యత్నాన్ని ఆయన మిత్రుడు సహాయకుడు, చిత్రనిర్మాణంలో కుడిభుజం వంటివాడూ అయిన హెన్రీ విల్‌కాక్సన్ కొనసాగిస్తున్నాడు 'బాలభటోద్యమ నాయకుడు, వ్యాపకుడు అయిన లార్డుబేడెన్ పవెల్ జీవితాన్ని చలనచిత్రంగా నిర్మించాలని మరణకాలంనాటికి డెమిల్ సంకల్పించి ఉండటం విదితమే ఆయనకు ఇంగ్లండులో సహకరించడానికి బాలభటోద్యమ నాయకులు, బేడెన్ పవెల్ సతీ సంసిద్ధత తెలియచేశారు

ముఖ్యపాత్రను బ్రిటిష్ నటుడు డేవిడ్ నివెన్ నిర్వహించగలడని తెలుస్తుంది

న్యూ పూర్ణాథియేటర్

పూర్ణా ఎక్స్‌ప్రెస్ అధిపతి జి కె మంగరాజుగారు విజయనగరంలో కొత్తగా నిర్మించిన 'న్యూ పూర్ణా థియేటర్'కు ఫిబ్రవరి 12 న ప్రారంభోత్సవం జరిగింది ప్రసిద్ధ నటి రచయిత్రి శ్రీమతి భానుమతీ రామకృష్ణ ప్రొజెక్టర్‌ను స్విచ్ ఆన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు థియేటరుకు బొంబాయి ఫిలిం నిర్మాత శ్రీ హోమీవాడియా ప్రారంభోత్సవం జరిపారు సభకు ధరణీ అధిపతి శ్రీ పి ఎస్. రామకృష్ణారావు అధ్యక్షత వహించారు.

ఉదయశంకర్ బృందం

ఆంధ్రదేశ పర్యటన

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన భారతీయ నర్తకుడు ఉదయశంకర్, ఆయన బృందం మార్చి తొలివారంలో ఆంధ్రలో పర్యటించి ప్రముఖ పట్టణాలలో ప్రదర్శనలు ఇవ్వబోతున్నారు

భారతనాట్యం, కథక్, కథకళి మణిపురి నృత్య ప్రదర్శనల ద్వారా నేకాక, ఆయా నృత్యాలను సమీకరించి ఆసంపుటికి విశేష ప్రయోగాలతో 'కల్పన' పేరిట చలనచిత్ర రూపకల్పనచేసిన సమర్థుడుగా, సాహసిగా ఉదయశంకర్ లలిత కళాభిమానుల గౌరవాభిమానాలను గడించుకొన్నాడు (కల్పన చిత్రాన్ని ఆయన మద్రాసు జెమినీ స్టుడియోలో నిర్మించాడు) ఆ చిత్రం ఆరంభంలో ఘనవిజయం సాధించలేకపోయింది

ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సమితి పేరిట విజయవాడ పురప్రముఖులు కొందరు కలసి ఉదయశంకర్ బాలే బృందాన్ని ఆహ్వానించి ఆంధ్రలో పర్యటన ఏర్పాటుచేశారు ప్రదర్శనలు జరిగే కేంద్రాలు గుంటూరు, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్టణం, కాకినాడ, భీమవరం, తెనాలి నెల్లూరు, వరంగల్, నాగార్జునసాగర్ డామ్ గుంటూరులో ప్రదర్శనం మార్చి 6 వ తేదీన జరుగుతుంది 13 హైదరాబాద్‌లో జరిగే ప్రదర్శనానికి ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి, ఏప్రిల్ 7 వ విశాఖపట్టణంలో ఆంధ్ర వర్సిటీ శ్రీ మేధీ అధ్యక్షత వహిస్తారు అన్ని పట్టణాలలోను స్థానిక ప్రముఖులతో ఆహ్వాన సంఘాలు ఏర్పాటు అయినట్లు నిర్వాహకులు తెలుపుతున్నారు వీటిని నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ సంస్కృతి సమితికి శ్రీ పి జి శెనర్జీ అధ్యక్షుడు శ్రీ జి వి ఎస్ శాస్త్రి, కార్యదర్శి .



రేఖా అండ్ మురళీ ఆర్ట్సు వారు ఇటీవల మద్రాసు అణ్ణామలై మందిరంలో 'శాంతి నివాసం' అనే నాటకం ప్రదర్శించారు అందులో నాయికానాయకులుగా ఆదోని లక్ష్మి, వల్లం నరసింహారావు.



'ఋష్యశృంగ'లో లత—ఫోటో : సోమయాజులు

★ చిత్రలేఖలు ★

ఆర్యా,

ఉత్తమగ్రంథాలు అనబడే బెస్ట్ సెల్లర్ పుస్తకాలలో కథతో సినిమా తీసి, పుస్తెల్లా గిట్టనివాళ్ళంతా డైరెక్టర్ల మీదికి ఒంటికాలు మీద లేచిపోయి తిట్టిపోస్తున్నారు. ఇది చాలా అక్రమం. అందులోమా ఫలానా ఉత్తమగ్రంథం రాసినాయన బతికేవుండి ఫిల్ముకు కథగా స్తే ఇలా చేసివుండడు అని చెప్పిందికి వీళ్ళెవరు? వీళ్లమాటే రైటనడానికి దాఖలా ఏమిటి?

మొత్తంమీద ఇలాంటి గొడవలు రాకుండా చెయ్యడానికి ఒకమార్గంవుంది. ఇకనుండి క్లాసికు గ్రంథాలు రాసే వాళ్ళందరూ— రాసేటప్పుడే శరత్ బాబువా శ్రీకిల (బెస్ ఫిలింరైటర్లు)లా చిన్నచిన్న సీనారియాలి; లేదా లావుపాటి బుక్కులు రాస్తే దానిచివర ఓపది పేజీలలో ముస్ముందు ఫిలింతియ్యడానికి పని కొచ్చేలా కథని టూకీగా రాయాలి అప్పుడు ఈ పేచీలు ఫంపెవు ముస్ముందు మాబోటి ప్రొడ్యూసర్ డైరెక్టర్ రైటర్లకి శ్రమా, పిగ రెట్లుఖర్చూ కూడా తగ్గుతాయి

కాబోయే ఫిలిండైరెక్టరు.

ఆర్యా,

సత్యము నకు కాశీకరించుట కియ్యది (మేము సత్యంబులాడువారము గాము) సంపాదక లేఖగాదు. తెరవేలుపులకు వినతి

మాకు నేటి పౌరాణిక సంచలన చిత్రంబుల వైఖరి రుచియింపకున్నది నృత్త భద్రగాశకటారోహణముగాని పావలాయును నాజెనుంనో సంగి టిక్కెట్టునంబడు చలనచిత్ర సభాప్రవేశసాధనముం గ్రయించుటగాని ఎరుంగనివారమాటంజేసి మీచిత్రములపై నిట్టివిమర్శంజేయుటకు మాకధికారము (అవసరముకూడ) లేనిమాట నిక్కమేయైనను సోదర పురాణపురుషుల, పురాణపురుషుల, పతివ్రతలపై మరికొంత గౌరవము మన్నన చూపపడగలదని గురాశపడుచున్నాము. తెర వేలుపులను పేరబడయుటం జేసి, ఇతర వేలుపులపట్లగూడ స్నేహసౌహార్ద్రములు బదర్శించి వారిని అవమానించకుండుట వాంఛనీయము గాదా

ఇట్లు

కొందరు పురాణపురుషులు

వార్తావరణం

శతదినోత్సవాలు

చెప్పదలచుకున్న ముక్కమీద గురితో, నలుగురూ కలసి చేసిన కృషి ఫలితం "అత్తా ఒకింటి కోడలే" ప్రేక్షకుల హార్దికాభివాదాలూ, వాటి తాలుకు ఆర్థికాను వాదాలూ పుష్కలంగా సంపాదించుకుంది. మంచి పేరూ, చాలాడబ్బూ సాధారణంగా ఒక దానితో ఒకటి "సింక్" కావని "డబ్బింగ్" ప్రవీణులు వెలిబుచ్చే ఊహాని అపోహాగా ఋజువుచేసిన చిత్రాలలో ఇది ఒకటి కాదగును అని ప్రేక్షకులు ఋజువు చేశారు.

ఇందుకు కృతజ్ఞతాభినందనలు తెలియ చేసుకోడానికి అనుపమ బృందం విజయవాడ రాబోయింది కాని, ఆ వేళకు అక్కడ ప్రవర్తిల్లుతున్న అస్థిమిత పరిస్థితుల కారణంగా ఆ ప్రయత్నం విరమించుకొంది. యువ దర్శక నిర్మాత కె. బి. తిలక్ ఇపుడు ఆ కథను తమిళంలో పునర్నిర్మిస్తున్నందువల్ల, ఈ శతదినోత్సవం, ఆ చిత్రం లాంఛన ప్రారంభోత్సవం కలిపి గతవారం మద్రాసు విజయా గార్డెన్స్‌లో జరిపారు. అనుపమ సంస్థపూర్వం ప్రారంభోత్సవం జరిపిన తాపీ ధర్మారావుగారు ఈ విజయోత్సవానికి అధ్యక్షత వహించారు.

శ్రీమతి సూర్యకాంతానికి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరిస్తున్న తిలక్.



చిత్రంలో పాల్గొన్న నటీనటులకూ టెక్నీషియన్‌లకూ నిర్మాత. తిలక్, ఈ చిత్రం డిస్ట్రిబ్యూటర్లయిన పూర్ణాపిక్చర్స్ తరఫున మంగరాజుగారి కుమారుడు కామరాజుగారూ రజతఫలకాలను, రజత పాత్రలను బహూకరించారు. పూలమాలలు వేసి సత్కరించారు. ప్రకాశ్ స్టూడియో (అక్కడే ఈ చిత్రం నిర్మాణం జరిగింది) అధిపతి కె. ఎస్. ప్రకాశరావుగారు ఈ బహుమతులను ఆయా కళాకారులకు అందజేశారు. వేదిక మీదికి ఒక్కొక్కరినీ పిలచి పరిచయం చేస్తూ, సరదాగా వ్యాఖ్యానిస్తూ ప్రత్యక్ష నివేదిక నడిపిన ఆరుద్ర, బహుమతి గృహీతలలో భర్తలు మటుకే హాజరైన (మిగతా వారు గైరుహాజరు కాలేదు; కారణాంతరాలవల్ల రాలేదు) సదవకాశాన్ని సద్యస్ఫూర్తితో సద్వినియోగించుకొని, "భార్యల" వంతు బహుమతి వచ్చినప్పుడు, అంత్యప్రాసలమల్లె (అశోక వనమున సీత, శోకం చెవియాగముచేత) "భర్త"లనే తిరిగి తిరిగి తిరిగి పిలిచారు. అందువల్ల గిరిజ బహుమతి కోసం జగ్గయ్య, ప్రమీల బహుమతికై రమణమూర్తి, సీత బహుమతికి కుటుంబరావు రెండోసార వచ్చి అలరించారు. ముసలి అత్తపాత్ర ధరించిన యువనటి లక్ష్మీకాంతమ్మ, అసలు అత్తపాత్ర ధరించిన సూర్యకాంతమ్మ, అత్తగానూ కోడలుగానూ ద్విపాత్రాభినయం చేసిన హేమలత, సున్నితమైన సుందరమైన హాస్యాన్ని సృష్టించిన రమణారెడ్డి బహుమతులు అందుకొన్నప్పుడు సదస్యులు ప్రత్యేక ప్రశంసలను విశేష కరతాళధ్వనులలోకి అనువదించి బహ్వాడా చేశారు.

తెర వెనుక

నటీనటులు సృష్టించిన చిత్రాన్ని చట్రం తొడిగి, కనడానికి వినడానికి అందంగా ఉండేలా తీర్చిదిద్దిన టెక్నీషియన్‌లు—

అత్తలకు ఉండతగ్గ కటుకుదనం, చురుకుదనం, శక్తిస్వరూపిణి శక్తి నెరిగిన పురుషుడి మాటల బెడుకుదనం నిత్యజీవిత సన్నివేశాలకు దగ్గరగా ఉండేలా పోషించి మాటలూ పాటలు వ్రాసిన పినిశెట్టి శ్రీరామమూర్తి, ఆరుద్ర, శ్రుతి మధురమైన సంగీతం సమకూర్చి పెండ్యాల నాగేశ్వర రావు, (గాయకులు ఘంటసాల, శ్రీనివాస్, సుశీల, జానకి రాలేదు) కళా దర్శకుడు చలం, ఛాయాగ్రహణ దర్శకుడు లక్ష్మణ్ గోరే అనుపమ బృందంలో తెరవెనుక యజ్ఞం చేసిన ముఖ్యులు.

కథల కథ

వీరంతా కాక, ఈ చిత్ర విజయానికి కారణమైన ఒక ముఖ్యాంశం జన్మకారణుడిని కూడా సత్కరించారు 'అత్తలూ కోడళ్లూ' అనే పేరిట ఈ చిత్రానికి మొదట చలనచిత్ర కథను వ్రాసినవారు బరంపురం కొల్లాడ అనే రచయిత ఆ ప్రాంతాలలో ఈయన తరుచు నాటకాలు వ్రాసి ఆడిస్తూ ఉంటారు ఆయన కథ ఆధారంగా దర్శక రచయితలు వర్తమాన చిత్రానికి కథను రూపొందించారు హిట్ చిత్రాలలో సన్నివేశాలతో బుర్రలు నిండిపోయి ఆ స్థితిలోనే కొత్త చిత్రాలకు కథలు ప్రసవించే చలనచిత్రకారులు అడపా తడపా ఇలా కథలు కాపోతే కథావస్తువునైనా ఇతర రచయితలనుండి తీసుకోవడం వాంఛనీయమనడానికి ఇదొక చిన్న సైజు అనుకూల వాదం.

సత్కారాల తరువాత కళాకారులంతా బహుమతులకు కృతజ్ఞత తెలుపుతూ మాట్లాడారు.

తాత్పర్యం

ధర్మారావుగారు వీరందరినీ అభినందిస్తూ, ఇంతమంది కలసిచేసిన కృషికి అర్హమైన సత్ఫలితమే ఈ విజయమని, ఇందరి సామర్థ్యాన్ని సమన్వయించి చక్కని రూపంలో పొందుపరచిన యువదర్శకుడు తిలక్ ప్రశంసనీయుడనీ అన్నారు ఒటువంటి విజయం

తిలక్‌కు ఇదివరకే లభించవలసిందని ఆయన చెప్పారు.

పోతే చిత్రం బాగోగులగురించి మాట్లాడే అర్హత, సామర్థ్యం "ఇక్కడ" కూర్చుని మాట్లాడేవారికి లేవనీ పల్లెటూరునుంచి రెండెడ్లబండి కట్టుకు బైస్కోపు చూడబోయే ఆ మహానుభావుడొక్కడే అఘటన ఘటనాసమర్థుడనిన్నీ ఒకసారి ఉత్తమ చిత్రానికి ఒకసారి ఉత్తమ చిత్రానికి డబ్బిచ్చే వాని లీలలు వానికికూడా తెలియవనిన్నీ, వాని హృదయగతాభిప్రాయ నిజ స్వరూపాన్ని తెలుసుకొనే ప్రయత్నాలే ఈ చలనచిత్రాలనీ చెబుతూ కొద్దిపాటి వాక్యాలలో చిత్రజగతి అయోమయస్థితిని వర్ణించ ప్రయత్నించారు...


మొత్తంమీద ధర్మారావుగారి ప్రసంగం అంతా విన్నమీదట, ఒకాయనకు కలిగిన ధర్మసందేహం విని మరొకాయన "ఫలానా చిత్రం బాగుందో లేదో తేల్చుకోవాలంటే

మనం ఏదైనా పల్లెటూరు వెళ్లి అక్కడినించి రెండెడ్ల బండిమీద బెజవాడవచ్చి పాతలా టికెట్టు కొనుక్కు చూడాలన్న మాట అది సంగతి," అని వివరించారు.

* * *

తరువాత తమిళ చిత్రం "మామియారుం ఒరు వీట్టు మరుమగళ్" లో నటించబోతున్న ఎస్. ఎస్. రాజేంద్రన్, బాలాజీ, రచయిత్రిలు ఉదయకుమార్, మురుదకాశి మాట్లాడారు. (రాజేంద్రన్ తారాపథాన్ని అందుకోవడానికి కారణమైన చిత్రం 'మొదలాళి.' దాని తెలుగు ప్రతి ముందడుగులో అతని పాత్రను జగ్గయ్య నటించాడు. ఇప్పుడు ఈ చిత్రంలో జగ్గయ్య భూమికను రాజేంద్రన్ ధరిస్తాడు.)

సభ అనంతరం, హాస్య నటుడు రమణారెడ్డి మాజిక్ ప్రదర్శనం జరిగింది. జగ్గయ్య వందన సమర్పణ చేశారు.



"అత్తా ఒకింటికోడలే" శతదినోత్సవసభలో మాటాడుతున్న తాపీ ధర్మారావుగారు,

ఇంటిగుట్టు

సంగీతా వారి సాంఘిక చిత్రం 'ఇంటిగుట్టు' ఫిబ్రవరి 14 న శతదినోత్సవాలు జరుపుకుంది. నిర్మాతలు అక్కిరాజు శాస్త్రి, ఎం. ఎస్. ప్రకాష్ గారల స్వస్థలం అయిన విశాఖపట్టణంలో ఈ ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

జిల్లా కలెక్టరు శ్రీ బి. జె. నాయుడు అధ్యక్షత వహించారు.

ఈ చిత్రంలో పాల్గొన్న వారిలో, సావిత్రి, సూర్యకాంతం. ఛమ్మడి. రేలంగి, మాస్టర్ బాబ్జీ. దర్శకుడు వేదాంతం రాఘవయ్య గారలు ఉత్సవానికి వెళ్లారు. ముఖ్య నటుడు ఎన్. టి. రామారావు, కొందరు టెక్నీషియన్లు కారణాంతరాలవల్ల హాజరు కాలేకపోయారు.

దర్శక నిర్మాతలకు, నటులకు డి. ఐ. జి. పతి శ్రీమతి పాటిల్ బహుమతులను పంచిపెట్టారు.

'ఇంటిగుట్టు' చిత్రంలో పాటలపై, డా॥ ఎం. రామచంద్రరావుగారు నిర్వహించిన పోటీలో గెలుపొందిన వారికికూడా ఈ సందర్భంలో బహుమతులు పంచిపెట్టారు.

నటుడు అమర్ నాథ్. శ్రీ సరళ చిత్ర అండ్ జన్మభూమి ఫిలింస్ పేరిట నిర్మిస్తున్న సాంఘికచిత్రం పైనూరు ప్రిమియర్ స్టూడియోస్‌లో చురుకుగా తయారవుతోంది. ఇప్పటికి మూడుసెట్లమీద పని పూర్తి చేశారు. అమర్ నాథ్, కృష్ణకుమారి, రమణారెడ్డి, రాజనాల, నలం, రాజారెడ్డి, హేమలత, కుసుమకుమారి మొదలగువారు ఈ చిత్రంలో నటిస్తున్నారు. మాటలు పాటలూ శ్రీ రామచంద్ (సతీ సుకన్య) వ్రాస్తున్నారు. సంగీతం నిత్యానందం సమకూర్చుతున్నారు. దర్శకుడు శోభనాద్రిరావు

వెంకటరమణా వారి 'బాలనాగమ్మ' భారీ ఎత్తున తయారవుతోంది. ఉగాదికానుకగా విడుదలకానివ్వదలచుకుంటున్నారు. గతవారం నిర్మాణ సౌలభ్యందృష్ట్యా, ఒకేసారి నాలుగు ఫ్లోర్లలో సెట్లు వేసి పనిచేశారు. రామారావు, రంగారావు, రేలంగి, అంజలీదేవి మొదలగు అగ్రశ్రేణినటులంతా ఇందులో పాల్గొన్నారు. ఈ చిత్రానికికూడా టి వి రాజుగారే సంగీతదర్శకులు. రచయిత సముద్రాల జూనియర్. దర్శకత్వం వేదాంతం రాఘవయ్య.

గీతాపిక్చర్స్‌వారి "ఋష్యశృంగ" చిత్రానికి గతవారం వాహినీలో ఒక నృత్యం చిత్రించారు. లత (టింగ్ రంగాలో నటించిన ఆశాలత) అభినయం చేసింది. నృత్య దర్శకుడు పసుమర్తి కృష్ణమూర్తి. ఛాయాగ్రహణం ఆది ఎం ఇరానీ. (తొలి తెలుగుటాకీ భక్త ప్రహ్లాదకు ఛాయాగ్రహణ దర్శకుడు ఈయనే.)

ఋష్యశృంగలో ముఖ్యపాత్రను కొత్త నటుడు హరనాథ్ నిర్వహిస్తున్నాడు రాజసులోచన, ఛమ్మడి, రేలంగి, గిరిజ మొదలగువారు ఇతరులు. ఈచిత్రానికి ముక్కామల కృష్ణమూర్తి దర్శకత్వం నిర్వహిస్తున్నారు నిర్మాత శేషాచలంచెట్టియార్



గీతా పిక్చర్స్ 'ఋష్యశృంగ' లో ఒక నృత్యం చిత్రణ జరిగించి ఆలోచిస్తున్న నృత్యదర్శకుడు పసుమర్తి కృష్ణమూర్తి, ఛాయాగ్రహణ దర్శకుడు ఆది ఎం ఇరానీ దర్శకుడు ముక్కామల కృష్ణమూర్తి

—ఈ పుటలో ఫొటోలు : సోమయాజులు



సుజనా ఎన్ఫర్సువారి 'సతితులసి'లో గుమ్మడి, యస్. వరలక్ష్మి.

★ నడుస్తున్న చిత్రాలు ★

రాస్కల్నికోవ్

అసలు దాస్తొయెవ్‌స్కీ పుస్తకంలో కాదు కాదు 'క్రైమ్ అండ్ పనిష్‌మెంట్' నవల రాయడంలో రాస్కల్నికోవ్ ముసలావిడని ఖూనీ చెయ్యడానికి కారణం (పరిభాషలో 'మోటివ్') చూపెట్టడం మర్చిపోయాడు ఆయన నవలలు చాలా హడావుడిగా ఉరవలూ పరుగులూ పెడుతూ రాసేవాడట అంచేత మర్చిపోయా డనుకోడానికి ఆస్కారం ఉందని కొందరు పత్రికావారుల ఊహ. మరికొందరు కాదు; అసలతనికి చాతనై ఉండదు ఖూనీకథ రాయడం అని కొందరి ఊహ.

అదీకాదు ఇదీ కాదూ, 1958 లో బాక్సాఫీస్ చిత్రాలకి పనికొచ్చేలా స్టోరీ రాయడం మజాకాకాదు అని ఇప్పుడు అనుకోవాలి. ఎలాగైనా అంత పెద్దవాడిని పట్టుకుని మనం ఇలా చిత్రం వచ్చినట్టు చివాట్లు పెట్టడం భావ్యంకాదు కాబట్టి, ఆయన కలలో కూడా తనకు బొంబాయి ఫిలింరెటు కాగల అదృష్టం పడుతుందని అనుమానించి ఉండడని అనుకుందాం. ఈ నైనం ఏమాత్రం పనిగట్టినా తన కథలో హంతకుడికి మోటివ్ పెట్టేవాడేమో. ఫిలిం సాంకేతికి కూడా కాని, సీనులు ఏర్పరచేవాడు. 'ఫిర్ సుబా హోగీ' ఫిలిం తీసే వేళకి ప్యాసా వంటి చిత్రాలలో సోనియా లాంటి పాత్రలు దశవాళీ ఫిలిములలో పాతబడిపోతాయనిగాని ఫిర్ సుభా హోగీలో మాలసిన్హా స్థూలంగా హీరోయిను వేసిందని గాని ఎవరైనా మూడ్ ఇచ్చివుంటే, తన కథలో సోనియాపాత్రని బాగా (హాలి) మార్చేసి ప్రొడ్యూసర్ డైరెక్టర్ రమేష్ సైగల్‌కి శ్రమ తగ్గించేవాడే... బహుశా, ఆయన హృదయం ఇదేనన్న భరోసాతోనే, "......"కి 'మనతోచిన తాత్పర్యం' అంటూ రమేష్ సైగల్, పైన పేర్కొన్న కథలో లోపాలు అన్నీ సవరించి, 'ఫిర్ సుబా హోగీ' అనే ఫొటోజెనిక్ పేరున ఫిలింతీసి విడుదల చేశారు.

రాజకపూర్, మాలాసిన్హా, నానాపల్సీకర్‌లు ఇందులో నటించి, "ఏదో ఇబ్బంది వచ్చినపుడే ఎవడైనా ఇలా ఖూనీలూ గట్రా చేస్తాడు. అంతేతప్ప నేరాలు పాపులర్ హాబీలు కావు' అన్న బొంబాయి నీతిని పునః పునరుద్ఘాటించారు. మ్యుజింలాంటి చిత్రాలు చూచినవారందరికీ ఇది బాగా తెలిసే ఉంటుంది. ఖులాసాకో అవసరానికో నేరంచేసిన ప్రతివాడినీ నేపథ్య పాటలతో వెనకేసుకొచ్చి, 'రాస్కెల్' అని మామూలుగా అనిపించుకునే ఈ రకం శాలీలని చూసిగ్లి పరిశ్ లేకుండా గుణభించవలసిందని సలహాలు యివ్వడం బొంబాయివాళ్ళ చిత్రాలలో మామూలు అయిపోయింది.

ఫిర్ సుబా హోగీలో ఈ మామూలుకి కొంచెం హంగుచేసి రాస్కల్నికోవ్‌ను 'రాస్కెల్ రామ్‌గా' తయారుచేయడం జరిగింది.

ఈ ప్రాతిపదికమీద నిలబడి చూస్తే మన మామూలు చిత్రాలలో బాగానే ఉంటుంది 'ఫిర్ సుబా హోగీ.' ఖయ్యాం సంగీతం విశేషాకర్షణ.

మోహన్ సెగాల్ కొత్తచిత్రం 'లాజ్‌వంతి' విడుదల అయింది నర్గీస్, కుసుంకుమారి, లీలామిశ్రా, బేబీనాజ్, బల్‌రాజ్ సాహ్నీ, ప్రభుదయాళ్, రాధాకిషన్ నటించారు. దర్శకుడు నరేంద్రసూరి, సంగీతం బర్మన్.

* * *

ఫిలింస్థాన్ వారి తాజా చిత్రం 'అంగన' మొన్న విడుదల అయింది. 'రజ్ రాణి' హీరో రెహమాన్ ఇందులో తిరిగి ముఖ్య పాత్ర (ఇటీవల కొన్ని చిత్రాలలో ప్రముఖ పాత్రలు ధరించడం విదితమే)ను నిర్వహించాడు. చాంద్, ఉస్మానీ, లీలా మిశ్రా, ఆగా, బద్రిప్రసాద్, రామావతార్ మొదలగు వారు పాల్గొన్నారు. దర్శకుడు ఒ. పి. దత్త, సంగీతం రోషన్.

* * *

'శకుంతల'ను మళ్ళీ తెరమీదకు తీసుకు వస్తున్నారు. ఈ సారి నాయిక నైజయంతిమాల గుమ్యంతుడు ప్రదీప్‌కుమార్

గుప్తాస్ కళామందిర్ అనే మద్రాసు

ఛలోక్తి

పిల్లల చిత్రాలు మంచివి రావటం లేదనీ, వారికై ప్రభుత్వ ఫిలిం డివిజన్ వారు కార్టూన్ చిత్రాలు నిర్మిస్తారనీ కేంద్రమంత్రి డా॥ కేస్కర్ ఇటీవల పార్లమెంటులో మళ్లీ ఛలోక్తి విసిరారు.

సంస్థ ఈ చిత్రం నిర్మిస్తోంది. సంగీతం ఎస్. డి. బర్మన్ సమకూర్చుతారు. ఈ చిత్రం తమిళంలో కూడా తీస్తారు. అందులో దుష్యంతుడు జెమినీ గణేశన్.

*　　*　　*

'తలాక్' చిత్రం తీసిన అనుపమ చిత్ర బృందం వారు ఈ సారి 'సంతాన్' అనే చిత్రం తీస్తున్నారు. అందులో నటించిన రాజేంద్రకుమార్, కామినీ కదమ్ ఇందులోనూ పాల్గొంటున్నారు. కథకుడు పండిట్ ముఖ్ రామ్‌శర్మ. ఇవన్నీ చూసి బాక్సాఫీసు సంప్రదాయాలు గమనించి కథా అదే అని భయపడ నక్కరలేదు. కౌటుంబిక ఇతివృత్తాలను అల్లుకురావడంలో - ఒక పల్లవిని ఏన్నో నా పాటలకు సరిపోగల నయ్యారులమలై ఈయన ప్రావీణ్యం గడించాడని ఫిలింవర్గాల వారు అంటారు.

ఈ చిత్రానికి దర్శకుడు జ్యోతిస్వరూప్ సంగీత దర్శకుడు దత్తారాం.

*　　*　　*

"అమాయకత్వం దోషంఅయితే నేను దోషినే" అని గడుసుదనంతో అమాయకత్వాన్ని చాటుకోగలిగిన ఒక అమాయక నాయిక జీవితం కథావస్తువుగా గోయెల్ సినీ కార్పొరేషన్ వారు ఒక చిత్రం నిర్మిస్తున్నారు. పేరు: "చిరాగ్ కహాఁ, రోష్నీ కహాఁ". మీనాకుమారి. రాజేంద్రకుమార్ నాయికా నాయకులు. మినుముంతాజ్, కుముంతాకూర్, ముంతాజ్ బేగం, మదనపురి, సుందర్ మొదలగు వారు పాల్గొంటున్నారు. దర్శకుడు దేవేంద్ర గోయెల్, సంగీతం రవి.

*　　*　　*

అలంకార్ చిత్ర వారి 'షరీఫ్‌బద్' చిత్రంలో దేవానంద్‌కు సుచిత్రసేన్ నాయికగా నటిస్తుంది. దర్శకుడు శంకర్ ముఖర్జీ సంగీతం రామచంద్ర.

*　　*　　*

నటుడు జైరాజ్ దర్శకత్వాన తయారైన హిందీ చిత్రం 'మొహర్' త్వరలో విడుదల కాబోతుంది.

జేబిమీద, దేనికోసం తిరుగుతాటు చేయాల్లో తెలీక మునపడుతూ (రెబెల్ ఇన్ సెర్చ్ ఆఫ్ ఎ కాజ్) ఈ లోగా సినిమాలో వేషాలు వేస్తూ, జీపు కారు స్పీడు లిమిట్ దాటి తోలుతూ కాలక్షేపం చేస్తున్న షమ్మీకపూర్ ఇందులో హీరో పాత్రధారి. నాయిక గీతాబాలి, భగ్‌వాన్, తివారీ, రణ్‌ధీర్, లలితా పాకర్ మినుముంతాజ్ ఇందులో పాల్గొన్నారు. సంగీతం మదన్ మోహన్.

*　　*　　*

పాటలలో పాదాలు చిత్రాలకు పేర్లుగా వాడటం తాజా మోజుగా కనిపిస్తోంది. ఇదేదో కూడని పని అని పై వాక్యం మీతో స్పష్టంగా చెబితే అది పచ్చిఅబద్ధం అని గ్రహించగలరు. కొత్త పోకడ కనిపిస్తే హర్షించని వాడుండడు. ఎటొచ్చి, "ఇది కొత్తది" అన్న రెండు మాటలూ ఉచ్చరించే లోగా అది బహుపాతది అయిపోయేలా అందరూ అనుకరిస్తేనే అనుకోవడం.

మొత్తం మీద 'మైనషేఁ మేఁ హూఁ' 'జాయెతో జాయే కహాఁ' వగైరాలు ఈ కోవలోవి. మరికొన్ని త్వరలోనే వినబడతాయి.

'మైనషే మే హూఁ' చిత్రంలో రాజ్ కపూర్, మాలాసిన్హా ముఖ్య వస్తువులు. 'నిష్మీ', నిషాలు కథా వస్తువులు. ముబారక్, నజీర్ హుసేన్, ధుమల్, మారుతి, లీలా చిట్నిస్ కూడా పాల్గొన్నారు. సంగీతం శంకర్ జైకిషన్‌లు సమకూర్చారు. దర్శకుడు నరేష్ సెహగల్.

'జాయెతో జాయె కహాఁ' నానాభాయ్ భట్ దర్శకత్వాన తయారవుతోంది కరన్‌దివాన్, జయశ్రీ, నదీరా, షమ్మి, భగవాన్ నటిస్తున్నారు. సంగీతం చిత్రగుప్త

దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన జానపద నృత్యాలన్నిటినీ సమీకరించి నృత్య సంపుటిగా రూపొందిస్తూ ఫిలింస్ డివిజన్ వనువున దర్శక నిర్మాత వి. శాంతారాం ఒక డాక్యుమెంటరీ నిర్మించారు. 8 వేల అడుగుల నిడివిలో తయారైన ఈ చిత్రం పేరు 'నర్తకా ఝంకార్' ఈస్ట్‌మన్ కలర్‌లో తీశారు దీనికి స్క్రిప్టు రచన దర్శకత్వం ఎ. భాస్కరరావు నిర్వహించారు.

*　　*　　*

రాజకీయాలూ చలనచిత్రాలూ దగ్గిర చుట్టరికం కలుపుకుంటున్నాయి. సినిమాను చిరకాలంగా చిన్నచూపు చూస్తూవచ్చిన రాజకీయవాదులు ఇపుడు దీని అవధులను శక్తి సామర్థ్యాలను బాగా గుర్తించారు. పశ్చిమ జర్మనీలో ప్రతిపక్షంఅయిన డెమోక్రాటిక్ పార్టీ వారు ఇపుడు చలనచిత్ర వ్యాపారం కూడా వారి కార్యక్రమంలో భాగంగా కలుపుకొన్నారట. జర్మన్ కార్మికసంఘ సహాయ సహకారాలతో వీరు ఒక ఫిలిం కంపెనీ నడుపుతారు. ఇదికాక, ఇతరదేశాల నుండి ఈ దేశానికి రాగల అవకాశాలు లేని మంచి చిత్రాలను (మనదేశానికి అమెరికన్, బ్రిటిషుచిత్రాలు వినా మరో దేశ నివి వచ్చే సదుపాయం లేనట్టు) తెప్పించి ప్రదర్శిస్తారట. ఉత్తమ చిత్రాలను తెప్పించి ప్రదర్శించడానికి ప్రత్యేకం ఆర్ట్ హౌసెస్ ఏర్పాటు చేయాలనికూడా వీరు ప్రయత్నిం



శ్రీ రామచంద్రా ప్రొడక్షన్స్ వారి 'ఇల్లాలి అదృష్టమే ఇంటికి భాగ్యం'లో సావిత్రి.

★ నవీన ఆర్థికశాస్త్రం ★

(11వ పేజీ తరువాయి)

ఆర్థికశాస్త్రంలో ఏం చెప్పారంటే— ముక్కు వున్నది, పడిశెమూ వున్నది అన్నారు. అలాగే మనిషీ వున్నాడు, కోరికలూ వున్నయ్; వాటినితీర్చుకోడంకోసం రాత్రిం బగల్లు తంటాలుపడుతున్నారు. ఆ కోరికలు ఎక్కడ ఎలాతీర్చుకోవాలో చెప్పేదే ఆర్థిక శాస్త్రం.

నీతి :

ఆర్థికశాస్త్రం నీతికి తలవంచాలని కొందరంటారు. అలా అనేవాళ్ళకు తల వున్నదా అని మా సందేహం ఇది నీతి, ఇది అవినీతి అని అశోకుడు ఎక్కడా శిలాశాసనం వేయించలేదు. మేనమామకూతుర్ని ఒకరు చేసుకుంటారు; పినతండ్రికూతురు మరొకరు చేసుకుంటారు, హిమాచల ప్రదేశ్‌లో అయితే ఒక స్త్రీకి ఐగుగురు భర్తలుంటారు. ఇందులో ఏది నీతి, ఏది అవినీతి?

అందుకనిన దీని ఆర్థికశాస్త్రంలో ఏం చెప్పారంటే—డబ్బు సంపాదించే మార్గాలన్నీ నీతిగాను, డబ్బుపోగొట్టుకునే మార్గాలన్నీ అవినీతిగాను లెక్క కట్టుకున్నారు. దీనిప్రకారం చూస్తే—డబ్బుదానం పుచ్చుకోడం నీతి; దానమివ్వడంనీతి. మున్సిపాలిటీ సైకిల్ పన్ను వేయడం నీతి; చెల్లించడం అవినీతి. ప్రభుత్వానికి అమ్మకంపన్ను దేశంలో 200 కోట్ల రూపాయలు బకాయిపడిందని పత్రికల్లోవచ్చింది. ఐనా గాబరాపడనవసంలేదు. పన్ను వేయడం ప్రభుత్వానికి నీతి; దాన్ని ఎగవేయడం వ్యాపారస్థుల నీతి. అంతకన్న మరేంలేదు. ఇంతకూ దీని "సమ్మరీ" ఏమిటంటే—ధనంమీద నిజమైన భక్తి ప్రపత్తులు గలవాడు నీతి నియమాలకు అతీతంగావుంటాడు, వుండాలి అని.

వ్యాపారం:

వ్యాపారం అనంగానే పెట్టుబడి గుర్తుకొస్తుంది. పది వేలో పదిహేను వేలో చేతులో లేనివాడు అజోలికి పోకూడదని అంతా అనుకుంటారు. ఇది ఒక "రాంగనోషన్."

అసలు వ్యాపారంఅంటే ఏమిటి? వ్యాపారం అంటే డబ్బుసంపాదించే మార్గమని నిర్వచించవచ్చు. పెట్టుబడిపెట్టి వ్యాపారం అందరూ చేయగలరు దాన్ని గురించి ప్రాచీన ఆర్థికశాస్త్రంలో చెప్పనే చెప్పారు. నయాపైసతో నిమిత్తంలేకుండా వ్యాపారం ఎలాచేయాల అనేది నవీనఆర్థిక శాస్త్రంలో చెప్తారు. నేటిప్రజలకు అర్జంటుగా కావలసింది ఇదే.

పూర్వం హర్షవర్ధన మహారాజు ఐదేళ్ళకొకసారి "సర్వస్వదానం" చేసేవాడు. ఐదేళ్ళలో నూతన ఖజానా చేరినధనం యావత్తూ పైకంతో సహా దానంచేసేవాడు (నవీన ఆర్థికశాస్త్రంప్రకారం ఇది పచ్చి అవినీతి కిందికివస్తుంది.) 20వ శతాబ్దంలో అంత తెలివితక్కువ రాజుండడు. అసలు ఇలాంటి చాదస్తాలకు రాజ్యాంగం ఒప్పుకోదు! అయినా ఆ వాసన ఇంకా మనుషులో, పోలేదు. ఐదేళ్ళకొకసారి దేశవ్యాప్తంగా ఎన్నికలు అనబడే సంరంభం జరుగుతుంది. ఆతరుణంలో వందలకొలది సజ్జనులు కూచోలేక నిలబడుతారు. వాళ్ళు నెలరోజులపాటు "సర్వస్వదానం" చేస్తారు. డబ్బుచాలకపోతే తలతాకట్టుపెట్టి అప్పు అయినా తెచ్చి ఇస్తారుగాని నోటమీదుగా లేదనరు. ఈ విషయంలో హర్షుడుకూడా వాళ్ళముందు ఆగడు. తరుణం వచ్చినపుడు చూసి, తగువిధంగా వ్యవహరించి డబ్బుచేసుకోవడం పెట్టుబడితో నిమిత్తంలేని వ్యాపారానికి చక్కని ఉదాహరణ.

వ్యాపార పరమావధం ఐ. పి. దాఖలు చేయడం అనిచెపితే ముక్కుమీద వేలు వేసుకుంటారు. పూర్వం అసత్యంచెపితే ఆశ్చర్యం కలిగేది. ఇప్పుడు సత్యంచెపితే ఆశ్చర్యం కలుగుతోంది! ఐ. పి. దాఖలు చేయడమంటే ఫకీరు అయిపోయి జోలె తొడుక్కోవడం అని అంతా అనుకుంటారు. అది పొరబాటు. నవీన ఆర్థికశాస్త్రం ప్రకారం దివాలా తీయడమంటే అప్పులెగవేయడంవరకే అర్థం. ఆస్తుల సంగతా? అవి ఎక్కడికీపోవు. కాళ్ళుంటేగా పోవడానికి? భార్య పేరుతోటి బావమరది పేరుతోటి వుండిపోతయ్. కాలం అనుకూలించినపుడు జతులోకివస్తయ్.

అప్పులు :

పూర్వం అప్పులుచేయడం దోషంగా పరిగణించేవాళ్ళు హారిహారీ! అంతకంటె దారుణం ఇంకేమైనా వున్నదా? నవీన ఆర్థిక శాస్త్రరీత్యా అప్పులు బాగా చేయగలవాడు పలుకుబడి బాగా కలవాడికింద జమ. మనకు లోకంలో పరువు ఎంత ఎక్కువగా వుంటే అప్పులు అంత ఎక్కువగా వుంటయ్.

అప్పుచేయడం మానవధర్మం! వందలు సంపాదించేవాళ్ళు వేలల్లోనూ, వేలు సంపాదించేవాళ్ళు లక్షల్లోనూ, ఆఖరికి సర్కారువారు కోట్లల్లోనూ అప్పులు చేస్తున్నారు. ఎటుతిరిగీ అస్తినిమించి అప్పులుచేయడం పురుషలక్షణమని యావన్మంది అంగీకరిస్తున్నారు.

ఈ అప్పులు ఎలా తీర్చాలాఅని కొందరు రాత్రిళ్ళు నిద్రపట్టక బాధపడుతుంటారు. అప్పుతీర్చనివాణ్ణి ఉరితీయాలని ఇంతవరకూ ఏ న్యాయస్థానమూ తీర్పు చెప్పలేదు, ఇది అంత జీవన్మరణ సమస్య కాదు. కొత్త అప్పులుచేసి పాతఅప్పులను లక్షణంగా తీర్చుకోవచ్చు! ★

(10–వ పేజీ తరువాయి)

ఇంకో విధంగాకూడా పెళ్లిళ్లు చేసుకుంటారు. ఓ కుర్రవాడు ఓ కుర్రదాన్ని ప్రేమిస్తే, ఆ కుర్రవాడు కుర్రదాని తల్లిదండ్రుల వద్దకు ఓ గ్లాసెడు జీలుగుకల్లు తీసుకువెడతాడు. ఆ కల్లు తల్లి, తండ్రీ, కుర్రదీ పుచ్చుకుంటే సంబంధం నిశ్చయమైనట్టే అన్నమాట. వారి వివాహవిందు కుండలకొద్దీ జీలుగుకల్లు త్రాగటమే. అదే వారి వినోదం. ఒకే మొగవాడు అనేకమంది భార్యలను చేసుకునే పద్ధతికూడా కొందరిలో వుంది.

ఈ కొండజాతులవారికి పంచాంగాలు కూడా వున్నాయి. పంచాంగం చెప్పే గురువూ, మందులు ఇచ్చే వైద్యుడూ సర్వసర్వత్రా ఒకడే అయివుంటాడు. వారు చిత్రోత్సవం జరుపుకుంటారు, అది అడవి జాతులకు మన సంక్రాంతివంటి పండుగ. ఇంకా గుమ్మడికాయల పండుగ, అడ్డకాయల పండుగ; కొర్రకోత; దసరా ఇవి వీరి పండుగలు. చాలావరకు ఈ పండుగలు కోతల అనంతరమే జరుగుతుంటాయి.

వీరివి ఎంత అమాయికపు జీవితాలంటే, వీరిలో కొంగతనాలు, తగాదాలు, దెబ్బలాటలు అన్నవేవుండవు. ఏదైనా తేడా వస్తే, పదిమంది చెప్పినట్టువిని దాని ప్రకారం నడుచుకుంటారు.

పోతురాజు, మోడమ్మ, మూని, వీరి ఇలవేల్పులు. కోళ్లు, దున్నపోతులు, మేకలు ఈ ఇలవేల్పులకు బలిఇస్తారు. అనాధ బాలబాలికలను ఎంతో జాగ్రత్తగా గ్రామమంతా కలిసి పెంచుతుంది.

పది కుగ్రామాల వాళ్లు కలవటమన్నది వాళ్లు పండించుకున్న అడవిసంపదను అమ్ముకునేందుకు సంతలకు వెళ్లినప్పుడే. చావులు, పుట్టుకలు ఈ సంతల మూలంగానే పదిమందికీ తెలుస్తుంటాయి.

ఈ అడవి జాతులకూ సంగీతం, నృత్తి నృత్యాలు వారివారి నాటకాలు వున్నాయి. "సంకటి గీతము" అనేదాన్ని ఓ స్త్రీని ప్రేమించిన యువకుడు పాడతాడు. "గోపీలీల", "రామరావణ యుద్ధం" లాంటి నాటకాలను ప్రదర్శిస్తుంటారు.

నిత్యం సాయంత్రం కాగానే వారు నృత్యాలు ప్రదర్శించుకుంటూ, సంగీతం పాడుకుంటూ ఆనందిస్తుంటారు. దాదాపు పది పద్ధతుల నృత్యాలున్నాయి వారికి. కోలాటముకూడా వేస్తుంటారు.

భూమి సాగు

అరకులోయలో మొత్తం 1,58,622 ఎకరాలలో 1,09,491 ఎకరాలు అడవి. 6,245. ఎకరాలు బంజరు; అసలు వ్యవసాయయోగ్యం కానిది 9,061 ఎకరాలు. మొత్తం సేద్యంచేసి పంటలు పండించే భూమి. 37,675 ఎకరాలు; మాగాణి భూమి 3076 ఎకరాలు.

వారికి దైవందిన జీవితం నిత్యకళ్యాణం, పచ్చతోరణంగా వుంటుంది. నాగరికతా వాసనలు వ్యాపించడం ప్రారంభమైనాయి. ఆ నాగరికతతో వారిలో కూడా సమాజ అసంతృప్తి మొదలైంది.

నాగరిక ప్రజలకన్న ప్రభుత్వం, ఈ గిరిజనుల శ్రేయస్సుకు ఎక్కువ శ్రద్ధ చూపడం అవసరమనిపిస్తుంది. నాగరిక ప్రజలకు సమకూరుస్తున్న సదుపాయాలలో ఏ కొంచెం సమకూర్చినా వీరు తప్పక బాగుపడతారు.

శ్రీరామమూర్తి గారి దండకారణ్య పథకం పూర్తిగా ఫలిస్తే వీరి సంపూర్ణ శ్రేయస్సుకు మార్గం ఏర్పడుతుంది. ★

[గమనిక
కారణాంతరాలవల్ల ఈవారం న్యూఢిల్లీ లేఖ ప్రచురించలేకపోయినందుకు పాఠకులు మన్నించగలరని ఆశిస్తున్నాము.
—సం]

దేశంలో అంధులకు సహాయం

(48-వ పేజీ తరువాయి)

ర్థులు చదువుకుంటున్నారు. కేంద్రాధీన మయోక దీనికి "ట్రెయినింగ్ సెంటర్ ఫర్ ది ఎడల్ట్ బ్లయిండ్" అని పేరు.

ఈ సంస్థలో రెండు శాఖలున్నాయి. ఏర్పాటు చేయబడింది విద్యార్థులకు వ్రాయను చదువను కాకుండా వ్యవసాయిక శిక్షణ కూడా ఇవ్వబడుతుంది. ఇక్కడి విద్యార్థులకు బ్రెయిలీ లిపిద్వారా హిందీ, లేక ఇంగ్లీషు నేర్పుతారు. ఇంతే కాక నవారు అల్లడం, దుప్పట్లు-కంబళ్ళు నేయడం, కొవ్వొత్తులు-సిరబుడ్లు తయారు చెయ్యడం, పేము కుర్చీల అల్లకం మొదలైన పన్ని నేర్పుతారు. ప్లాస్టిక్ పనులు, రాట్నం వడకడం కూడా చెప్తారు. వీటితో బాటు విద్యార్థులకు టైప్ రైటింగ్ షార్ట్ హేండ్ లలో కూడా శిక్షణ ఇవ్వబడుతుంది. ఈ సంస్థలోని మరొక ముఖ్యమైన అంగం సంగీత శిక్షణ. మామూలు పాటలు—శాస్త్రీయ సంగీతం రెండూ కూడా నేర్పుతారిక్కడ.

ఇటువంటి శిక్షణ మన దేశంలోని పెద్ద పెద్ద కేంద్రాలలో ఉంది. ఈ సంస్థలో నూట యాభైమంది విద్యార్థులు శిక్షణల పొందుతున్నారు. వారి ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తోంది. వారికి డాక్టర్ చికిత్స కూడా ఉచితంగా చేస్తారు. ఇక్కడ క్రమం ప్రకారం అనుసరించి అందరికీ ప్రవేశం లభిస్తుంది.

గత సంవత్సరం ఇక్కడ ఒక మహిళా విభాగం కూడా పెట్టారు. ఈ విభాగంలో స్త్రీలకి చేతిపనులు, కుట్టూ కూడా విద్యతో పాటు చెప్పబడతాయి. ఏభయిమంది ఆడవారికి తగిన సౌకర్యాలిక్కడ ఉన్నాయి.

దేశంలో ఇప్పటివరకూ అంధబాలుల విద్యకి తగిన సౌకర్యాలు లేవు. కాని 9151 లో అజమేర్, కిట్బలలో పాఠశాలలు పెట్టిన తరువాత ఈలోటు కొంత భర్తీ అయింది. డెహరాడూన్‌లో భారత ప్రభుత్వం అంధుల కోసం ఒక ఆదర్శపాఠశాల స్థాపించబోతోంది. ముమ్ముందు ఆ కార్యం సఫలం కాగలదని ఆశిద్దాం. ఈ పాఠశాలలో చిన్నవయస్సు పిల్లల్ని చేర్చుకుంటారు. ఇక్కడ ఉపాధ్యాయుల శిక్షణకి కూడా వేరే ఏర్పాటుంటుంది.

శిక్షితులైన అంధులకి ఉద్యోగాలివ్వడం భారత ప్రభుత్వానికి సమస్యగా ఉంది. ప్రభుత్వం ఈ సమస్యని తేలిక చెయ్యడం కోసం 1956 లో మద్రాసులో ఒక విభాగం స్థాపించింది. వివిధ వృత్తుల్లోని గుడ్డివారికి పని కల్పించడమే దీని లక్ష్యం. ఇప్పటి వరకూ జరిగిన లెక్కల ప్రకారం పెద్దనిమిది వందలో డెబ్బయిమందికి 'ఉద్యోగ సౌకర్యాలు' కల్పించింది ఈ విభాగం. భారత ప్రభుత్వమే కాక కొన్ని ఇతర ప్రభుత్వ సామాజిక సంస్థలు కూడా అంధుల ఉద్యోగాల విషయంలో తోడ్పడుతున్నాయి.

1952 లో అంధుల కోసం జరిగిన సమ్మేళనంలో అన్ని ప్రభుత్వ ప్రతినిధులూ పాల్గొన్నారు. ముఖ్య విషయాల చర్చానంతరం "నేషనల్ ఎసోసియేషన్ ఫర్ ది బ్లయిండ్" స్థాపించబడింది. దీని ముఖ్య కార్యాలయం బొంబాయిలో ఉంటుంది.

1955 లో తిరిగి ప్రభుత్వం అంతర్జాతీయ అంధుల సమస్యమీద మసూరిలో ఒక గోష్ఠి జరిగింది. విశ్వవిఖ్యాత అంధమహిళ మిస్ హెలెన్ కెల్లర్ దానికి ముఖ్య అతిథిగా వచ్చారు. భారతీయ భాషల్లో బ్రెయిలీ సాహిత్య నిర్మాణం గురించి వర్కింగ్ చేసినారీ గోష్ఠిలో. అంతే కాకుండా అంధులు రాసుకునే, ఆడుకునే వస్తువుల తయారీ కోసం, మన్యంలో అంధులైనవారి వసతి అవసరాలగురించి చర్చించారు.

1950 లో మన ప్రభుత్వం భారతీయ బ్రెయిలీ లిపిలో సాహిత్య నిర్మాణం కోసం డెహరాడూన్‌లో "సెంట్రల్ బ్రెయిలీ ప్రెస్" పెట్టింది. ఆగ్నేయ ఆసియాలో ఇదొక్కటే బ్రెయిలీ ప్రెస్. బొంబాయిలో ఇలాంటి ప్రెస్ ఒకటి ఉన్నా అదింకా పని ప్రారంభించలేదు. అదికూడా పని మొదలెడితే దేశంలో తగినంత బ్రెయిలీ సాహిత్యం ముద్రితం కావచ్చు.

డెహరాడూన్‌లో నన్న "సెంట్రల్ బ్రెయిలీ ప్రెస్" లో ఇప్పటివరకూ హిందీ-గుజరాతీ-మరాఠీ-తమిళం-తెలుగు-ఇంగ్లీషు లలో సుమారు ఏభయి పుస్తకాలు అచ్చయాయి. వీటిలో పిల్లలకి సంబంధించిన చరిత్ర-భూగోళం-సాహిత్యం మొదలైన పుస్తకాలు చాలా ఉన్నాయి. అంతే కాదు. రవీంద్రనాథ్ టాగూర్, ప్రేమచంద్ మొదలగు సుప్రసిద్ధ రచయితల పుస్తకాలుకూడా తయారవుతున్నాయి. స్వామి శివానంద రచించిన "గీత" ఇంగ్లీషు బ్రెయిలీ లిపిలో ఇటీవలే ముద్రితమయింది. ఇవి చాలా ప్రతులు విదేశాలకు పంపబడ్డాయి.

అంధుల సంపూర్ణ వికాసంకోసం "ఆలోక్" అనే త్రైమాసపత్రిక హిందీ బ్రెయిలీ లిపిలో అచ్చవుతోంది. దీంట్లో కథలే కాక సామాజిక వ్యాసాలు, కవిత్వాలు కూడా ఉంటాయి. ఈ పత్రికలో స్త్రీలకి, పిల్లలకి ప్రత్యేక శీర్షికలున్నాయి. ఈ పుస్తకం అంధులకు మూడవవంతు ఖరీదుకి ఇవ్వబడుతుంది.

ఇంకా ఈ ప్రెస్‌లో అంధులాడుకునే చదరంగం సామానులు రాసుకునే పలకలు తయారుచేస్తారు. ఇవి మన దేశంలో చెయ్యడంవల్ల విదేశాలనించి తెప్పించనక్కరలేదు. ప్రెస్ పెట్టి ఎనిమిదేళ్ళు కావొస్తున్నా తగినంత తయారీ కావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఇప్పుడు దీని అభివృద్ధికి ఏర్పాట్లు చేస్తోంది ★

అందని పళ్ళు

(23-వ పేజీ తరువాయి)

వందా యాభై శలవులు - అధికారుల వత్తిడి తక్కువ—అందుకోసం - వస్తా ట్యూషను కళ్ళాలి" అంటూ వెళ్ళబోగాడు

"రవిన్యూ ఇన్‌స్పెక్టరుగిరీ వదిలేశావా?" ఆపి ప్రశ్నించాను.

"మా నాన్న తిథికి శలవడిగాను 'జమాబందీలసమయం, ఇవ్వడానికి వీలేదన్నాడు తహసిల్ దారు. నాకు ఒళ్ళుమండి రాజీనామా గీకేశాను. అయినా అదొక పెద్దవద్యోగం కాస్తా లేదూ. పాడూ లేదు;" నా మెదడులోకి కొన్ని ప్రశ్నలు చొప్పించి సత్యం నిష్క్రమించాడు

సత్యానికి ఒకనాడు ఉపాధ్యాయ వృత్తి దేశనిర్మాణం, అంతర్జాతీయ శాంతి ధ్యేయాలుగా వున్న పవిత్రమయిన వృత్తిగా కనబడింది. ఆ ట్రెయినింగు కసా ఫెయిలయ్యేసరికి అదొక గాడిదలు మేపే వుద్యోగంగా కనబడమే గాక ఆ రెవిన్యూ యిన్‌స్పెక్టరుగిరి యింద్రపదవిగా భాసించింది ఈనాడు సత్యం ఫెయిలయిన ట్రెయినింగు పరీక్షకోసం చదువుతున్నాడంటే ఆశ్చర్యం గాక మరేమిటి? అసలు సత్యం ఆ యింద్రపదవిని యెందుకు కాలదన్నాడు? "పవిత్రంగా", "గాడిదలు మేపే వుద్యోగం"గా కనిపించిన ఉపాధ్యాయవృత్తి యీ డోసారి "శలవులు అధికంగా వున్న వుద్యోగం"గా సత్యంకు కనిపించడంలో అంతర్యమేమిటి?

భుజంమీద యెవరో చెయ్యి వేశారు. ఆలోచనలకి కళ్ళెం వేస్తూ వెనుదిరిగి చూశాను— శంకరం.

చాలదినాల తర్వాత కలుసుకున్నాం కనుక అనేక విషయాలు మాట్లాడుకున్నాం ఆ మాటల్లో సినిమా సమయం మించిపోవడం కూడా తెలియలేదు.


"ఆఁ......సత్యాన్ని డిస్మిస్ చేశారు తెలుసా?" అన్నాడు శంకరం

"ఏం?" ఔత్సుక్యంతో ప్రశ్నించాను

"ఆఁ...ఏముంది...ఏదో కరప్షను కేసట" అన్నాడు శంకరం.

నా మనస్సులోని సందేహాలన్నీ తీరిపోయాయి. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



హంపీలోని పంపాపతి దేవాలయం

శిథిలం కాకుండా నిలిచిన హంపీ కట్టడం ఇదొక్కటే. ఇప్పటికీ పూజాదికం జరుగుతున్నది.

ఫోటో : డి. అన్నాజీరావు]


పుష్పము వలె...
రెక్సోనాతో మీ చర్మ సౌందర్యము
వికసించును
రెక్సోనా సబ్బులోనున్నట్టి కేడిల్—
ఒక ప్రత్యేక నూనెల మిశ్రమము—
చర్మమును పోషించి,
మీ సహజ సౌందర్యమును
బయల్పరచును !
Rexona
BLENDED WITH CADYL
ఇది ఒక్కటే కేడిల్‌తో గూడియున్న టాయ్‌లెట్ సబ్బు